
# తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు



RC. GNT-07-0-28
The Chillipraln Publishers [illegible] Distributors
PROP. SMT. CH. PUSHPAVATHI
D. NO. 11-30-8 RAMIREDDIPET
NARASARAOPET - 522 601.
GUNTUR (DT.) A.P.

## డా॥ సి. రమణయ్య
ఎం.ఎ., పిహెచ్.డి.

రీడర్, సాహిత్యపీఠం,

తెలుగు విశ్వవిద్యాలయం, రాజమండ్రి.

ప్రథమ ముద్రణ : 1989

ప్రతులు : 1000

వెల రూ॥లు : 18/-

ప్రతులకు :

**డా॥ ఎ. పద్మబాల**

పద్మబాల పబ్లికేషన్సు

17-20/3, కటారి గార్డెన్స్

రాజమండ్రి-533 103.

24448

అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయము
అన్నమయ్యవీధి, గుంటూరు-

780

ముద్రణ :


కొండపల్లి ఇంప్రెషన్స్.

కోటిపల్లి బస్‌స్టాండ్,

రాజమండ్రి - 533 101.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | తాళ్ళపాక వారి వంశవృక్షము | 1 - 29 |
| 2. | తాళ్ళపాక వారు - స్వామి కైంకర్యములు | 30 - 47 |
| 3. | తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు | 48 - 108 |


This book is published with the financial assistance of Tirumala Tirupati Devastanams under their Scheme aid to publish Religious Books.



## కృతజ్ఞతలు

"తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు" అనే ఈ గ్రంథ ముద్రణకు ఆర్థిక సహాయము నందించిన తిరుమల తిరుపతి దేవస్థానము వారికి కృతజ్ఞతలు. ఈ గ్రంథ రచనకు, ఆధారముగా నున్న ఆయా గ్రంథకర్తలకు, ప్రతులను సకాలములో ముద్రించిన కొండపల్లి ఇంప్రెషన్సు వారికి "తాళ్ళపాక పెదతిరుమలాచార్యుని" ముఖచిత్రమును వేసి యిచ్చిన శ్రీ బి. బాపునాథ్ గారికి, అందుకు కారకులైన శ్రీ సుదర్శన్ (TTD) గారికి కృతజ్ఞుడను.

— రచయిత.

# తాళ్ళపాకవారి వంశవృక్షము

భారతదేశమందలి ఆంధ్రప్రదేశ్ లో కలియుగ వైకుంఠముగ ప్రసిద్ధివడసిన తిరుపతిదివ్యక్షేత్రమునేడు జగద్విఖ్యాతము. క్రీ శ. 15, 16 శతాబ్దములలో శ్రీవేంకటేశుని అనుగ్రహమున, తిరుమల తిరుపతులలో తాళ్ళపాక కుటుంబమువారు నెలకొని తిరుమల క్షేత్రసౌభాగ్యమును పదివేల జిహ్వాలతో పాడి లోకమునకు చాటిరి.

తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామి అనుగ్రహమున తాళ్ళపాక వారికి పేరు ప్రఖ్యాతులు కల్గినట్లు, తాళ్ళపాకవారి మూలమునను తిరుమలస్వామికి ప్రశస్తి గల్గినది. అవినాభావ సంబంధమున వీరికి పరస్పరము కీర్తి వచ్చినదనియే చెప్పవచ్చును. ఇంతవరకును ఎవ్వరు ఏక్షేత్రమునకు చేయనిసేవ తాళ్ళపాకవంశమువారు తిరుపతి క్షేత్రమునకు చేసిరి. ఏ కవి సంఘము పొందని ఖ్యాతిని పొందిరి. విజయనగర రాజులు వేంకటాచల క్షేత్రమునకు చేసినసేవ యంతయు ఒక ఎత్తు. తాళ్ళపాక వారు చేసిన సేవ ఒక ఎత్తు. సాళువ నరసింహరాయని సమకాలికుడైన తాళ్ళపాక అన్నమాచార్యుని మొదలుకొని సదాశివ రాయల తర్వాత కాలమువరకు విఖ్యాతి నొందిన తాళ్ళపాక వంశము వారు ఆంధ్రుల భాషా సాహిత్యములకును, సంగీతమునకును మాత్రమే గాక, వైష్ణవ మతమునకును, తిరుమల క్షేత్రమునకును విశేషముగ సేవ జేసిరి. వీరి సేవ నేటికిని తిరుపతిలో అక్షరరూపమున దర్శనీయ మగుచున్నది.

వీరశైవ మత ప్రచారమునకై తమ శక్తి సామర్థ్యములను అంకితము జేసి సాహిత్యమును సాధనముగ క్రొంగొత్త రీతులను వెల యించిన నాటి శైవకవుల నవ్యతయు, మతమన్నది నేత్రపట్టమై, సాహితీ చంద్రాలోకనము కోల్పోయి అంధకారమున తడవులాడు కొనుచుండిన అక్షరాస్యులకు మహాకవిత్వ దీక్షావిధిబూని రసాలోకము

కల్పించిన తిక్కనగారి మనీషయు, తాళ్ళపాక వారిలో అతిరమ్యముగ మేళవించినవని చెప్పవచ్చును. ఆంధ్ర సాహిత్య గౌరవభావమును వారందరును కలసి మోసినంత తాళ్ళపాక కుటుంబము వారొకరే మోసియున్నారు. అందువలన తాళ్ళపాకవారికి ఆంధ్ర వాఙ్మయ ప్రపంచమున విశిష్ట స్థానమున్నది.

తాళ్ళపాక వారొక్కరుగారు, వీరు పదిమంది ఈ పదిమంది భిన్నులుగాక ఒకే కుటుంబమువారు. ఆ వంశములో పుత్రులు, పౌత్రులు, ఆడువారు, దౌహిత్రులు అందరు కలసి ఒక సంస్థగజేరి, కళారాధనము గావించుచు శ్రీ వేంకటేశ్వర సేవలో తరించిరి.

తాళ్ళపాకవారి జన్మస్థానము నేటి కడపజిల్లా రాజంపేట తాలూకాలోని తాళ్ళపాక అను గ్రామము. వీరు నందవర వంశీకులు, వైదిక బ్రాహ్మణులు, ఋగ్వేదులు, భారద్వాజస గోత్రులు, ఆశ్వలాయన సూత్రులు. వీరి జన్మస్థానము తాళ్ళపాక గ్రామమే అయినప్పటికి ఈ వంశ విఖ్యాతి మూలపురుషుడగు అన్నమాచార్యుని మొదలుకొని వీరందరును తిరుమల తిరుపతులయందె స్వామి సన్నిధిని స్థిరనివాస మేర్పరచుకొని అక్కడే కాలము గడిపిరి. వీరు దేశమంతయు తిరిగి వైష్ణవమత ప్రచారము గావించిరి. స్మార్త బ్రాహ్మణులైనప్పటికిని అదివన్ శఠగోపయతుల శిష్యులై మతము పుచ్చుకొని తాళ్ళపాక వారు వైష్ణవులైరి. వీరు వైష్ణవమత ప్రచారమునకు, శ్రీ వేంకటాచల క్షేత్రమునకు ఎనలేని రీతిని కైంకర్యము లొనర్చి ధన్యజీవులైరి.

తాళ్ళపాకవారు తాత్వికులై, శ్రీ వేంకటేశ్వరునకు పరమ భక్తులై, సార్వజనీనము, తాత్వికమునునగు విశిష్టాద్వైతమును లోకమునకు దీక్షాకంకణులై చాటిరి. తామనుభవించిన ఆ మతానుభూతి వైశిష్ట్యమును పదిమందికి పంచిపెట్టుటకు తహతహ లాడిరి. సంగీతమును, సాహిత్యమును సాధనములుగ గొని తత్త్వదృష్టితో, మత సంగీత సాహిత్యములకు మేలు కలయికను చేకూర్చి కళాలక్ష్మికి అందాలు దిద్దిరి. క్రీ. శ. 15, 16 శతా॥లో వర్థిల్లి ప్రసిద్ధులైన

తాళ్ళపాకవారి వంశవృక్షమును చిన్నన్న రచితములైన, 'అష్టమహిషీ కల్యాణము' "అన్నమాచార్య చరిత్రము" లనాధారముగ వివరించవచ్చును. తాళ్ళపాక వంశమువారు తాళ్ళపాకవారని, తాళులపాకము వారని పలు తెరగుల పిలువ బడుచున్నారు.

దాదాపు ఒకటిన్నర శతాబ్ది కాలము విజయనగర రాజుల పరిపాలనాకాలమున తాళ్ళపాకవారు విఖ్యాతితో వెలసి ఆంధ్రభాషకు, వైష్ణవమతమునకు నిరుపమానమగు సేవ గావించిరని నుడువదగును. రాజకీయ, మతసాంఘిక, భాషాసారస్వత రంగములలో ఆంధ్రదేశము ప్రఖ్యాతి జెందిన ఆ కాలముననే తాళ్ళపాకవారు వర్ధిల్లిరి.

## -: తాళ్లపాకవారి వంశ వృక్షము :-

భరద్వాజ ఋషి (తద్వంశమున)

↓

తాళ్ళపాక అన్నమాచార్యుడు (భార్యలు-తిమ్మాంబ, అక్కాంబ)

↓

↓ నరసింహకవి (తిమ్మక్క తనయుడు) భార్యలు నాంచారమ్మ, అనంతమ్మ

↓ పెదతిరుమలాచార్యుడు

↓ నరసమాంబ

↓ తిరుమలాంబ (భర్త తిరుమల కొండయార్యుడు) → రేవణూరి వెంకటాచార్యుడు

నరసింహకవి సంతానము:

↓ నారాయణయ్య (నాంచారమ్మ తనయుడు)

↓ అప్పలార్యుడు (అనంతమ్మ తనయుడు)

↓ అన్నయార్యుడు (అనంతమ్మ తనయుడు)

పెదతిరుమలాచార్యుని సంతానము:

↓ చినతిరుమలయ్య (భార్య పెదమంగమ్మ) → తిరువేంగళప్ప

↓ అన్నయ్య

↓ పెదతిరువేంగళనాథుడు

↓ చినతిరువేంగళనాథుడు (చిన్నన్న)

↓ కోనేటి తిరువేంగళనాథుడు

భరద్వాజ ఋషి
|
నారాయణయ్య-I
|
విఠలయ్య-I
|
నారాయణయ్య-II
|
విఠలయ్య-II
|
నారాయణయ్య-III
|
నారాయణసూరి-IV
(భార్య లక్కమాంబ)
|
అన్నమాచార్యుడు.

★

తాళ్లపాకవారి జీవితకాలమును, జీవిత విశేషములను, వారి సారస్వత సేవలను విపులముగ క్రింది విధముగ చర్చింపవచ్చును.

**తాళ్లపాక అన్నమాచార్యుడు :-**

తాళ్ళపాక అన్నమాచార్యుడు నందవరవైదిక బ్రాహ్మణ వంశమున జన్మించెను. ఈ వంశమువారు ఋగ్వేదులు, అశ్వలాయన సూత్రులు. పొత్తపినాటిలోని తాళ్ళపాక గ్రామమున నుండినవారు. అన్నమాచార్యుడు భరద్వాజ ఋషివంశమున జన్మించెను. ఆ వంశమున నారాయణసూరి IV కిని, లక్కమాంబకును అన్నమాచార్యుడు జన్మించెను. లక్కమాంబ మాడుపూరి మాధవస్వామి భక్తురాలని చిన్నన్న రచితమగు అన్నమాచార్య చరిత్రమును బట్టి తెలియుచున్నది. అన్నమాచార్యునకు అన్నమయ్య, అన్నమయ్యంగారు అన్నయ్యగురు, అన్నయార్య, కోనేటి అన్నమయ్యంగారని నామాంతరములు గలవు.

తాళ్ళపాకవారి సంకీర్తనపు రాగిరేకులలో ప్రారంభమున ఈ శాసనాక్షరములు లిఖింపబడియున్నవి. "స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శక వరుషంబులు ౧౩౪౬ (1346) అగు నేటి క్రోధి సంవత్సరమందు తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన పదారు యేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను అది మొదలుగాను శాలివాహనశక వరుషంబులు ౧౪౨౪ (1424) అగు నేటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ ౧౨ (12) నిరుధాన తిరువేంగళనాథుని మీదను అంకితముగాను తాళ్ళపాక అన్నమాచార్యులు విన్నపము చేసిన శృంగార కీర్తనములు" (T T D Epic Report Page 280) ఇందలి వాక్య నిర్మాణ వైఖరిని బట్టి అన్నమాచార్యులు అవతరించిన సంవత్సరము క్రోధి (క్రీ. శ. 1424) అని తెలియనగును - అని డా॥ వేటూరి ఆనందమూర్తిగారు తాళ్ళపాక కవుల కృతులు - వివిధ సాహితీ ప్రక్రియలు అను గ్రంథమున (పుట-61) తెలిపియున్నారు.

కాని T T D Epigraphical Report లో శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి గారు అన్నమాచార్యులు అవతరించిన పదారు యేండ్లకు క్రోధి సంవత్సరమందు తిరువెంగళనాథుండు ప్రత్యక్షమైతేను - అనుకీతిని అన్వయ మేర్పరచుకొని అతని జననము క్రీ. శ. 1408 అగునని వ్రాసిరి.

"Tallapaka Annamacharya commenced composing both the Sankirtanas in saka 1346 Krodhi (1424 AC) being there in his 16th year of age during which he had a manifestation of God Tirumala Nadha and continued his work until the 12th day of the dark fortnight of phalguna in Saka 1424 Dundubhi (23 February 1503 AC). This is to say for a period of 80 years from 1424 to 1503, Annamacharya went on composing Sankirtanas-" (EPi-Report page 280).

పైదాని ననుసరించియె కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తొలుత 1945లో ప్రకటించిన వేంకటేశ్వర వచనముల పీఠికలో

"ఈతడు తొంబది యేండ్లు జీవించెను.........క్రీ శ 1408 నుండి 1503 దాకా జీవించెను" (పుటలు 12, 13) అని వ్రాసినారు. కాని పిదప అన్నమాచార్య చరిత్ర ప్రకటన కాలమునాటికి (1949) ఆవాక్య నిర్మాణ వైఖరిని బట్టి తమ అభిప్రాయమును మార్చుకొని, "అన్నమయ శక 1346 క్రీ. శ. 1425 క్రోధి వైశాఖ మాసమున విశాఖా నక్షత్రమున జన్మించినాడు. వైశాఖ పూర్ణిమ జన్మతిథిగా గూడ నిర్ణయింప వచ్చును. శక 1424-క్రీ. శ. 1503 దుందుభి ఫాల్గుణ బహుళ ద్వాదశినా డాతడు దివ్యధామమందినాడు. అతని జీవిత పరిమాణము 79 ఏండ్లు (చూ॥ అన్నమాచార్య చరిత్ర-పీఠిక పుటలు 2-3) అని వ్రాసినారు. వేటూరి ప్రభాకరశాస్త్రి గారి రెండవ అభిప్రాయమునే ఆనందమూర్తిగారు సమంజసమని భావించిరి.

ఆంధ్రకవి తరంగిణి కర్త శ్రీ చాగంటి శేషయ్యగారు శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిగారి యూహ దూరాన్వయదోషమునకు గురియైనదని, ప్రభాకరశాస్త్రి గారి నిర్వచనమునందదిలేదు. (పుట -122-8 సం॥) అని వ్రాసిరి.

కాని అనేకాధారములతో గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు అన్నమాచార్య జననమును క్రీ. శ. 1408 అని నిరూపించిరి.

"1408 విరోధి వైశాఖ శుద్ధ పూర్ణిమ విశాఖ నక్షత్రమున జన్మమనుట సబబు. విరక్తుడగు అన్నమయ ఈ విధముగ లెక్కించె ననుట సమంజసము" (అన్నమాచార్య శృంగార సంకీర్తనము - సం॥ 12. పీఠిక 6-8) అని గౌరిపెద్ది వారనిరి.

అన్నమాచార్యుడు కొండనెక్కునాటికి పదహారేండ్ల వాడని చెప్పిన ప్రభాకరశాస్త్రి గారి మాటలను అంగీకరించక అన్నమాచార్యుని మనుమడు చిన్నన్న "అన్నమాచార్య చరిత్రలో చెప్పినట్లు." కొండనెక్కుసరికి ఎనిమిదేండ్లేనని భావించి, ఐదవ యేటనే ఉపనయనము జరిగినట్లు విశ్వసించి, దానికి తగిన ఉప పత్తులు గౌతమ ధర్మ సూత్రములనుంచి ఉదాహరించి పై చెప్పిన దానిని గౌరిపెద్ది రామ

సుబ్బశర్మగారు క్రింది విధముగ స్థాపించినారు. "ఇక దుర్బలాహారు లగు నేటివారు గూడ కాలినడకన ఎనిమిదవ ఏటనే కొండ నెక్కుచుండుట ప్రత్యక్షమైన విషయమే. అట్లు అన్నమయ్యయు, పుట్టినదాది ఎనిమిదవ యేటనే కొండ నెక్కి యుండుట వింతగాదు.

"ఈ లీల నెనిమిది యేడుల పిన్న
బాలుడయ్యును నిష్ఠబనిబూని యతడు......
వితత వృత్తంబుల వెంకటపతికి
శతకంబు కుతుకంబు సమకూర దీర్చి
సదమాలాచారుడై సనుదెంచి యతడు"

(అన్నమాచార్య చరిత్ర పుట 23-24)

అని చిన్నన్న తాతగారి చరిత్రమును దగ్గరదగ్గర కాలములో విన్నవాడు చెప్పుచుండగ, శ్రీ శాస్త్రిగారు కోమల మతులు గాన, అన్నమయ్యను సుకుమారునిగ భావించి ఎనిమిదవ యేట కొండ నెక్కించుటకు సందేహించిరి (చూ॥ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్రము - వివేదిక దీపిక - శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ - తృతీయ ముద్రణ పరిష్కర్త - పుట 18-20) అని తెలుపుట సముచితము కాబట్టి అన్నమాచార్యుని జననము 1408 అనుటయే సమంజసమని డా. ఎస్. గంగప్ప గారు గూడ (తెలుగులో పదకవిత - పుట 56) విశ్వసించిరి.

అన్నమాచార్యుడు నాల్గవ నారాయణ సూరికి, లక్కమాంబకు శ్రీ వేంకటేశ్వరస్వామి అనుగ్రహమున. "బిరుదు గజ్జయల ముప్పిడి కఠారంబగు నందకాంశమున జన్మించెను." 'జోల బాడెనేనియు వెంకట పతిపేరు వివరించి పాట పొంకించకుండిన' బోరూరడి లెడివాడు కాడు ఉచిత కాలమున తలిదండ్రు లాతనికి జాతక కర్మాదికమును గావించిరి. "పంచసమంబులై నంత నియతిమై గురుడుపవీతుం గావించినయవేది నధ్యయనంబు సేయించె"ను. నెన్నని వరముచే నాతనికి విద్య

లన్నియు జిహ్వాగ్రంగ సీమ తమ దామె సొచ్చి నర్తనమాడ నొసగి నవి. పిన్న ప్రాయముననే అతడు, "ఆడినమాటెల్ల నమృత కావ్యముగ, పాడినపాటెల్ల బరమగానముగ" కాజొచ్చినవి.

బాలుడైన అన్నమయ్యకు తల్లిదండ్రులు, అన్న వదినలు, పిలిచి పనులు చెప్పుచుండ చేయుచుండెడివాడు. ఒకనాడు వారు పశువులకు కసువు తెమ్మని పనుప చేతివేలు కోసుకొని విసిగి, "ఎన్నటి చుట్టంబు లిటువంటివార లెన్నటి బంధుండ నేను వారలకు" అని ఆలోచించి, ఇంటిపనులమీద రోసి, శేషాద్రినాథుని గొలిచి మనియెదనని తిరుపతికి బయలుదేరెను. తిరుపతి పొలిమేరలో తాళ్ళపాక గంగమ్మను దర్శించి, మోకాళ్ళ ముడుపు వద్దకు చెప్పుల కాళ్ళతో నడిచివెళ్ళి, అలసిపోయి రాతిబండమీద నిదురపోగ, అలమేలుమంగ ప్రత్యక్షమై, అతని అలుపుతీర్చి అదృశ్యమయ్యెను. ఆమె యిచ్చిన ప్రసాదము నారగించి, అన్నమయ సరససాహిత్యపారీణుడై అలమేలుమంగపై ఆశువుగ శతకము చెప్పెను. దీనినే 'మంగాంబికా' శతకమందురు. దేవి చెప్పిన ప్రకారము చెప్పులు వదలి కొండనెక్కి తిరుమల జేరి స్వామి పుష్కరిణి సందర్శించి, అందు స్నానమాడి పుష్కరిణిని ధ్యానించెను. ఇందుకు అన్నమయ సంకీర్తనలు గూడ గలవు. పిదప స్వామిని దర్శించి పులకితుడై ఆయనపై ఆసువుగ సంకీర్తనములు జేయ అతనిని చూచి అందరూ మెచ్చి, తీర్థ ప్రసాదములిచ్చి, శఠగోపమిడి దీవించి పంపిరి. ఆకాశ గంగను, పాపవినాశమును దర్శించి, అందు స్నానమాడి, "వితత వృత్తంబుల వేంకటపతికి శతకంబు కుతుకంబు సమకూర జేసెను". మరల స్వామి దర్శనమునకు వెళ్ళగ తలుపులు మూసి యుండుట చూచి, ఆవేశముతో వేంకటపతిమీద విస్తరముగ వేంకట శతకంబు విన్నవించగ తలుపులు వాటికవియే తెరచుకొనెను. అర్చకు డచ్చెరు వంది అన్నమయ్యను లోనికి గొంపోయెను. అన్నమయ్య వేంకటేశుని దర్శించి తీర్థ ప్రసాదములు గొని, వానిని కోనేటి దరి భుజించి ఆదివరాహుల గేహమున నిదురించెను.

శ్రీ వేంకటేశ్వరుడు అన్నమయ్య భక్తికి మెచ్చి హరిపరాయణ చిత్తుడైన విష్ణుముని కలలో కన్పించి అన్నమయ్యను గురించి చెప్పెను. దేవుని ఆదేశానుసారము విష్ణుముని అన్నమయ్యను శంఖ చక్రాంకితుని జేసి పంచ సంస్కారములు గావించి, శరణాగతి ధర్మమును బోధించి వైష్ణవునిగ చేసెను. అన్నమయ్య తల్లి అతనిని వెదకుచు తిరుమలకు వచ్చి అన్నమయ్యను ఇంటికి తీసికొని వెళ్లెను. తిరుమలమ్మ, అక్కలమ్మ అను యిరువురి కన్యలతో అన్నమయ్యకు వివాహము చేసిరి.

అన్నమయ్య శఠగోపమునివద్ద సకల వేదాంత పఠనము గావించెను. శ్రీ వేంకటేశ్వరునిపై పదరచన గావించుచు ప్రసిద్ధికెక్కెను. అన్నమయ్య బాల్యమిత్రుడు సాళువ నరసింగరాయులు పెనుగొండలో రాజ్యపాలన గావించుచు, అన్నమయ్యను పిలిపించుకొని శృంగార పదములు పాడించుకొని పరమానంద భరితుడై, వేంకటపతిమీద పదములను బోలిన పదములు తనపై పాడుమని కోరగ అన్నమయ్య తిరస్కరించెను. సాళువ నరసింహరాయలు అన్నమయ్యను శృంఖలా బద్ధుని గావించెను. బంధితుడైన అన్నమయ్య ప్రహ్లాదునివలె మురవైరి దలచి

"ఆకటి వేళల నలపైన వేళల
తేకువ హరినామమె దిక్కు మఱిలేదు" (5-100)

అను కీర్తనము పాడగ సంకెల లూడిపడెను. ఆ వార్తవినిన రాయుడు మరల సంకెల వేయించెను. రాజు ఎదుటనే అన్నమయ స్వామి నర్థించుటయు, సంకెలలూడుటయు జరిగెను. రాజుభయమంది "అపరాధినపరాధి నన్నమాచార్య కృపజూడు కృపజూడు కృపశరణ్య" అని దీనుడై అన్నమయ్య చరణాబ్జములకు మొక్కి విలపించెను. అన్నమయ రాజును అనుగ్రహించెను. పిమ్మట అన్నమయ తిరుమలకు విచ్చేసి స్వామివారికి "శృంగారమంజరి"ని సమర్పించెను. శేషాచలాధీశుడును అన్నమాచార్యుని సంకీర్తనములకు చొక్కి ఆనందించుచుండెను ఇట్లు అన్నమాచార్యుడు ప్రతి సంవత్సరము తప్పక వృష

భాద్రపతికి గావించు ఆ బ్రహ్మోత్సవములు సేవించుకొనుచు ఆ శ్రీశైలనాథునను గ్రహమున సకల వాచాశుద్ధి గలిగి మహామహిమాన్వితుడై వినుతికెక్కెను' పుల్ల మామిడిని తియ్యమామిడిగా మార్చుట, నిరుపేద వివాహమునకు ధనము సమకూర్చుట-మొదలైన మహిమలను అన్నమయ్య ప్రదర్శించెను.

పదకవితా పితామహుడైన అన్నమాచార్యుని చరమ దశలో పురందరదాసు దర్శించినట్లు చిన్నన్న రచించినాడు.

"ఎనయ సంధ్యలకు నీళ్లియ్యఁ జేకొనుచు
దనరు పురందరదాసాహ్వయుండు
పరమ భాగవతుడై పరగుచు నంద
నరకులాగ్రగణియైన వైష్ణవోత్తముడు
నవరించు మురవైరి సంకీర్తనములు...
కువలయంబున చేసుగొన్న మాత్రమున......
...చని, తాళ్ళపాక శాసనుపన్నమయ్య
వెన్నునిగాన భావించి కీర్తించి
సన్నుతిసేయ నాచార్యవర్యుండు
నతని విట్ఠలునిగా ననయంబు దలచి
ప్రతి లేని గతుల సంభావించె-" (అన్నమాచార్యా చరిత్రము పుట-44-45).

కర్ణాటక విద్వాంసులు కొందరు దీనిని అంగీకరించలేదు. కాని అన్నమాచార్యుని మనుమడైన చిన్నన్నయే తాత చరిత్ర వ్రాసి తెలిపి నందున దీనిని తప్పక అంగీకరించవలసినదే.

అన్నమాచార్యుడు 32 వేల పదముల (సంకీర్తనములు) ను రచించినట్లు తెలియుచున్నది. ఇవి శృంగార సంకీర్తనలు, ఆధ్యాత్మ సంకీర్తనలు-అని రెండు విధములు. ఇతనికి సంకీర్తనా చార్యుడని, పద కవితా పితామహుడని సార్థక బిరుదములున్నవి.

"ఆళ్వారులు రచించిన ద్రావిడవేదమనీ, పంచ మాగమమనీ పిలువబడే నాలాయిరం 4000 సంకీర్తనములు గలది. అన్నమాచార్యు డొక్కడేరచించిన ఆంధ్రవేదము ముప్పది రెండువేల సంకీర్తనములు గలది. వీటిలోకూడ ద్రావిడ ప్రబంధాలలోవలెనే భక్తునకు పరమే శ్వరునకు నాయికానాయక భావము పతిపత్నీ భావము కల్పితమై ఉజ్వల రసానుభూతినొదవించుచు, ననేక దేవాలయములలోని యర్చా మూర్తుల నభివర్ణించుచు, శరణాగతి మహత్త్వమును ప్రతిపాదించుచు నింక ననేక విధముల లోకనీతి ధర్మోద్బోధ భూతదయాది విశేషాంశ ముల నెలయించుచు, ఎంతో వింతగ, వేడుకగ సంగీత సారస్యముతో సరవని భాషతో, వేదవేదాంతేతిహాసాది సూక్తి తదర్థ ప్రతిపాదనము లతో వెల్వారిసి, విజ్ఞాన నిధులై విరాజిల్లు చున్నవి" - అని ప్రభాకర శాస్త్రిగారు వ్రాశారు.

అన్నమాచార్యులు తెలుగు సంకీర్తనములేగాక నూర్లకొలది సంస్కృత భాషలోగూడ సంకీర్తనములు వెంకటేశాంకితములుగా రచించారు. (చూ॥ అన్నమాచార్య పురందరదాసుల సమాగము - భారతి- జూన్-1982 డా॥ ఎస్.గంగప్ప పుట-112-1 3)

అన్నమయ్య నాడు జానపదుల వాడుకలోవున్న జానపద గేయ రీతులనుఅనేకము తన పదములలో ఉపయోగించుకొనెను. అటువంటి వానిలో-జాజరలు, చందమామపదములు, తుమ్మెద పదములు, లాలి, సువ్వి, గొబ్బి, ఉయ్యాల, లాల, జోల, శోభన, మంగళ పదములు. ఘాంగు భళాలు, తందనాలు వెన్నెల పదములు మొదలైన వెన్నియో అన్నమయ్య వాడుకొనెను.

"అన్నమాచార్యుడు అద్వితీయ ప్రతిభాశాలి. ఋషికల్పుడు. పదంమొక్క- అనంతరూపాలను తన రచనలలో ప్రదర్శించాడు. సంవాదగీతాలు అన్నమయ్య కీర్తనలలో కొల్లలు ... ఈవిధంగానే ఎన్నో అన్నమయ్య శృంగార వైరాగ్యాలను పరిపూర్ణంగా సమాన స్థాయిలో ఆరాధించాడు. తన తర్వాతి పద కర్తలకు, కీర్తన కర్తలకు

ఆయన మార్గదర్శి అయ్యాడు" (చూ॥ అన్నమాచార్య పురందర దాసుల సమాగమం. భారతి- జూన్-1982 - డా॥ ఎస్. గంగప్ప. పుట-120)

తాళ్ళపాక అన్నమాచార్యునకు తిరుమలమ్మ వలన నరసింహ కవి, అక్కలమ్మవలన పెదతిరుమలాచార్యుడు, నరసమ్మ, తిరుమలమ్మ జన్మించిరి.

## అన్నమాచార్యుని కృతులు :-

| | |
|---|---|
| 1) శృంగార సంకీర్తనములు<br>2) ఆధ్యాత్మ సంకీర్తనములు | 32 వేలు కొన్ని ప్రకటితములు |
| 3) శృంగార మంజరి | — ప్రకటితము |
| 4) శతకములు | - పండ్రెండు. అలమేల్మంగపై చెప్పిన "వేంకటేశ్వర" అను మకుటముతో గల శతకమొక్కటియే ప్రచురితము |
| 5) ద్విపదరామాయణము | — అలభ్యము |
| 6) వేంకటాచలమహాత్మ్యము | – (సంస్కృత రచన) అలభ్యము |
| 7) సంకీర్తనలక్షణము | -లక్షణగ్రంథముసంస్కృతరచన-అలభ్యము |

అన్నమాచార్యునికి అన్నమయ్య అన్నమయ్యంగారు, అన్నయ్యగురు, అన్నయార్య, కోనేటి అన్నమయ్యంగారని నామాంతరములు గలవు.

తాళ్ళపాక అన్నమాచార్యుడు సంగీత సాహిత్యములందు అసాధారణ పాండిత్యమును, సంస్కృతాంధ్రములందు అనితర సాధ్యమగు కవితాశక్తియు గలవాడు.

## తాళ్ళపాక తిమ్మక్క

తాళ్ళపాక తిమ్మక్క అన్నమాచార్యుని పెద్దభార్య. నరసింహ కవి ఈమెకు జన్మించెను. ఈమె జీవితము, జీవించినకాలమును గూర్చి వివరములేవియు తెలియరావు. ఈమె విదుషీమణియనియు, కవయిత్రి యనియు తెలియుటకీమె, 'మంజరీద్విపద' అనదగిన గేయచ్ఛందమున

రచించిన "సుభద్రా పరిణయమే" ఆధారము. మనమెరిగినంతలో తాళ్ళపాక తిమ్మక్కయే తొలి తెలుగు కవయిత్రియని చెప్పనగును. అట్టి యీ తిమ్మాంబ ప్రేయసిగ, భక్తిమయ గేయరచన కవితగా, తత్కవితా వల్లభుడు శ్రీ వేంకటేశ్వర స్వామిగ అన్నమాచార్యునకు లభించినది. అన్నమయ్య ధన్యుడు.

## తాళ్లపాక నరసింగన్న :-

పదకవితాపితామహుడగు అన్నమాచార్యునకును, విదుషీమణి యగు తిమ్మక్కకు జన్మించిన సుపుత్రుడే నరసింగన్న. నిరుపమాన సుకవితా నిర్వాహకుడగు తెనాలి రామకృష్ణకవి తన సమీపకాలము వారగు తాళ్ళపాక కవులనిట్లు సన్నుతించెను.

కం॥ చిన్నన్న ద్విపద కెఱగును
పన్నుగ బెదతిరుమలయ్య పదమున కెఱగున్
మిన్నంది మొరసె నరసిం
గన్నకవిత్వంబు పద్యగద్య శ్రేణిన్.

అనుటనుబట్టి క్రీ. శ.1560 వరకువర్తిల్లిన చిన్నన్నను, క్రీ.శ. 1453 వరకు వర్తిల్లిన పెదతిరుమలాచార్యుని, ఇతని అన్నయగు నరసింగన్నను మెచ్చినట్లు విదితమగుచున్నది. పై పద్యమున నరసింగన్న కవితా విషయమున మిక్కిలిగా ప్రస్తుతుడయ్యెను.

చిన్నన్న "అష్టమహిషీ కల్యాణము" న "అరయదిమ్మాంబకు నాత్మ సంభవుడు", "పాడజెప్పగ వర్ణపద్ధతి నీడుజోడు లేడని సభ జొచ్చి వాదించి, పరగిన ధీశాలి ప్రతివాదిదైత్య నరసింహుడనగ్గల నరసింహ గురుడు"-అని చెప్పుటనుబట్టి నరసింగన్న ప్రఖ్యాత కవీశ్వరుడని, సంగీతజ్ఞుడని తెలియుచున్నది. కాని తిరుమల తిరుపతి దేవస్థానముల శాసనములలో గాని, తాళ్ళపాకవారి గృహములందు గాని లోకమునగాని యితని రచనలేవియు కానరావు.

చిన్నన్న క్రీ. శ. 1546లో కొండవీటి సీమలోని చెందలూరు, మల్లవర గ్రామములను స్వామికైంకర్యములకై సమర్పించుచు, అందు మాఘ శుద్ధ చతుర్దీతిథిని తన పెదతండ్రి గారైన నరసయ్యంగారి ప్రత్యాబ్ధిక దినమున అర్చనా విశేషముల నిర్వహణము గూడ చేర్చి నాడు. (చూ॥ తిరుపతి శాసనములు-వాల్యు 5 పుట 184) దీనినిబట్టి నరసింగన్న క్రీ. శ. 1546 నకు పూర్వమే పరమ పదించెనని తలప వలసియున్నది.

తాళ్ళపాక నరసింగన్నకు, నాంచారమ్మ, అనంతమ్మ అనుయిరువురు సతీమణులు గలరు. నాంచారమ్మవలన నారాయణ, అనంతమ్మ వలనఅప్పలార్య అన్నయార్యఅనువారు జన్మించిరి. నరసింగన్న సంతానము తాతగారైన అన్నమాచార్యుని కన్న ముందుగానే పరమ పదించిరనిపించుచున్నది.

'కవికర్ణరసాయనకర్త' నరసింగన్న తాళ్ళపాక నరసింగన్న కావచ్చునని పలువురు తలచిరి. కవికర్ణ రసాయనమునకవి తన కులగోత్రములను, తలిదండ్రులను పేర్కొనలేదు గ్రంథాదిని, 'గురువర భట్ట పరాశర చరణ సరోరుహ స్తముల సన్మాననుడన్'అని గురుస్తుతి గావించినాడు. ఆశ్వాసాంత పద్యమున 'ఆదిమశఠకోపాది'అని చెప్పెను దీనిని బట్టి నరసింగన్న భట్ట పరాశరాహ్వయుని శిష్యుడని, రెండవ శఠకోపయతియైన అహోబలమఠ ప్రతిష్ఠాపక శఠకోపయతి నెరిగిన వాడనిగుర్తింపనగును. కవికర్ణరసాయనమున వైష్ణవమతాభిమానము అద్వైత మతద్వేషము, అన్నమయ్య సంకీర్తన ఛాయలు నిండుగ నున్నవి. కృష్ణరాయల కాలమునగూడ ప్రభువుల ఔదాసీన్యము కారణముగ నరసింగన్న ప్రతిభ గుర్తింపబడకపోయి యుండవచ్చును. ఆ దినములలో తన అగ్రహారమును వదలి నరసింగన్న, సుంకేసుల గ్రామమును చేరినట్లున్నాడు. డా॥ వేటూరి ఆనందమూర్తిగారు తాళ్ళపాక కవుల కృతులు వివిధ సాహితీ ప్రక్రియలు అను సిద్ధాంత వ్యాస గ్రంథమున, కవికర్ణ రసాయనకర్త తాళ్ళపాక నరసింగన్న కాదనుచు అభిప్రాయపడిరి.

**తాళ్లపాక పెద తిరుమలాచార్యుడు :**

తాళ్ళపాక అన్నమాచార్యుని చిన్న భార్యయగు అక్కలమ్మకు పెదతిరుమలాచార్యుడు జన్మించెను. ఈతనికి పెదతిరుమలయ్య, తిమ్మయ్య, తిమ్మార్య, తిరుమల తిరుమలాచార్య తిరుమల దేశికులు, తిరుమల గురు, తిమ్మడు-అను నామాంతరములు గలవు ఈతనికి నరసమ్మ తిరుమలమ్మ అను యిరువురు చెల్లెండ్రు గలరు. క్రీ. శ. 1504 వరకు జీవించిన అన్నమాచార్యులు, పెద తిరుమలాచార్యుని కుమారుడగు చిన తిరుమలాచార్యునికి బ్రహ్మోపదేశము చేసినాడను అంశమును బట్టి చిన తిరుమలయ్య జననము క్రీ. శ. 1488-90 ప్రాంతమనియు, అప్పటికి పెదతిరుమలయ్య వయస్సు 30 సంవత్సరములను కొనిన, పెద తిరుమలయ్య జననము క్రీ. శ. 1458-60 ప్రాంతమగును.

తాళ్ళపాకవారి శాసనములలో చైత్రమాసము మృగశిరా నక్షత్రమున పెదతిరుమలయ్య జన్మనక్షత్రి సందర్భముగా కైంకర్యము జరుపబడుచుండినట్లు తెలియుచున్నది. (చూ॥ తి. తి. దే. శాసనము-సం-5. నెం. 71. క్రీ. శ. 1546) అప్పటికీతడు జీవించియేయున్నాడు. క్రీ శ. 1558లో చిన్నన్న వేయించిన శాసనమున తన తండ్రిగారి నక్షత్రోత్సవ సందర్భమును పురస్కరించుకొని మునుండునుండి జరుగుచున్నవి గాక మరికొన్ని విశేషకైంకర్యములు జరిపించుటకు ఏర్పాట్లు చేసినట్లు గలదు. అప్పటికి పెదతిరుమలయ్య జీవించి యుండెనో లేదో తెలియదు. కాని అప్పుడు జరిగిన విశేష కైంకర్యములను బట్టియు, చైత్రి మృగశీర్షయొక్క ఉత్సవముగా జరుగుటను బట్టియు, అది అతని నూరవ జన్మ వత్సరమై యుండునని డా॥ వేటూరి ఆనంద మూర్తిగారు భావించియున్నారు. ఈ ఊహ సరియగునెడల పెద తిరుమలాచార్యుని జననము సరిగ కనుక తలచినట్లు క్రీ. శ. 1458వ సంవత్సరమగును.

కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 'అన్నమాచార్య చరిత్ర'

పీఠికలో పెదతిరుమలయ్య జీవిత కాలమునుగూర్చి వ్రాయుచు, క్రీ శ. 1500 ప్రాంతమున జన్మించిన చిన తిరుమలయ్య తండ్రి అప్పటి కిర్వదేండ్ల వాడేయను కొన్నను, క్రీ శ. 1478 ప్రాంతమున జన్మించిన వాడగును. ఈతని నిండు యౌవనము శ్రీకృష్ణరాయల కాలమున గడిచినది' అని తెల్పియున్నారు. (పుట 84.)

పెదతిరుమలయ్యగారి సంకీర్తనములను చదివినపుడును, అతని శాసనములను పరిశీలించినపుడును, కృష్ణరాయల కాలమునకే అతడు పండబారిన జీవితానుభవమునొంది తాత్త్వికదృష్టి పీడికొని, మానసికముగ చాంచల్యము లేనివాడై యుండినట్లు తోచును. అదియునుగాక 1490-93 ప్రాంతమున చిన తిరుమలయ్య జన్మించెననుకొన్నప్పుడు, పెదతిరుమలాచార్యుని జననము క్రీ. శ. 1458-60 ప్రాంతమగుటయే సమంజసము. క్రీ. శ. 1458 నుండి పెదతిరుమలయ్య క్రీ. శ. 1654 వరకును జీవించియున్నట్లు శాసనాధారమున్నది.

'పరీధావినామ సంవత్సరము క్రీ శ. 1553లో చినకంజీవరమున పెద చిన తిరుమలాచార్యులు ఇద్దరు కలసి కొన్ని కైంకర్యములు జరిపించునట్లు శాసనమున్నది. (చూ॥ తి. తి. దే. ఎపిగ్రాఫికల్ రిపోర్టు పుట. 291) క్రీ శ. 1554లో ఉదయగిరిలోని రాజప్రతినిధియగు రామభట్లయ్యచేత కడపజిల్లా నందలూరి ఆలయమునకు ఆతడు అందుపూరు అగ్రహారము యథా పూర్వము చెందునట్లు చేయించినాడు.

కావున పెద తిరుమలయ్య 97 ఏండ్లు జీవించి నృసింహరాయ, కృష్ణరాయ, అచ్యుతరాయాదుల పరిపాలనములను చూచియుండును.

పెద తిరుమలాచార్యుడు తమిళము నందుగూడ కవిత చెప్పగలవాడు. తిరుమల తిరుపతి దేవస్థాన శాసన సంచయము నందలి 4-40 సంఖ్యగల శాసనవిషయము చక్కని తమిళ కవితలో నున్నది. శాసన పరిష్కర్తలు శ్రీ తిరువాలై అయ్యంగార్ "This piece of Tamil poetry must have been necessarily composed by the same author" అని అభిప్రాయపడిరి.

పెదతిరుమలయ్య పదకవితలో పేరుమోసినవాడు. ఈతని రచనారంభమునుగూర్చి రాగిరేకులందిట్లున్నది. 'శాలివాహన శక వర్షంబులు 1424 అగునేంటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ ద్వాదశి మొదలుగాను తాళ్ళపాక అన్నమాచార్యులుంగారు తమ కొమారుండు తిరుమలాచార్యులకు దినమొక సంకీర్తన శ్రీ వేంకటేశ్వరునకు అంకింతంచేసి చెప్పుచునంగాను విన్నపముచేసినసంకీర్తనలు'

పెద తిరుమలయ్య వేదాంతవిద్యా ప్రవీణుడు, సంగీత సాహిత్య సర్వజ్ఞత మంగళ సామ్రాజ్యమహితుడై అలరారినాడు. శ్రీమద్వేద మార్గప్రతిష్ఠాపనాచార్య, శ్రీ రామానుజ సిద్ధాంత స్థాపనాచార్య, వేదాంతాచార్య, కవి తార్కిక కేసరి, శరణాగత వజ్రపంజర ప్రభృతి బిరుదాంకితుడు. ఇతడు కవి, గాయకుడు, పండితుడు, బహుభాషావేత్త. వైష్ణవ మత ప్రచారదృష్టితో సాహిత్యమును సాధనముగ గొని వివిధ సాహితీ ప్రక్రియలతో వినూత్న యత్నములు గావించుచు నాటిసారస్వత సామ్రాజ్యము నేలిన ధురంధరుడు స్నేహితులను కూర్చుకొని, శిష్యులను చేర్చుకొని, సంకీర్తన భాండారము నొకదానిని నెలకొల్పి ఆ సాహిత్య సంస్థకొక చక్కని వ్యవస్థ నేర్పరచినాడు. శ్రీ వేంకటేశ్వరుని గళము నలంకరించిన తాళ్ళపాకకవి మణిహారమున నాయకమణి యైనవాడు పెదతిరుమలాచార్యుడు.

పెదతిరుమలాచార్యుడు తిరుమలాంబను వివాహమాడెను. వీరికి చిన తిరుమలయ్య, అన్నయ్య, పెదతిరువేంగళనాథుడు, చిన తిరువేంగళనాథుడు (చిన్నన్న), కోనేటి తిరువేంగళనాథయ్య - అను ఐదుగురు తనయులు జన్మించిరి.

పెదతిరుమలాచార్యుడు శ్రీ వేంకటేశ్వరస్వామివారికి అర్పించిన గ్రామములు కొన్నిగలవు. అవి కావనూరు, మనువాకట్టై, కీలగున్రము, మన్న సముద్రము, పూండి, సంగమకోట, రాయలపాడు, సోమయాజులపల్లి, కత్తమువారిపల్లి, ఎర్రగుంటపల్లి, పల్లిపురము (133 వరహాలు సంవత్సరాదాయము), గండ తిమ్మాపురము (100

రేఖా పొన్నులు ఆదాయము). అచ్యుతరాయలు పూండి, సంగము కోట (గ్రామములను తామ్ర శాసన పూర్వకముగ దానముచేయగ, పెదతిరుమలయ్య వానిని తనస్వామికే అర్పించెను. స్వామి కైంకర్యములు నిర్వర్తించుటకే గ్రామములవలన వచ్చు ఆదాయమును ఉపయోగించుచుండిరి.

పెదతిరుమలయ్య కొన్ని కట్టడములను నిర్వహించెను. అవి : స్వామి పుష్కరిణి జీర్ణోద్ధారము, మెట్లు, మండపములు, కొండమీద తాళ్ళపాకవారి యింటి ముందు మండపము, సంకీర్తన భాండారము.

పెదతిరుమలయ్య కొన్ని ఉత్సవములు నిర్వహించెను. అవి ; శ్రీనివాసమూర్తికి ప్రతి శుక్రవారము తిరుమంజనము పిదప పునుగు తైలము పూయునపుడు పన్నీరుచెంబు సత్కారముబడయుట, అచ్యుతుని జన్మనక్షత్రమగు మృగరాశి నాడు ఉత్సవము జరుపుట, ముక్కోటినాడు స్వామి పుష్కరిణిగట్టున ముప్పది దీపములుంచుట, స్వామి పుష్కరిణి గట్టున తాళ్ళపాకవారు నిర్మించిన రాతి స్తంభము మీద సంవత్సరము పొడవున ప్రతి గురువారము దీపారాధనచేయుట మున్నగునవి.

## పెదతిరుమలాచార్యుని కృతులు :

| | | |
|---|---|---|
| 1) శ్రీవేంకటేశ్వర వచనములు | - వచనమాలికా గీతములు | (ప్రకటితము) |
| 2) శృంగార దండకము | - దండకము | ,, |
| 3) చక్రవాళ మంజరి | - మంజరీ ద్విపద | ,, |
| 4) శృంగార వృత్త శతకము | - శతకము | ,, |
| 5) వేంకటేశ్వరోదాహరణము | - ఉదాహరణము | ,, |
| 6) నీతి సీస శతకము | - శతకము | ,, |
| 7) రేఫఱకార నిర్ణయము | - లక్షణ గ్రంథము | ,, |
| 8) సుదర్శన రగడ | - రగడ | ,, |
| 9) శృంగార సంకీర్తనములు | - కొన్ని ప్రకటితములు | ,, |
| 10) ఆధ్యాత్మ సంకీర్తనములు | - కొన్ని ప్రకటితములు | |

11) భగవద్గీత తెనుగు వచనము - అనువాదము ఆంధ్ర వేదాంతము S.V.U 1978 ప్రకటితము
12) ద్విపద హరివంశము = ద్విపద (అలభ్యము)
13) సంకీర్తన లక్షణ వ్యాఖ్య - వ్యాఖ్యానము (అలభ్యము)
14) శ్రీవేంకటేశ్వర ప్రభాత స్తవము - ద్విపద (ప్రకటితము)

## తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు :-

తాళ్ళపాక పెదతిరుమలాచార్యునకు, తిరుమలమ్మకు "పంచకల్ప తరువులవలె" జన్మించిన ఐదుగురు తనయులలో మొదటివాడు చినతిరుమలాచార్యుడు. ఇతడు చారుతర అష్టభాషా చక్రవర్తి. ఈ చినతిరుమలయ్యకు తాతగారైన అన్నమాచార్యులు ఉపనయనము (బ్రహ్మోపదేశము) గావించినట్లు కీర్తనము గలదు.

తాళ్ళపాకాన్నమాచార్య దైవమవు నీవుమాకు
వేళమే శ్రీహరి గన వెరవానతిచ్చితివి
గురుడవు నీవెసుమ్మీ కుమితినైననాకు
సరవి బ్రహ్మోపదేశము సేసితివి
పరమబంధుడనైనా పరికింపనీవెసుమ్మీ
వరుసనే జెడకుండ వహించు కొంటివి" (16-1-39)

ఇతనికి చినతిమ్మయ్య, చినతిమ్మ దీక్షితులు, సిరుతిరుమలై అయ్యంగారు, తిరుమల వేంకటేశ దీక్షితులు" - అను నామాంతరములు గలవు.

చినతిరుమలయ్య క్రీ.శ. 1488-90 ప్రాంతమున జన్మించినాడని తెలియుచున్నది. ఈతని శాసనములు క్రీ. శ 1540, 1547 సంవత్సరములందు విరివిగ నున్నవి. క్రీ. శ. 1553, 1562 ప్రాంతమున గూడ గలవు. ఇతడు, తన తండ్రి పెదతిరుమలయ్య కలసి కంజీవరమున వేయించిన శాసనము, "పరీధావినామ సంవత్సరము క్రీ. శ. 1553న గలదు. (చూ॥తి తి.దే ఎపిగ్రాఫికల్ రిపోర్టు-పుట 291)

చినతిరుమలయ్య మంగళగిరి శాసనమునుబట్టి ఇతడు క్రీ. శ. 1553 తర్వాత కొంతవరకు జీవించి యుండును. (చూ॥తి తి. దే. ఎపిగ్రాఫికల్ రిపోర్టు-పుట 291 మరియు S.I.I. Vol4-710)

తండ్రి తాతల మార్గము ననుసరించి ఇతడు రచనా వ్యాసంగమును నిర్వహించి యుండును.

చినతిరుమలాచార్యుడు సంస్కృతాంధ్రములలో మహాకవి. ఇతడు మహావిద్వాంసుడు, "అష్టభాషా చక్రవర్తి" అను బిరుదము గలదు. తండ్రి తాతలవలె శృంగార, అధ్యాత్మ సంకీర్తనములను రచించెను.

ఇతని రచనయగు "గరిమనావయసున తాటకిజంపిన కౌసల్యానందనరాఘవ" అనుదానినిబట్టి "గరిమనావయసు" అని అన్వయించుకొని రామాయణ కథాసందర్భములనుబట్టి రాముడు పదునైదేండ్ల ప్రాయమున తాటకిని జంపినట్లు తెలియుచున్నది గాన తిరుమలయ్యయు 15 లేక 16 ఏండ్ల నడుమననే కీర్తన రచన కారంభించి యుండునని 16వ సంపుటమును పరిష్కరించిన శ్రీమాన్ ఉదయగిరి శ్రీనివాసాచార్యులు వ్రాసిరి. చినతిరుమలయ్య తాతగారైన అన్నమయ్యను భక్తి శ్రద్ధలతో కీర్తించినాడు.

చినతిరుమలయ్య తనసంకీర్తనములలో ఒకదానియందు తనకులము (నందవరీకులు) వారు "పచ్చితామసులనియు" అట్టివారిని పరమ సాత్వికులనుగా జేసి, ఎన్నడులేని వైష్ణవమచ్చముగ కృపజేసి, "సంకీర్తన మదనుపదేశించి" కడు వివేకులజేసి యిడుమలెల్ల బాపెనని" అన్నమాచార్యునిగూర్చి పేర్కొనినాడు. భగవద్భక్తిని గోల్పోయి లౌకిక ప్రాభవమునకై ప్రభువులవెంటబడి ప్రాకులాడు దైన్యమును చినతిరుమలయ్య గర్హించినాడు. (చూ॥ 16-1-42, 52)

చినతిరుమలయ్య దిగువ తిరుపతిలోని వేల్పులకును, తిరుమలలోని శ్రీ వెంకటేశ్వరునకును చాల కైంకర్యములు గావించినాడు.

వానిని స్మరించు కీర్తనములు గూడ కొన్ని గలవు. క్రీ.శ. 1540వ సంవత్సరమున తన అగ్రహారమగు మంగాపురము నందలి కల్యాణ వేంకటేశ్వర దేవాలయ జీర్ణోద్ధరణముగావించి యున్నాడు. అప్పటి ఆళ్వారులతో, భాష్యకార్లతో, దేశికులతో సహా తన తాతగారగు అన్నమాచార్యుని విగ్రహమును మంగాపురమున ప్రతిష్టించినాడు. కాని యిప్పుడది కానరాదు శాసనాధారమును బట్టి కీర్తనములనుబట్టి ఇతడు మత ప్రచారమునకు, సంకీర్తన ప్రచారమునకు చిత్తూరు, అనంతపురము, కడప, కర్నూలు, నెల్లూరు, గుంటూరు మున్నగు మండలములందు సంచారముగావించినట్లు తెలియుచున్నది. ఈతడు క్రీ. శ 1562 వరకు జీవించినట్లు తెలియుచున్నది.

చినతిరుమలయ్యకు పెదమంగమ్మ వలన తిరువేంగళప్ప జన్మించెను.

## చినతిరుమలాచార్యుని కృతులు - ప్రకటితములు

1) శృంగార సంకీర్తనలు
2) ఆధ్యాత్మ సంకీర్తనలు
3) అష్టభాషా దండకము-దండకము
4) సంకీర్తన లక్షణము - తెలుగులో లక్షణగ్రంథము - అనువాదము

## తాళ్లపాక అన్నయ్య

ఇతడు పెదతిరుమలాచార్యుని రెండవకుమారుడు చినతిరుమలాచార్యునితమ్ముడు. ఇతనిని కోనేటి అన్నయ్యంగారని వ్యవహరింతురు. తాళ్ళపాకవారి కుటుంబము తిరుమలమీద కోనేటి సమీపమున స్థిరనివాస మేర్పరచుకొని యుండుటచేత కోనేటివారని అనుచుండిరని తెలియుచున్నది. పెదతిరుమలాచార్యుని కుటుంబసభ్యులు క్రీ. శ. 1540 50 సంవత్సరముల నడుమ తిరుమలతిరుపతులను కేంద్రములుగా పెట్టుకొన్నను మతప్రచారము కొరకు దేశము నలుమూలలకు ప్రాకి

నట్లున్నారు. ఈకోనేటి అన్నమయ్యగారి కుటుంబము గుంటూరు మండలము జేరినట్లున్నారు.

కొండవీటి దుర్గమునకు జెందిన వినుకొండ సీమలోని మిన్నికల్లు గ్రామమును (గుంటూరు, నర్సారావుపేట తాలూకా) సదాశివ రాయలు 15-5-1546 లో ఈ అన్నయ్యకు దానముచేసినట్లొక శాసనము గలదు. (చూ॥ శాసనము సంఖ్య 314-1915-16). వేరొక శాసనమునందు ఆ మహారాజు అన్నయ్యగారికి క్రీ. శ. 1557 లో ఆలూరి సీమలోని "తండువ" గ్రామమును దానము చేసినట్లు తెలియుచున్నది. [చూ॥ మెకంజీరికార్డులో ఈ శాసన విషయమున్నట్లు శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారు గుర్తించియున్నారు. చూ॥ Annals of SVO I Vol-I-part-I-Page 100-101]

ఈ అన్నయ్య క్రీ. శ. 1492 ప్రాంతమున జన్మించి దాదాపు అరవదేండ్లు జీవించెనని తెలియుచున్నది. ఇతడు అన్ని విద్యలందు "మున్నింటి అన్నయార్యుని బోలు నన్నమాచార్యుడని" చెప్పబడి నాడు. ఇతని రచన లేవియు కానరావచ్చుటలేదు.

## తాళ్లపాక పెదతిరువేంగళనాథుడు :-

తాళ్ళపాక పెదతిరుమలాచార్యుని మూడవ కుమారుడు. ఇతనికి తిరువేంగళయ్య. తిరువేంకటప్ప అని నామాంతరములు గలవు. ఇతడు సాత్విక శుభ మూర్తి సంగీత సత్కవిత్వాధికుడని చిన్నన్న చే స్తుతింపబడెను. స్వామి సన్నిధి నితడు సంకీర్తనము పాడుచుండగ స్వామి ఆడుచుండెడివాడట.

రేవణూరి వేంకటాచార్యుడు "శకుంతలా పరిణయ" ప్రబంధమున' "విశేషించియు నత్తిరువేంగళనాథుడు సంకీర్తనంబుల పాడిన నాడదోషం గెనని" చెప్పియున్నాడు. చిన్నన్న క్రీ. శ. 1546 లో వేయించిన శాసనము నందీ పెద తిరువేంగళనాథుని ప్రత్యాబ్దిక దినమున జేయు విశేషార్చనల గూర్చి ప్రస్తావించి యుండుటచేత, పెదతిరువేంగళనాథు డంతకుముందే పరమపదించెననుట స్పష్టము.

ఈతడు 50 సంవత్సరముల కన్న ఎక్కువకాలము జీవించి యుండెనని చెప్పవచ్చును.

## తాళ్ళపాక చినతిరువేంగళనాథుడు (చిన్నన్న)

తాళ్ళపాక పెదతిరుమలాచార్యుని సంతానమైన ఐదుగురిలో నాల్గవవాడు చిన్నన్న. తాళ్ళపాక చినతిరుమలయ్య క్రీ. శ. 1488-90 ప్రాంతమున జన్మించినాడని అనుకొనుటచేత అతనికి మూడవ తమ్ముడగు చిన్నన్న జననము క్రీ. శ. 1500 ప్రాంతమైయుండును. చిన తిరువేంగళనాథునికి అను నామాంతరము సార్థకము. ఇతనికి తిరువేంగళ నాథయ్య, వేంగళార్య, తిరువేంకటనాథర్, తిరువేణాథర్ - అను నామాంతరములు గలవు.

శ్రీకృష్ణదేవరాయల రాజ్యాంత కాలమున కితడు ముప్పది యేండ్ల వాడయి యుండును. అచ్యుత, సదాశివరాయాదుల కాలమున చిన్నన్న గొప్ప రచయితగ ప్రఖ్యాతగాంచి వారిచే ఘనముగ సన్మానింపబడెను. (చూ॥ తి,తి.దే. శాసనము' సం' 5-71. నెల్లూరు శాసనములు. నెం. 21 శాసనము ననుసరించి సదాశివరాయడీతనికి అద్దంకి సీమ యందలి మల్లనర గ్రామమును క్రీ.శ. 1445లో దానము చేసినట్లు గలదు. చిన్నన్న క్రీ. శ. 1546లో దీనిని స్వామి కర్పించెను.

చిన్నన్న ద్విపద కవిత్వమున పేర్గాంచినవాడు. రసవత్తరమైన ప్రబంధములను ద్విపదచ్ఛందమున నిబంధించినాడు. పండితలోకమున అంతకుముందు ద్విపద రచనకుండిన అనాదరమును, చిన్నన్న తనదైన శిష్టము లక్షణ బద్ధమగు ద్విపదులచే తొలగించి దానికి కావ్యత్వ సిద్ధిని కల్పించినాడు. తాతగారి జీవిత చరిత్రమును సమగ్రమముగ, ప్రామాణికముగ రచించినాడు.

కస్తురిపీణె గోసినకరణి, తెలిగప్పురపు గ్రోవి దెరచిన సరణి, విరవాది పొట్లంబు విడిచిన మాడ్కి, పరిమళించుచు కవుల్ బళీబళీ యనగ" కవిత జెప్పిన సులక్షణకవి, "దినములోననవేయి ద్విపదలింపొంద వినుత వర్ణనలతోడ విరచించు' వాడుచిన్నన్న.

ఇతడు సుకవి, పండితుడు "జలజాతవాసిని చనుబాల పుష్టిచే" కవితా రచనకుద్యమించినాడు "రత్న శుంభ దనుపమ, శ్రీ వేంకటా ద్రీశదత్త మకరకుండల యుగ్మ మండిత" కన్నడు. "సకల వైష్ణవ పాద సంసేవకాబ్జ సదనాపధూలబ్ధ సరస కవిత్వ విదితమానసుడు" "చిన్నన్న ద్విపద కెరుగును" అని కొనియాడ బడినవాడు.

చిన్నన్న శాసనములు, పరమయోగి విలాసాది కృతులను బట్టి వైష్ణవమత ప్రచారమునకీతడు చాల పాటుపడినాడని తెలియుచున్నది. క్రీ. శ. 1546లో సదాశివరాయలచేత గొరిజవోలు గ్రామమును దానముగగొన్న "తిరువేంగళ నాథయ్యగారు "చిన్నన్న యేనని శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి గారు వ్రాసియున్నారు. (చూ॥ తి. తి. దే. ఎపి రిపోర్టు. పుట. 297).

కాని ఆ తిరువేంగళనాథుడు చిన్నన్న కాదని, ఆతడు కోనేటి తిరువేంగళనాథుడని శ్రీ వేటూరి ఆనందమూర్తి గారు తమ "తాళ్ళ పాక కవుల కృతులు - వివిధసాహితీ ప్రక్రియలు అను గ్రంథమున అభిప్రాయ పడియున్నారు.

చిన్నన్న పింగళి సూరనార్యునకు సమకాలికుడే గాక అతనిని, అతని కృతులను చక్కగ నెరిగినవాడు. ఆర్వాచీనులు కొందరు, తాళ్ల పాక చిన్నన్న దండెమీటలు గావు" అనియు, "అల తాళ్ళపాక చిన్నన్న రోమములైన తంబురా దండెకు దంత్రు లౌనె" అనియు, చిన్నన్న గొప్ప గాయకుడగునట్లు స్మరించిరి. కాని చిన్నన్న గొప్ప వాగ్గేయ కారుడగుటకు తగిన ఆధారము లేవియు తిరుపతి రాగిరేకు లందు తెలియరాకున్నవి.

"చిన్నన్న అన్న, తండ్రి, తాత గొప్పగాయకులు గాన, ఇటీవల వారు గ్రంథములను బట్టి చిన్నన్ననే ఎరిగినవారుగాక, వారి యోగ్యత నితనికిజేర్చి చెప్పియుండవచ్చును." అని వేటూరి ప్రభాకర శాస్త్రిగారు అన్నమాచార్య చరిత్ర పీఠిక విషయమున వ్రాసినది సమంజసమగును. చిన్నన్న గాయకుడుకాకున్నను, సంగీతశాస్త్ర

పరిజ్ఞానము కలవాడనుటకు సందేహింప పనిలేదు ఇతని, ఉషా కల్యాణమను ప్రబంధమీ విషయమును వెల్లడిజేయును.

గణపవరపు వేంకటకవి "ప్రబంధరాజమున" చిన్నన్న నిట్లు సన్నుతించెను.

కం॥ ఎన్న దెనుగునకు రాజను
గ్రిన్నన యతిరాజునకును రమణయకును నే
జిన్నను, ద్విపద నొనర్పను
జిన్నన్నను, బిరుదగద్య చెప్పిన ఘనుడన్"

చిన్నన్న పద్మసాలెవారికి ఆచార్యపురుషుడు, చిన్నన్న వంశ పారంపర్యముగ సాలెకుటుంబములవారు, గురుశిష్యతా సంబంధమున వర్ధిల్లగోరి కానుకలర్పించుకొని ఒక తామ్ర శాసనమును గూడ క్రీ శ. 1541 లో వెలయించిరి. (చూ॥ Annals of SVOI. Vol-1 Part-1. Page 80-106)

చిన్నన్న క్రీ. శ. 1558 ప్రాంతమున మరణించినట్లు తెలియు చున్నది. దాదాపు 60 ఏండ్లు జీవించి యుండవచ్చును శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారు గూడ చిన్నన్న వంశము వారిని నేటి తరము వరకును ఆ కుటుంబము వారి నుండి తెలిసికొన్న విషయములను పేర్కొని యున్నారు.

"Taking 1570 A. D. as the latest date of Chinnanna, three hundred and seventy years till this day is covered up by eight generations" అని వ్రాసియున్నారు. (చూ. Annals of SVOI Vol-1. Part-I-Page-103)

తిరుపతి శాసనములలో చిన్నన్నను గూర్చిన ప్రశంస మనకు క్రీ. శ. 1558 తరువాత కానరాదు. నేడు ప్రసిద్ధిలో నున్నవారు (తాళ్లపాకవారు) పలువురు చిన్నన్న వంశములోని వారమని చెప్పుదురు.

చిన్నన్న
- వేంకటేశయ్య
  - సోమయ్య
    - బుచ్చన్న
      - పెరుమాళయ్య
        - రామయ్య
          - పెరుమాళయ్య
            - వెంకటరమణయ్య
              - సూర్యనారాయణయ్య
          - అప్పళాచార్య
- అప్పయ్య

**చిన్నన్న కృతులు :- ప్రకటితములు – ద్విపదలు**

1. అష్టమహిషీ కల్యాణము
2. ఉషాకళ్యాణము
3. పరమయోగి విలాసము
4. అన్నమాచార్య చరిత్రము

**చిన్నన్న ధర్మకైంకర్యములు :-**

శ్రీ వేంకటేశ్వరస్వామికి చిన్నన్న అనేక ధర్మకైంకర్యము లొనర్చెను. క్రీ. శ. 1546లో కొండవీటిసీమలోని చెందలూరు, మల్లవర గ్రామములను స్వామి శ్రీ భండారమునకు అర్పించెను. రెండు గ్రామములనుండి సంవత్సరపు రాబడి 620 గట్టి వరహాలు ఈ సొమ్ముతో జరుపబడు ధర్మకైంకర్యములు :–

1) వైశాఖ మాసమున విశాఖ నక్షత్రమున తాత అన్నమయ్య గారి జన్మనక్షత్ర ఉత్సవకైంకర్యము.

2) చైత్రమాసము మృగశిరా నక్షత్రమున పెదతిరుమలయ్యగారి జన్మదినోత్సవకైంకర్యము.

3) మాఘ శుద్ధ చతుర్దశి తమ పెదతండ్రి నరసయ్యగారి శ్రాద్ధ దిన కైంకర్యము.

4) జ్యేష్ఠమాస పూర్వపక్ష చతుర్థి, తన అన్నగారగు తిరువేంగళప్ప శ్రాద్ధదిన కైంకర్యము.

5) ఆశ్వయుజ మాస బహుళ త్రయోదశి తమ తల్లిగారైన తిరుమలమ్మగారి శ్రాద్ధ దినకైంకర్యము.

కోనేటి తిరువేంగళనాథుడు :-

ఇతనికి కోనేటి తిరువేంగళ నాథయ్య, కోనేటి వేంకట నాథయ్య, కోనేటి తిరువేంగళ నాథయ్యంగారు అని నామాంతరములు గలవు.

తాళ్ళపాక పెదతిరుమలాచార్యుని కుమారులలో ఇతడు చివరి వాడు. ఇతడు క్రీ. శ. 1504 ప్రాంతమున జన్మించి దాదాపు 70 ఏండ్లు జీవించెను. ఇతడు గొప్ప వైష్ణవాచార్యుడై, యోగసిద్ధులను బడసిన వాడై ప్రఖ్యాతి గాంచినాడు. ఇతడు సదాశివరాయాదుల చేత క్రీ. శ. 1544, 1545,1546, 1564 ప్రాంతములందు పెక్కు అగ్రహార ములను బడసి వారిచే సన్మానింపబడెను. క్రీ శ. 1544, 1545 సంవత్స రములలో అద్దంకి సీమలోని ఓలిపల్లి, బొల్లాపల్లి గ్రామములను సదాశివరాయలచేత ధారాపూర్వకముగ బడసినాడు (చూ॥ తి.తి.దే. ఎ. పి. రిపోర్టు, పేజి 298 మరియు సం. 419 ఆఫ్ క్రీ. శ. 1915-16, 684 ఆఫ్ 1920-21, 182 ఆఫ్ 1916-17, 686 ఆఫ్ 1920-21.

క్రీ. శ. 1559వ సంవత్సరము, కడపజిల్లా పుష్పగిరి చెన్న రాయనికి కొంతభూమిని కోనేటి తిరువేంగళనాథుడు సమర్పించినాడు. ఈతడు గ్రహించిన అగ్రహారములలో కొండవీటిసీమలోని గోరిజవోలు నేటి గుంటూరు మండలమునందలి ఈమని, ఉంగుటూరు దంతలూరు

గుండవరము మొదలగునవి తెలియవచ్చుచున్నవి. ఇతని కుటుంబము వారు గుంటూరు మండలమున వ్యాపించినట్లు తెలియుచున్నది. ఇతడు శాసనాధారములనుబట్టి వైష్ణవాచార్యుడుగను, వేదమార్గ ప్రతిష్ఠాపనా చార్యుడుగను తెలియుచున్నాడు.

అళియ రామరాయని మేనల్లుని వంశము వాడగు సిద్ధిరాజు వేంకటరాజమంచిలేశ్వరుడు కోనేటితిరువేంగళనాథుని ఆదరించినాడు. ఆ వంశమువారికి కోనేటి తిరువేంగళనాథుడు ఆచార్యుడుగగూడ నుండెనని తలపనగును. ఈ మహనీయుడు గొప్పవైభవము ననుభవించెననుటకు క్రింది పద్యము నిదర్శనము.

సీ॥ మొకరి వాతెరకీర్తి ముఖము బంగరుదండె
పాలకియే గురుండోలి నెక్కి
శ్రీజగన్నాథు నూర్జిత పదాంభోజముల్
సేవించియే బుధాశ్రితుడు వెలసె
కాయసిద్ధిని లంబికాయోగమార్గంబు
తెలిసియే ఘనుడు సాధించినగడె
భక్తితోఁటట్టాభిషిక్తులు ధరసాగి
మ్రొక్కనే విభుడు పెంపెక్కి చెలగె
నతడు పొగడొందు హారనీహారగంధ
సారకర్పూరగోక్షీర సదృశయశుడు
ఘనుడు పెదతిమ్మ దేశికగర్భ జలధి
కువల యాప్తుండు కోనేటి గురువరుండు.

[ఉ పద్యము శ్రీ తాళ్ళపాక సూర్యనారాయణగారి వ్రాత కాగితములనుండి శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి గారు గ్రహించి ప్రకటించినారు. చూ॥ అన్నమాచార్య చరిత్ర పీఠిక-పుట96.]

## తిరువెంగళప్ప :

ఇతనికి తిరువెంగళప్పర్, తిరువేంగళ దీక్షితులుఅను నామాంతరములు గలవు తాళ్ళపాక చినతిరుమలాచార్యునకు అతనిభార్యయగు పెద మంగమ్మకు తిరువెంగళప్ప జన్మించెను.

క్రీ.శ. 1554వ సంవత్సరమున తిరువెంగళప్ప తల్లి పెదమంగమ్మ మరణించినది. చిన తిరుమలార్యునకు 30 ఏండ్ల వయసున జన్మించె నన్నచో ఇతని జననము క్రీ.శ 1518 అగును. క్రీ.శ 1553, 1554 సంవత్సరములలో ఈతని దానాదికమును తెలుపు శాసనములు కొన్ని యున్నవి తిరువెంగళప్ప, కోనేటి తిరువేంగళ నాథుడును సమకాలకులై క్రీ.శ. 1565 వరకు జీవించి యుందురని తెలియుచున్నది.

ఇతడు గొప్ప విద్వాంసుడు. రసవత్కవిత జెప్పిన ఉజ్జ్వల కవితా నిధి. అమరు కావ్యములను తెనిగించి వివరణము గూడ వ్రాసి యున్నాడు. సుప్రసిద్ధ అలంకారిక గ్రంథమగు కావ్యప్రకాశికకు సంస్కృతమున నొక వ్యాఖ్యను వెలయించినాడు.

తిరుపతి గోవిందరాజస్వామి ఆలయమునకును, కంచిలోని అరుళా లప్పెరుమాళ్ళకును కొన్ని భూములను సమర్పించి ఉత్సవములను నిర్వహింపజేసినాడు. క్రీ.శ. 1554లో అంబత్తూరు, తూప్పిల్ అగ్రహా రములో కొంతభాగము గోంవిదరాజస్వామి పెండ్లి తిరునాళ్ళు జరిపించుటకు సమర్పించినాడు.

## తిరువెంగళప్ప కృతులు :

1) అమరుకము-ముక్తక కావ్యము-అనువాదము-ప్రకటితము
2) బాలప్రబోధికము-అమరుకమునకు తెలుగువ్యాఖ్య(ప్రకటితము)
3) సుధానిధి-మమ్మటుని కావ్యప్రకాశికకు వ్యాఖ్య (అప్రకటితము)
4) రామచంద్రోపఖ్యానము-కావ్యము-అలభ్యము

## రేవణూరి వేంకటాచార్యుడు :

ఇతడు అన్నమాచార్యునకు మనుమడు. అన్నమయ్య కుమార్తెయగు తిరుమలాంబకు తిరుమల కొండయార్యుని వలన జన్మించాడు. ఇతడు శకుంతలా పరిణయమనుప్రబంధమును రచించెను. ఇది అప్రకటితము, "శ్రీపాదరేణు" మహాత్మ్యమును రచించెను. ఇది ప్రకటితము.

# తాళ్ళపాకవారు -
# స్వామి కైంకర్యములు

తాళ్ళపాకవారు కడపజిల్లా రాజంపేట తాలూకాలోని తాళ్ళపాక గ్రామమునకు చెందినవారు క్రీ. శ. 15, 16 శతాబ్దములలో తిరుమల తిరుపతులలో నివాసమేర్పరచుకొని కాలము గడిపినట్లు విదితమగుచున్నది. ఈవంశవిఖ్యాతికి మూలపురుషుడగు అన్నమాచార్యుని కుమారుడగు పెదతిరుమలాచార్యుని యొక్క చినతిరుమలాచార్యుని యొక్క, చిన్నన్న యొక్క శాసనములు దాదాపు పాతికవరకు తిరుపతిలో కానవగుచున్నవి తాళ్ళపాకవారి ప్రస్తావనగల శాసనములు విజయనగర రాజులను చెందినవి మరికొన్ని గలవు. వీనినిబట్టి విజయనగర రాజుల కాలమున తాళ్ళపాకవారెట్టి ప్రాభవమున వర్థిల్లిరో, స్వామివారికెన్ని కైంకర్యములొనర్చిరో తెలియుచున్నది వీరు కొన్ని గ్రామములను, కొంత ధనమును శ్రీభాండారమున అనేక సందర్భములలో సమర్పించి, వివిధకైంకర్యముల నేర్పాటు గావించిరి. సంకీర్తన వాఙ్మయతో స్వామి నర్చించి, సంకీర్తన భాండారము నొకదానిని నెలకొల్పిరి. ఆవ్యవస్థ నిర్విఘ్నముగ కొనసాగుటకై తగిన జాగ్రత్త వహించిరి. తాళ్ళపాకవారు కొన్ని నూతన నిర్మాణములను గావించిరి. కొన్నిటిని పునరుద్ధరించిరి.

ఆత్మశుద్ధితో, భక్తి శ్రద్ధలతో వర్థిల్లి, ఆచార్య పురుషులై శిష్యులను అనుయాయులను కూర్చుకొని సుప్రసిద్ధులగువారి సమకాలికుల కెందరికో మార్గ దర్శకులై మనిరి.

తాళ్ళపాకవారు 15వశతాబ్ది మధ్యభాగము నుండియు (అనగ) సాళువ నరసింగరాయని కాలమున తిరుపతిలో ప్రసిద్ధులై యుండినప్పటికి వీరి శాసనములు పదునారవ శతాబ్ది ప్రారంభమునుండి మాత్రమే కానవచ్చు చున్నవి.

తిరుపతిలో లభించిన శాసనములలో పెద తిరుమలాచార్యునిదె తొలి శాసనము. ఇది శ్రీకృష్ణదేవరాయల నాటిది. క్రి.శ. 1517 నవంబరు 30వ తేదీన వేయించినది. ఇక చివరి శాసనము తిరువేంగళ నాథునిది. ఇది సదాశివరాయల కాలము నాటిది. క్రి.శ. 1558 జనవరి 13వ తేదీన వేయించినది. ఆనదుమ తాళ్ళపాకవారు వేయించిన శాసనము 24 లభించినవి వానిలో వీరు స్వామికి అర్పించిన గ్రామములు 23 వరకున్నట్లున్నవి. అవి :-

1) రాయల్పాడు-అవుకుసీమ (నేటికోయిలకుంట్ల తాలూకా కర్నూలు జిల్లా.)
2) సోమరాజులపల్లె-కాలవాయ్ సీమలోని ముద్దులూరు గ్రామముతో చేరినది.
3) గడ్డము (కత్తము) వారిపల్లె-తూపూర్ కంచిగుంట సీమ
4) తిప్పనపల్లె. తూపూర్ కంచిగుంటసీమ సిద్ధవటం, ప్రొద్దుటూరు తాలూకాలు-కడప జిల్లా
5) ఎట్టిగుంటాయపల్లె-సిరివోలుసీమ (సగము గ్రామమమాత్రమే)
6) పూండి
7) సంగమకోట
8) మరువాకరై 9) కావనూరు
10) వళ్ళీపురం_కంచిగుంటసీమ
11) కుప్పం,
12) కీలంగుణ్ణం } కావనూరు సమీపగ్రామములు
13) ముత్యాలపట్టు
14) గండమ తిమ్మపురం-కారియపల్లిపద్ద
15) నేడియం (సగము గ్రామము మాత్రమే)
16) వేదుమపాకం-మాదనల్లూరిసీమ
17) పున్నియం-నగిరిసీమ
18) చెందలూరు-కొండవీటిసీమ
19) మల్లవరం

20) దేవరాయపల్లి-వినుకొండసీమ
21) తూప్పిల్ అగ్రహారము (20 వృత్తులు మాత్రమే)
22) అంబత్తూరు-నగరిసీమ
23) కొత్తూరు-పెరింబాక రాజ్యము
24) అలర్ మేల్మంగాపురము-చంద్రగిరిరాజ్యము

**తాళ్ళపాకవారి కైంకర్యములు :-**

పైవానిలో పూండి సంగమకోట గ్రామములు విజయనగర చక్రవర్తియగు అచ్యుతదేవరాయలు 1532 నకు పూర్వమెన్నడో తాళ్ళపాక పెదతిరుమలాచార్యునకు రాగిశాసనమును వేయించి ధారాదత్తము చేసినవి. ఆ గ్రామముల నాతడు 1532 మార్చి 27వ తేదీన తిరువేంగళనాథున (స్వామి) కర్పించుకొని, ప్రతిదినము అళగప్పి రానార్ తిరుమంజనమప్పుడు 40 తిరుపోణకములు 3 యజ్ఞోపవీతములు, శుక్రవారము సంకీర్తనముల సమయమున ఒక పన్నీరు బుడ్డి సమర్పితములగునటుల ఏర్పాటు గావించెను. (చూ॥ తి. తి. దే. శా. సం. 4-14). అట్లే తూప్పూరు కంచిగుంట సీమలోని పల్లిపురం గ్రామమును బుక్కరాజు తిమ్మరాజు వద్దకొని పెదతిరుమలాచార్యుడు స్వామి కర్పించెను. దానిమీదవచ్చు 133 వరహాల ఆదాయముతో నిత్యము గోధుమపణ్యారము స్వామికి సమర్పితమగునట్లు విధించెను. (చూ॥ తి, తి. దే. సం. 4-122).

ముత్యాలపట్టు గ్రామము కూడ పూర్వము విజయనగర చక్రవర్తుల చేతనే దానమీయబడిన గ్రామముగ తోచును. దీనిని పెదతిరుమలాచార్యుడు శ్రీ స్వామివారి కర్పించి ఆగ్రామముమీద వచ్చుచుండిన 280 బంగారు రేఖల ఆదాయముతో తమపేర కొన్ని విశేషోత్సవములు జరుగునట్లేర్పరచియుండెను. కాని అచ్యుత దేవరాయల అనంతరము సదాశివరాయలు రాజ్యమునకు వచ్చులోపుగ రాజ్యవ్యాప్తికై సాగిన సమరము కారణముననో మరి ఏ కారణముననో ఆ గ్రామముమీద ఆదాయము శ్రీభండారమునకు చెందకుండ ఆగిపోవు

పరిస్థితులు కలిగినవి శ్రీభండారము నిర్వాహమువారు ఆవిషయమును దాతయగు పెదతిరుమలయ్యవిన్నవింపగ ఆతడు ప్రభువులగు సదాశివ రాయలకును, వ్యవహారజ్ఞుడగు అళియ రామరాయలకును విన్నపము పంపుకొని క్రీ. శ. 1545లో ఆగ్రామముమీది ఆదాయము యథావిధిగా శ్రీభండారమునకు చెందునట్లుగా అనుమతి పత్రములను పొందెను. ఆనకుమ కాలమున స్వామివారికి తమ పేర జరుగు కైంకర్యములు ఆగిపోకుండుటకై 100 రేఖలు వెచ్చించి, అచటి తటాకమును బాగు చేయించి, మరల స్వామికర్పించుచు తాను 36 రేఖలను, తన శిష్యుడు శ్రీపతి తోండయ్య 70 రేఖలను చెరసి 106 రేఖల సొమ్ము నదనముగ నర్పించి పూర్వము జరుగుచుండిన వానితో బాటు మరికొన్ని ఉభయములు కూడ నిర్వహింపబడునట్లు 1545 జూలై 8వ తేది పెద తిరుమలయ్య ఏర్పాటు గావించెను. (చూ॥ తి. తి. దే. శా. సం. 5 నెం. 47).

విజయనగర రాజులు వీరికి సర్వ సమాన్యముగ సమర్పించిన అలర్ మేల్మంగాపురమును అచటి కల్యాణ వేంకటేశ్వరాలయ పునరుద్ధారముతో ఒక పుణ్యక్షేత్రముగనే మార్చి వేసిరి. ఆఊరిమీద ఆదాయముతో వేంకటేశ్వరులయు పరమాచార్యులయు, పన్నిద్దరాళ్వారులయు ఉత్సవములను చినతిరుమలాచార్యాదులు నిర్వహింపజేసిరి. (చూ॥ తి. తి. దే. శా. సం. 4-44).

మిగిలిన గ్రామములు కూడ పరమభక్తాగ్రేసరులును, హరికీర్తనాచార్యులును అగు తాళ్ళపాకవారికి విజయనగర సామ్రాట్టులే దానమిచ్చినవై యుండును. లేకున్న వీరు స్వయముగ ధనమిచ్చికొనిన గ్రామములు గూడ వీనిలో కొన్ని యుండవచ్చును. ఏమైనను తమ ప్రతిభా విశేషములకు మెచ్చి ప్రభువులు ప్రభుత్వోద్యోగులు సమర్పించిన కానుకలెల్ల వీరు తిరుమల స్వామికే అర్పించుకొని ఆదేవుని సేవలోనే తమ జీవితమును వెళ్ళబుచ్చిరి.

తిరుమల తిరుపతులలో తాళ్ళపాకవారు గావించిన నిర్మాణములనేకములున్నవి. తిరుమలమీద సంకీర్తన భండారమును నిర్మించిరి.

తరువాత స్వామివారి ఆలయములోను, తమయింటి ముందును తాళ్ళ పాకవారు రెండు మంటపములను గట్టించిరి. ఆమంటపములలో ఉత్సవ మూర్తికి బ్రహ్మోత్సవ సమయములందు ఊంజల్ సేవలు నైవేద్యములు జరుగుచుండినవి (చూ॥ No. 6 and 100 Vol. IV పెదతిరుమలా చార్యుని కైంకర్యము)

తాళ్ళపాకవారే స్వామి పుష్కరిణి నడుమనున్న నీరాళి మండపము నుద్ధరించి చుట్టును ప్రదక్షిణ మంటపములు కట్టించి పరిసరములను బాగుపరచిరి. (చూ॥ తి. తి. దే. శా. సం. 4. సంఖ్య 14. పెద తిరుమలయ్య కైంకర్యము) పుష్కరిణి గట్టుననే వారొక రాతి దీప స్తంభమును నిలబెట్టిరి. ప్రతి గురువారము అందు దీపమును వెలిగించుటకై జీతగాంద్రను నియోగించిరి. ముక్కోటి ద్వాదశినాడు ముప్పది రెండు దీపములను పుష్కరిణిగట్టున వెలిగించుటకై గూడ ఏర్పాట్లు గావించిరి. (చూ॥ తి. తి. దే. శా. సం. 4. సంఖ్య 129. పెదతిరుమలయ్య కైంకర్యము)

కొండమీదనె కార్తికమాసమున వనభోజనానంతరము ఉత్సవమూర్తి ఆలయమునకు వచ్చునపుడు పూజానైవేద్యములందుకొనుటకై ఆగుటకొరకు శ్రీ భండార నిర్వాహకులు వండెరిందుగురి కేరిట పంద్రెండు మంటపములను తాళ్ళపాకవారు కట్టించిరి. (చూ॥ తి. తి. దే. శా. సం. 5 సంఖ్య 47 ఎ. పెదతిరుమలాచార్యుని కైంకర్యము).

తిరుపతి సమీప గ్రామమగు తిరువేంకటపురమునందును అచ్యుతరాయ పెరుమాళ్ వేట ఉత్సవము సందర్భమున ఉండుటకై ఒక మంటపమును కట్టించిరి. ఈ మంటపమునందే ఒక స్తంభమున రఘునాథుని విగ్రహమును చెక్కించిరి. తరువాతి కాలమున ఈ విగ్రహమునకు గూడ పూజా నైవేద్యములు సాగినవి (చూ॥ తి. తి. దే. శా. సం. 5 సంఖ్య 99 చినతిరుమలాచార్యుని కైంకర్యము)

మన్నసముద్రం అను గ్రామమువద్ద ఒక పొంగల్ మంటపమును ఆళ్వారు తీర్థమున తీర్థవారి మంటపమును వీరు నిర్మించిరి (చూ॥ తి.

తి. దే. శా. సం. 4 సంఖ్య 100 Vol. V. No. 68 పెదతిరుమలా చార్యుని కైంకర్యము).

తిరుమలమీాద వరాహస్వామివారి ఆలయ ప్రాకార ములను తాళ్ళపాకవారే కట్టించిరి. తూర్పుదిక్కు నందొక గోపురమును కూడా స్వామివారికి తాళ్ళపాకవారే కట్టించిరి. (చూ॥ తి తి దే శా. సం. 4 సంఖ్య 14 పెదతిరుమలయ్య కైంకర్యము)

తాళ్ళపాకవారు కొన్ని నూతనాలయములను కట్టించి విగ్రహ ప్రతిష్ఠాపనములను కూడ కావించిరి. అవి :-

క్రీ. శ. 1540 మార్చి 22వ తేదీన చంద్రగిరి సమీాపమునందలి అలర్ మేల్మంగా పురముననున్న కళ్యాణ వేంకటేశ్వరుల విగ్రహము తో బాటు నాచ్చియార్, అనంత, గరుడ, విష్వక్సేనాదులను, పన్నిద్దరాళ్వారులను, ఉడయవరులను, పూర్వాచారులను. తమ ఆచార్యులైన తాళ్ళపాక అన్నమాచార్యులను గూడ ప్రతిష్ఠాపించిరి. (చూ॥ తి. తి. దే. శా. సం. 4 సంఖ్య 144 చినతిరుమలాచార్యుని కైంకర్యము) విజయనగర రాజులు తమకు సర్వమాన్యముగ సమర్పించిన ఆ అగ్రహారముమీాది ఆదాయముతో అక్కడి ఉత్సవ విశేషములు నిర్విఘ్నముగ నిర్వహింపబడునట్లు తాళ్ళపాకవారు తగిన ఏర్పాటులను గావించిరి.

వీరు తిరుపతిలోని ఆళ్వారు తీర్థమున లక్ష్మీనారాయణ పెరుమాళ్‌ను గోవిందపుష్కరిణి గట్టున చక్రత్తాళ్వారుల (సుదర్శన చక్రము) ను, కటారి హనుమాలయములో నరసింగదేవుని ప్రతిష్ఠాపించి నిత్యనైమిత్తిక పూజా విశేషములు మాసోత్సవ, వర్షోత్సవములు నిరంతరాయముగ జరుగుటకై తాళ్ళపాకవారు వసతులు కల్పించిరి. (చూ॥ తి. తి. దే. శా. సం. V. సం. 68 పెదతిరుమలయ్య Vol. -5-159 తిరువేంగళనాథయ్య Vol. 5-99 చిన తిరుమలయ్య).

ఆళ్వార్ తీర్థ సమీాపమందలి పెద్దచీమగు కొండపై శ్రీనివాసుని, పెరియాళ్వారులు విగ్రహములను ప్రతిష్ఠాపించి ధూపదీప నైవేద్యాదుల నేర్పరచి అధ్యయనోత్సవము పండ్రెండు దినములు

జరుగునట్లు వసతులు గల్పించిరి.(చూ॥ No. 153 of Vol. V dated 19th Feb. 1554.) తాళ్ళపాక తిరువేంగళనాథయ్య తనతల్లి పెద మంగమ్మగారి పుణ్యమునకై ఈ పెద్దచీముగు కొండదేవునకు తిరు పొణకములేర్పరచెను.)

## ఉత్సవములు :-

తాళ్ళపాకవారు నూతనాలయములను నిర్మించి నూతనక్షేత్ర ములను వెలయింపజేయుటయే గాక, ఆయా దైవతములకు, తమకు పూర్వము పలువురు ప్రతిష్ఠాపించిన దైవతములకు విశేషముగా మహోత్సవ వర్షోత్సవములు నిర్విఘ్నముగ కలకాలము జరుగునట్లు వసతులు కల్పించిరి. పూర్వము నుండియు జరుగుచుండిన ఉత్సవములను కన్నుల పండువుగా చేయుటయే గాక విశేషించి తాళ్ళపాకవారు కూడా కొన్ని నూతనోత్సవములను ప్రారంభించిరి.

తిరుపతిలోను, కొండమీదను తాళ్ళపాకవారు నూతనముగ ప్రారంభించిన ఉత్సవములలో ముఖ్యముగ పేర్కొనదగినవి-వైవాహికోత్సవము, ఉట్లఉత్సవము, సనభోజనోత్సవము అనునవి. ఇవిగాక పూర్వమునుండి జరుగుచుండిన బ్రహ్మోత్సవములు, అధ్యయనోత్సవములు, వసంతోత్సవ గ్రీష్మోత్సవములు, డోలామహోత్సవము మొదలగునవి వీరికాలమున తగు శ్రద్ధ వహించిన కారణమున మరింత వైభవముగ జరిగినవి.

## వైవాహికోత్సవము :-

దీనినే పెండ్లి తిరుళ్ అని అందురు. ఇది చైత్రి ఫంగుణి మాసము నందు అయిదు రోజులు జరుగు స్వామివారి వివాహ మహోత్సవము.

తిరుపతి శాసనములనుబట్టి ఈ ఉత్సవమును తాళ్ళపాకవారే ప్రారంభించినట్లు తెలియుచున్నది. క్రీ. శ. 1546లో తిరుమలమీద తాళ్ళపాక తిరువేంగళనాథయ్య శ్రీనివాసునకు (చూ॥ తి. తి. దే. శా. సం. 5 సంఖ్య 71)

తిరుపతిలో చినతిరుమలయ్య క్రీ, శ. 1547లో శ్రీ గోవింద రాజునకు (చూ॥ తి. తి. దే. శా. సం. 5 సంఖ్య 99), మరల క్రీ. శ. 1554, 1558 సంవత్సరములలో తిరువెంగళనాథయ్య తిరుమలమీద ఈ ఉత్సవములను జరిపినట్లుగ శాసనములున్నవి. (చూ॥ తి. తి. దే. శా. సం 5 సంఖ్య 153, 159)

క్రీ శ. 1554లో ఫిబ్రవరి 19వ తేదీన తాళ్ళపాక తిరువేంగళ నాథయ్య వేయించిన శాసనములలో అతడే యీ వైవాహికోత్సవము లను ఆరంభించినట్లు పేర్కొనబడినది (చూ॥ తి తి దే శా సం 5 సం 153) దీనిని బట్టి తాళ్ళపాక తిరువేంగళనాథుడే స్వామివారి వైవాహికోత్సవమును క్రీ శ. 1546నకు పూర్వమెన్నడో ప్రారంభిం చినట్లు తెలియనగును (చూ॥ క్రీ శ. 1536లో వేయబడిన No. 69 of Vol IVను బట్టి స్వామివారి తిరుకల్యాణము ఆదినములలో గూడ జరుగుచుండినట్లు తెల్లమగును బ్రహ్మోత్సవ సమయములలో జరు గుచుండిన ఆతిరుకల్యాణమే క్రమమున తరువాతి కాలమున ప్రత్యేక మగు ఈ ఉత్సవముగ రూపొందియుండవచ్చును.) పిదప చిన తిరుమలా చార్యాదులు ఈ ఉత్సవమును తిరుపతిలో శ్రీ గోవిందరాజస్వామి వారికి జరిపించియుందురు.

వైవాహికోత్సవము క్రమముగ ఐదు రోజులలోను చేయబడు విశేష కార్యక్రమములను, వానికై వలయు సంభారములను సవివర ముగ పైన పేర్కొనబడిన శాసనములు వెల్లడి చేయుచున్నవి.

తొలిరోజు అంకురార్పణమైన పిదప అనుగ్రహమునకై సోమ బ్రహ్మ మూర్తులకు నైవేద్యము లర్పించుట, విన్నపము సేయువారు దేవతల అనుమతి నర్థించుట పాలతో పాదాభిషేక మొనరించుట దంపతులమార్పు (ఎదుర్కోలు) హంసచాతక వాహనములపై ఊరే గింపు, పంచవర్ణ పీఠముపై నుండగ కర్పూర హారతులిచ్చుట పట్టు బట్టలు మధుపర్కము సమర్పించుట హోమము చందనాభిషేకము మున్నగునవి శాస్త్రోక్తముగ జరుగును.

రెండవ దినమున చందన వసంతోత్సవము వసంత తిరుమంజనము, శేషవాహనముపై ఊరేగింపు జరుగును.

మూడవ దినమున యథావిథిని హోమము, ఆస్థానము, రాత్రిపూట వైకుంఠ విమానమున ఊరేగింపు జరుగును

నాల్గవ దినమున, హోమము, సుమంగళులకు చందనతాంబూలాదులు సమర్పించుట, హనుమంతవాహనము జరుగును.

ఐదవదినమున, హంసవాహనము, ఏనుగు వాహనము, మరికొన్ని విధులు జరుగును. ఈ విధముగ వివాహము ఐదు దినములకగు వ్యయమును తాళ్ళపాకవారే భరించిరి.

మేల్ నాయకమువారికి, విన్నపము సేయువారికి, నంబులకు, అనుసంధానము సేయువారికి తిరువేంకటాచలమహాత్మ్య పఠితలకు, పెండ్లి మంటపము నలంకరించువారికి, సుమంగలులకు, కట్నములు మోయువారికి జీతములు, వస్త్రధన రూపములనర్పించు చుండిరి.

పై విధముగ తాళ్ళపాకవారే పెండ్లి పెద్దలై స్వామివారికి ఐదురోజులు పెండ్లి ఘనముగ జరిపించు చుండిరి. ఈ అయిదు దినములందును ఊరేగింపులలో తాళ్ళపాకవారి యిండ్లముందు మనోహర పదులు సమర్పితములగు చుండెడివి

తిరుమల మీదను, తిరుపతిలోను జరుగు ఈ వైవాహికోత్సవములకై తాళ్ళపాకవారు చందలూరు. మల్లవరము, నేడియము మొదలగు గ్రామములను శ్రీ భండారమున కర్పించిరి. (నెడియము గ్రామమును చినతిరుమలయ్య, చెందలూరు, మల్లవరము, దేవరాయపల్లి గ్రామములను తిరువేంగళనాథయ్య శ్రీ భండారమునకు సమర్పించిరి.)

ఒక పర్యాయము కారణాంతరమున మల్లవర గ్రామము నుండి శ్రీ భండారమునకు చెందుచుండిన ఆదాయమును ఆపి, తిరువేంగళనాథయ్య తత్ స్థానమున ఆదాయము అధికముగ వచ్చు దేవరాయపల్లి అను మరియొక గ్రామమును సమర్పించి ఈఉత్సవమును మరింత వైభవముగ జరుగునట్లు నియోగించెను.

వైవాహికోత్సవమును తాళ్ళపాకవారే ప్రారంభించుటలోను శ్రద్ధతో అంతరాయము లేని విధమున సాగించుటలోను ఒక విశేష మున్నది. రేవణూరి వేంకటాచార్యుడు (అన్నమయ్య మనుమడు) రచించిన "శకుంతలాపరిణయ" ప్రబంధమున తాతగారైన అన్నమా చార్యుని మహిమను వర్ణించుచు వారి సంకీర్తనములు విని తనిసిన తిరుపతి వేంకటేశ్వరస్వామి యితరుల సంకీర్తనములను వినజాలమని నట్లును, స్వామివారు అన్నమాచార్యుల వారిని మామగారుగా సంభావించుకొనినట్లును, పెదతిరుమలాచార్యునకు గోచరించి ఆతనికిని ఆతని వంశము వారికిని మూడు పురుషాంతరముల వరకును మోక్షము ననుగ్రహించి నట్లును వివరించియున్నాడు. వీరి విశ్వాసము ననుసరించి శ్రీ వేంకటేశ్వర స్వామి తాళ్ళపాక వారికి అల్లుని వరుసవాడగును ఆ కారణముననే కాబోలు స్వామివారి వివాహమహోత్సవమును తాళ్ళపాకవారు అంత ఘనముగ నిర్వహించినదని చెప్పవచ్చును.

## ఉట్లఉత్సవము (ఉరి-అడి)

వైవాహికోత్సవము తరువాత తాళ్ళపాకవారు విశేషముగ పెంచి ప్రత్యేకముగ నిర్వహించిన ఉత్సవములలో పేర్కొనదగినది "ఉరి-అడి" అనుఉట్లు కొట్టువేడుక క్రీ. శ. 1545 జూలై 8వ తేది పెదతిరుమలాచార్యుడు వేయించిన శాసనమున తాళ్ళపాక తిరువేంగ ళప్పయే తిరుమల మీద ఈ ఉత్సవము నారంభించినట్లుగ పేర్కొన బడినది. (చూ॥ No. 47 of Vol. V). కాని అందే తిరుమలయ్య గారి "ఉరి అడి" అని మరియొక చోటున కలదు. క్రీ. శ. 1547 ఆగష్టు 17వ తెదీన చిన తిరుమలాచార్యుడు వేయించిన శాసనమున చితినరుమలాచార్యుడే ఎగువ దిగువ తిరుపతులలో ఉట్ల ఉత్సవమును ప్రత్యేకముగ ఏర్పరచినట్లు ప్రశంసింపబడినది. (తి. తి. దే. శా. సంఖ్య 99 of Vol. V)

పై వానిని బట్టి పరిశీలింపగ ఉట్ల ఉత్సవము క్రీ. శ. 1545వ.

సంవత్సరమునకు పూర్వమే తాళ్ళపాక చినతిరుమలాచార్యాదులు జరిపించుచుండి యుండవచ్చునని తెలియును.

ఉట్ల ఉత్సవము ముఖ్యముగ శ్రీకృష్ణుని బాల్యక్రీడలకు సంబంధించిన వేడుక తిరుమలమీద తాళ్ళపాకవారి యింటి ముంగటనున్న వేటాడు కృష్ణునకును, తిరుపతిలో గోవింద కృష్ణునకును ఈ ఉత్సవము జరుగుచుండినది. దీనికై పెదతిరుమలాచార్యుడు ప్రత్యేకముగ కొంత ధనమును వెచ్చించి ఉట్ల వేడుకలు నేర్పరచినట్లు తెలియుచున్నది. (ఉరి-అడి, శ్రీ జయంతి ఉత్సవముల ప్రశంస తిరుమల తిరుపతులలో సాళువగుండ నరసింహరాయల కాలమునుండియు కానవచ్చుచున్నది)

శ్రీకృష్ణుడు బాల్యమున దొంగచాటుగ ఉట్లు కొట్టి పాలు, వెన్న మీగడలు భక్షించుచుండిన ఉదంతమును ఈ ఉత్సవము కనులకు కట్టినట్లుంచును. పంచామృతము నింపిన ఘటమును, కొబ్బరికాయలను, అరిటిపండ్లను, మరికొన్ని తినుబండారములను ఉట్లకు గట్టి పొడవైన గడలతో నిర్మించిన మంటపమున గిలకత్రాటికి బంధించి యుందురు దానినికొట్టి గ్రహించుటకై ఒకడు కృష్ణుని అవతారమెత్తును ఆ ఉట్టి వానికందకుండ క్రిందికి మీదికి ఎత్తుచు దించుచు ఊరించుచుందురు. అది కోలాహలముతో నిండినవేడుక. తుదకాతడు ఉట్టిని కొట్టగలిగినపుడు ఆ కోలాహలము మిన్నుముట్టును. మిక్కిలి ప్రాచీనమగు ఈ ఉత్సవము నేటికినీ వేడుక గొల్పునదిగ దేశమున పలుతావుల నున్నది.

తిరుమల తిరుపతులలో ప్రత్యేకోత్సవముగ దీనినేర్పరచినవారు తాళ్ళపాకవారే అనవచ్చును. వెన్న, తేనె, పాలు, పెరుగు, చక్కెర కలిపిన పంచామృతము. కలశము కొబ్బరికాయలు, అరటిపండ్ల గెలలు, చెఱకులు, మరికొన్ని ఫలములు, పొడుగుపాటి ఎదురుగడలు. పూలు -ఈ ఉత్సవమున కవసరమైనవి. వలసినవానిని తాళ్ళపాకవారు శ్రీ భండారము వారిచేత సమకూర్పు జేయుచుండిరి.

ఉట్ల మండపము నలంకరింపజేయువారికి, శిల్పులకు, వేడుక ముగిసిన పిదప పరిసరములను బాగుచేయుపని వారికి. వెదుళ్ళను, ఉట్ల

స్తంభములను చెడిపోకుండ జాగ్రత్త పరచెడి వారికి జీతముల నేర్పరచి తాళ్ళపాకవారు ఈ ఉట్లఉత్సవము జయప్రదముగ జరిపించుచుండిరి. తిరుమలమీద తాళ్ళపాకవారి యింటి ముందు ఈ ఉత్సవము జరుగుచుండెడిది. ఈ ఉత్సవమును స్వామివారి ఉత్సవమూర్తి దర్శించుచుండెడివారట!

## వనభోజనోత్సవము :-

తాళ్ళపాకవారే ఆరంభించిన మరియొక ఉత్సవము వనభోజనోత్సవము. ఇది కార్తిక మాసమున జరుపబడుచుండినది.

తాళ్ళపాకవారి శాసనములలో తొలుత దీని ప్రశంస క్రీ. శ. 1537లో కానవచ్చుచున్నది. (చూ॥ తి. తి. దే. శాసన సం. 4 సం. 100 (1537)

తాళ్ళపాక పెదతిరుమలాచార్యులి సందర్భమున బంధుమిత్రుల తోడను, శ్రీవైష్ణవ సమాజము తోడను వలసవెళ్ళి వనభోజనోత్సవము జరుపుకొనినట్లున్నది. తరువాతి కాలమున వీరిశాసనములందును, వీరి మిత్రబృందమునకు చెందినవారగు నారాయణశెట్టి, శ్రీనివాసయ్యంగారు ప్రభృతుల శాసనములందును విరివిగ ఈ ఉత్సవము ప్రశంస కానవగును (చూ॥ 25 of Vol. V క్రీ. శ. 1544 by నారాయణసెట్టి and No. 157 of Vol IV క్రీ. శ. 1540 by శ్రీనివాసయ్యంగారు)

కార్తికమాసమున శ్రవణా నక్షత్రమున బంధుమిత్రవరముల తో గూడి సమాజమంతయు దాపుననున్న తోపులకు వలసవెళ్ళి సమారాధనముగావించుటే ఈ ఉత్సవ విశేషము. దానిని సామాజకోత్సవముగ పేర్కొనవచ్చును. దైవము పేరిట సమాజమున సామరస్యము పెరుగుటకు ఇట్టి ఉత్సవములు ఎంతేని తోడ్పడును

క్రీ. శ. 1545లో సదాశివరాయల కాలమున పెదతిరుమలాచార్యుడు వేయించిన శాసనమునందు ఈ వనభోజనోత్సవ సందర్భమున జరుపబడు కైంకర్యములను గూర్చియు ప్రసాదభాగముల పంపకమునుగూర్చియు వివరములనేకములున్నవి.

తోపులో ఆస్థానము అయిన తరువాత ఆలయమునకు తిరిగి వచ్చు సమయమున శ్రీ భండారము నిర్వాహమువారైన పంగ్రిం డుగురి పేరిట కట్టిన పండ్రెండు మంటపములందును, మరికొన్ని తావు లందును చేయవలసిన నైవేద్యమును గూర్చియు, తన్నిర్వాహము వారినిగూర్చియు వివరములు గలవు. ఈ ఉత్సవ సందర్భమున పనిపాట లలో సహాయపడువారందరికి విడివిడిగ జీతమేర్పరుప బడినది. ఇకపై శాసనమున ప్రసాదభాగములను గొనినవారి పేరులను బట్టియే నాడు తాళ్ళపాకవారికిగాల స్థాయిని, వారి పరిచయములను మనము గుర్తిం పవచ్చును. వారిలో ప్రసిద్ధులు-నారాయణసెట్టి, కుమార తాతాచా ర్యులు, చక్రవర్తి అప్పయ్యంగారు, కందాడ అప్పయ్యంగారు, ఆనంద పిళ్లయ్యంగారు, తిరుమలయ్యంగారు, దొడ్డయ్యంగార్ అప్పా, శుక వస్తుఅణ్ణన్, అప్పాఅణ్ణన్ అప్పా, అప్పా తిరువేంకటయ్యంగారు, అణ్ణన్‌వాయినార్, వెంకటత్తురైవర్, అప్పాపిచ్చి అణ్ణన్‌అప్పన్, పల్లిభట్టర్ మలయణ్ణన్, తిరువణిపిళ్ళ (నిర్వాహకులు) రామానుజ కూటము నిర్వాహకులు, కొందరు కుమ్మరులు, కంసాలులు, వర్తకులు, వ్యాపారులు, దేశాంతరులు ప్రభృతులు పలువురున్నారు. ఆ దినము లలో ఆలయమే, వికాసమునకు సాంస్కృతికాభివృద్ధికి కేంద్రమై సహన సామరస్యముల కాలవాలమై యుండినది.

పై వివరించిన వైవాహికోత్సవము, ఉట్ల ఉత్సవము, వనభోజ నోత్సవములేగాక పూర్వమునుండి సాగుచున్న ఉత్సవముల విషయ మునగూడ తాళ్ళపాకవారు తగు శ్రద్ధ వహించి, అవి మరింత వైభవ ముగ జరుగునట్లు చేసిరి.

వీరి కాలమున ముఖ్యముగ బ్రహ్మోత్సవములు మహావైభవ ముతో నిర్వహింపబడినవి ఈ బ్రహ్మోత్సవముల సంఖ్య సంవత్సర మునకు పది, పదకొండు వరకును పెరిగినవి. అంతకుముందు 12 రోజులు జరుగుచుండిన బ్రహ్మోత్సవము తాళ్ళపాక వారి కాలమున 13 దినముల పాటు జరిగినది.

ఆణిమాసమున తాళ్ళపాకవారి పేర ఒక ప్రత్యేక బ్రహ్మోత్సవమే ఏర్పాటైనది, (చూ॥ తి. తి. దే. శా. సం. Vol 4 No. 100 క్రీ. శ. 1537, Vol. 4 No. 129 క్రీ. శ. 1539, Vol. 5 No. 74 క్రీ. శ. 1545) దానినిర్వహణమునకు తాళ్ళపాకవారు విపులములగు ఏర్పాట్లు గావించిరి. దానికేగాక అచ్యుతరాయాదుల పేరట జరుగు బ్రహ్మోత్సవములందుసైతము తాళ్ళపాకవారి ఉభయ్యాయులు కొన్ని ఏర్పాటైనవి. ఇట్లే తిరుపతిలోని ఆలయములందు గూడ తాళ్ళపాక వారు కొన్ని విశేషోత్సవములను నేర్పరచిరి.

పై విధముగ తాళ్ళపాకవారు తమసంపద నంతటిని స్వామికే అంకితము చేసికొని తరతరాలు వర్ధిల్లిరి.

## సంకీర్తన భండారము :-

తాళ్ళపాకవారు తిరుపతిక్షేత్రమునకు చెందిన సంకీర్తనాచార్యులు. వీరు ఆంధ్రదేశమున శాస్త్రీయమగు సంకీర్తన సంప్రదాయ పద్ధతులకు మూల పురుషులు, విజయనగరి ప్రభువుల మన్ననలంది సంకీర్తన వాఙ్మయంతో శ్రీస్వామిని అర్చించిన ఆచార్య పురుషులు, వారిలో క్రీ. శ. 1440 నుండి సంకీర్తనరచనకు పూనిన తాళ్ళపాక అన్నమాచార్యుడే ఆదిపురుషుడు.

అన్నమయ్య జన్మించిన పదాఱవఏట స్వామి ప్రత్యక్షమైతేను అది మొదలుగ క్రీ. శ. 1502నకు సరియగు దుందుభి ఫాల్గుణ బహుళ ద్వాదశి వరకును దినమునకొక కీర్తన కేని తక్కువకాకుండ తిరువేంగళ నాథుని (స్వామి) మీదకు అంకితముగ శృంగార వైరాగ్య కీర్తనములను విన్నపము గావించెను. 32 వేలకు పైగా అన్నమయ్య సంకీర్తనములను రచించెను. పిదప అతని పుత్రులును అట్లె బహుళ సంఖ్యలో సంకీర్తన రచన గావించిరి.

తొలుత తాళ్ళపాకవారు తమ రచనలన్నింటిని తాళపత్రములందే లిఖించుకొని యుండినప్పటికిని, చెక్కుచెదరకుండ వానిని శాశ్వతముగ నుంచి కాపాడుటకై తరువాతి కాలమున వానినెల్ల రాగిరేకులపై కెక్కించిరి.

తిరుమలమీద స్వామివారి బంగారు వాకిలికి సమీపమున ఒక సంకీర్తన భండారమును నెలకొల్పి యందు వానిని సురక్షితముగ నుంచిరి. ఇట్లు అసంఖ్యాకముగ నున్న దాని రచనలనెల్ల రాగిరేకులపై కెక్కించుటన్న తేలికపనిగాదు. ఎంతో బలగమును, సొమ్మును, కాలమును వెచ్చించి యుండవలెను. ఆ సంకీర్తన భాండాగార కార్య నిర్వహణమునకు వారొక చక్కని వ్యవస్థను కల్పించి యుండవలెను. మరి ఆ వ్యవస్థ ఎప్పుడేర్పడినదో తెలియదుగాని, దానిని గూర్చిన వివరములు తొలుత మనకు తాళ్ళపాకవారి శాసనములలో క్రీ. శ. 1530 సంవత్సరముననే తెలియుచున్నది. అనగ అంతకు కొంతకాలము పూర్వమే ఆవ్యవస్థ వ్యవహారములోనికి వచ్చి యుండవలెను.

అన్నమాచార్యుని అనంతరము పెదతిరుమలాచార్యుని పర్యవేక్షణమున ప్రాయశః విజయనగర చక్రవర్తియగు అచ్యుతదేవరాయలవారి సహకారమున ఈ సంకీర్తన భండాగార వ్యవస్థ ప్రారంభింపబడి యుండునని తలచుటకు వీలగుచున్నది కృష్ణరాయల నిర్యాణమునకు ఐదారేండ్లకు పూర్వము నుండియే అచ్యుతరాయలు పరిపాలనమున పలుకుబడి కలిగియుండెను. ఆ దినములలో అనగ క్రీ. శ. 1525-1530 సంవత్సరముల నడుమ ఎప్పుడేని ఈ సంకీర్తన భండారము నెలకొల్పబడి యుండవచ్చును.

క్రీ. శ. 1530వ సంవత్సరమున అచ్యుతరాయని బ్రహ్మోత్సవ సందర్భమున సంకీర్తన భండారము ముందు నైవేద్యము సమర్పించినట్లు తాళ్లపాకవారి శాసనమున నున్నది. (చూ॥ No. 6 of Vol. 4 క్రీ. శ. 1530)

క్రీ. శ. 1541లో అచ్యుత దేవరాయలు తమకుయిచ్చిన కుప్పం కీలంగుణ్రమ్ గ్రామములమీది 300 రేఖల మూలధనమును వినియోగించి, శ్రీ భండారమువారిచేత తాళ్లపాకవారు నిర్వహింప జేసిన కైంకర్యములందును, సంకీర్తన భండాగార ప్రశంస యున్నది (చూ॥ No. 15 of Vol. 4 క్రీ. శ 1541). సంకీర్తన భండారము ముందు నిత్యము 4 తిరుపొణకములు చొప్పున సమర్పించుటకును, దీపములు

పెట్టుటకును సంవత్సరము పొడుగున అగు వ్యయమును తాళ్లపాక వారు భరించిరి సంకీర్తన భండార కార్య నిర్వాహకులగు శ్రీవైష్ణవులకు కొందరకు ప్రసాదభాగములు తిరుకైవళక్కం (Cash offerings) చెందునట్లు కూడ ఏర్పాటున్నది. దీనినిబట్టి అప్పటికే పలువురు శ్రీవైష్ణవులతో, పండితులతో కూడిన ఈ వ్యవస్థ యందు పని ముమ్మరముగ సాగుచుండినట్లు తెలియనగును.

పెదతిరుమలాచార్యాదులు తిరువేంగళనాథుని కంకితముగ చెప్పిన సంకీర్తనములు రాయలకభీష్టముగ చెప్పినట్లున్నది. (చూ॥ No. 20 of Vol. 4 క్రీ. శ. 1532). ఈ సంకీర్తన రచనారంభము గ్రీష్మమున జరిగినట్లున్నది అందుకే గ్రీష్మోత్సవ సందర్భములందు తత్స్మృతిగా పెదతిరుమలాచార్యుడు 20 దినములపాటు 12 రేఖల వ్యయముతో నిత్య నైవేద్యము లేర్పరచినాడు (చూ॥ No. 47 of Vol. 5 క్రీ. శ. 1545) ఈ విషయమునే" సంకీర్తన అరుళప్పాడు" అందురు.

క్రీ శ 1558లో తాళ్ళపాక తిరువేంగళనాథయ్య కూడ ఈ సంకీర్తన అరుళప్పాడు" సందర్భమున చందన తాంబూలములు సమర్పించుటకు ఏర్పాటుగావించెను. (చూ॥ No. 159 of Vol. 5 క్రీ. శ. 1558)

సంకీర్తన భండారమునకు సంబంధించిన ప్రవీణులగు యిరువురు సంగీత విద్వాంసులు ఉద్యోగులుగా పనిచేయుచుండిరి. వారు స్వామి సన్నిధికి ప్రతినిత్యము తిరుమంజన వేళయందు సంకీర్తనము లాలాపించుచుండిరి. వారిరువురుకును ప్రసాదభాగములేగాక సంవత్సరమునకు 16 రేఖల 8 పణములు విడిగా జీతము ఏర్పాటు చేయబడినది అట్లె తిరుపతి గోవిందరాజస్వామివారి ఆలయమున కూడ మరి యిరువురు సంగీత విద్వాంసులు అదేకట్టుబడిని కైంకర్యము గావించుచుండిరి.

నాడు జరుగుచుండిన 11 బ్రహ్మోత్సవములందలి తొలి దినములందును, రథోత్సవ సందర్భము లందును, సంకీర్తన గానము ప్రత్యే

కముగ జరిపించుటకును, అపుడు భక్తులకు చందన తాంబూలము సర్పించుటకును తాళ్ళపాకవారు పసతులు గల్పించిరి. (చూ॥No. 153 of Vol. 5. క్రి. శ. 1554) ప్రతి శుక్రవారము పునుగు కాపు సమయమున విడిగా సంకీర్తన సేవ జరిగెడిది. (చూ॥ No. 14 of Vol. 4 క్రి. శ 1632)

పై విధముగ సంకీర్తనములను రచించుటలోను, స్వయముగ గాన మొనరించుటలోను మాత్రమే గాక, మరికొందరు విద్వాంసులను గూడ నియోగించి వానిని ప్రచారములోనికి దెచ్చుటకును తాళ్ళపాకవారు విశేషముగ పరిశ్రమించిరి. ఈ విధముగ తాళ్ళపాకవారు స్వామిని సేవించుచునే, సరస్వతీమూర్తులై సంగీత సాహిత్య రంగములందు నూతన సంప్రదాయములను నెలకొల్పిరి.

## తాళ్లపాకవారి ఇతర కైంకర్యములు :-

సాళువ నరసింగరాయని కాలమున కందాడై రామానుజయ్యంగారు ఆచార్య స్థానమును వహించి శిష్యవర్గమును గూర్చుకొని తిరుపతి క్షేత్రమున విశిష్టమగు సేవగాంచినట్లే, అచ్యుత సదాశివరాయల కాలమున తాళ్ళపాక పెదతిరుమలాచార్యాదులు అపూజ్య స్థానమును వహించి కైంకర్యములు గావించిరి

దొడ్డాచార్యులు, కుమార తాతాచార్యులు, కందాడై అప్పయ్యంగార్, నారాయణసెట్టి మున్నగువారు తాళ్ళపాకవారి మిత్రులు, శ్రీపతి తొండయ్య, పళ్ళి పట్టారయ్య, పొత్తపి వెంగళయ్య ప్రభృతులు తాళ్లపాకవారి శిష్యులు. వీరేగాక పలువురు సాతాని వైష్ణవులును తాళ్లపాకవారికి శిష్యులుగ నుండిరి. తాళ్లపాకవారి మార్గము ననుసరించి వీరందరును యథాశక్తి స్వామిసేవ గాంచిరి.

తాళ్లపాకవారి ఆదేశానుసారము తిరువేంకటత్తురైవర్ స్వామి సన్నిధికిని "వేంకటాచల మహాత్మ్యము"ను పఠించుచుండెను. పొత్తపి వేంగళయ్య "కయ్యర్ చక్ర శ్లోకము" (వేదాంతదేశికులవారి రచన)

లను పఠించెడివాడు మరియొకరు శ్రీ భాష్యమును చదువు చుండిరి. ఇట్లు శిష్య, మిత్రబృంద సహకారమునను, ప్రభువుల ఆదరమునను తిరుపతిలో తాళ్లపాకవారు నిశిష్టమగు రీతిని శ్రీ స్వామిని సేవించి తరించిరి తాళ్లపాకవారు తిరుమల తిరుపతులలో స్థిరనివాస మేర్పరచు కొన్నను తీర్థయాత్రలు గావించి, అనేక పుణ్యక్షేత్రములను దర్శించి ఆయాక్షేత్ర దైవతములపై సంకీర్తనములు చెప్పి కొన్ని దానధర్మ ములు గూడ చేసినట్లు తెలియుచున్నది.

క్రి శ. 1534 (మన్మథ)లో అచ్యుతరాయల అనుమతితో ఉదయగిరిలో రాజప్రతినిధిగ నుండిన రామభట్లయ్యచేత కడపజిల్లా నందలూరులోని ఆలయమునకు అందపూరు గ్రామము చెందునట్లు పెదతిరుమలయ్య కావించెను. (చూ॥ No, 607 of 1907 Vide page 291 of T. T. D. Ept. Report.)

క్రీ. శ 1553లో చిన కాంచీనగరమున అరుళాళ్ పెరుమాళు నకు పెదతిరుమలాచార్యుడును, చినతిరుమలాచార్యుడును కొన్ని ఉత్సవముల నేర్పరచి నైవేద్యములు జరుగునట్లు కావించిరి. (చూ॥ No. 496 of 1919 Vide page No. 291 of T. T. D. Epi. Report.)

క్రీ. శ. 1536లో సాళువ తిమ్మరుసు ఆతని సోదరుడు గోవింద రాజు తాము పూర్వము విజయనగర ప్రధాన మంత్రులుగను దండ నాథులుగను వర్ధిల్లునపుడు కావించిన కైంకర్యముల మూలమున తమకు లభించుచుండిన ప్రసాదభాగములను పెదతిరుమలాచార్యునకు మొత్తము 11,703 పణములు విత్తమునకమ్ముకొనిరి. (No. 72, 74 and 93 of Vol. 4 dated క్రీ. శ. 1536)

పై విధముగ తాళ్లపాకవారు నాటి ప్రజల సంపూర్ణ విశ్వాస మునకు పాత్రులై, శ్రీ వేంకటేశ చరణ సేవామగ్న మానసులై తిరుమల వైకుంఠము నే స్థిరనివాసము గావించుకొని యుండిరని చెప్పవచ్చును.

# తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు

తాళ్ళపాక అన్నమాచార్యునకు అక్కలమ్మకు జన్మించినవాడు పెదతిరుమలాచార్యుడు. ఇతడు వేద వేదాంత విద్యాప్రవీణుడు. వైష్ణవమత ప్రచార దృష్టితో సాహిత్యమును సాధనముగ గొని వివిధ సాహితీ ప్రక్రియలలో వినూత్న యత్నములు గావించినవాడు.

తండ్రిగారివలెనే ఇతడు కూడ మహాభక్తాగ్రేసరుడు. సంగీత సాహిత్యములందు దిట్టతనముగల్గి, వేంకటేశ్వరస్వామి కంకితముగ వేలకొలది సంకీర్తనములు రచించి, పాడి, అన్నమాచార్యులతో పాటు స్వామి సన్నిధినున్న సంకీర్తన భాండాగారము వద్ద తనకు కూడ ప్రతిమమూర్తిని నెలకొల్పవలసిన మహిమను సంపాదించుకొన్న వాడు పెదతిరుమలాచార్యుడు.

పెదతిరుమలాచార్యుడు తిరుమలలో స్వామికి సంకీర్తనల ద్వారాను, అగ్రహారప్రదానములద్వారాను నిత్యకైంకర్యములు చేయుస్తూ స్వామి సన్నిధిని మంచి పలుకుబడి కలిగి ఉన్నవాడు

ఇతడు జ్ఞానము వచ్చిననాటినుండి సగము వయసువరకు తండ్రి చాటునే ఉండి, తండ్రిగారి అనుభవసారమంతయు ఆకళించుకొన్న పెదతిరుమలయ్యకు వేంకటేశ్వర భక్తి, సాహిత్య సంగీతములద్వారా స్వామి సేవతప్ప వేరు కోరిక లేవిలేని సంతృప్తితో సకల మానవులకు జీవితానుభవసారమును ప్రబోధింపగల ఆత్మవిశ్వాసముతో ఆయన సంకీర్తనములు కనిపించును.

సింహగిరి వచనములను పేరుతో తాళగంధి వచనగీతములను రచించిన కృష్ణమాచార్యులు, అన్నమాచార్యులు, పెదతిరుమలాచార్యులు తమ సంకీర్తనములద్వారా ఆంధ్ర వేదాంతకర్తలనీ, పంచమాగమ సార్వభౌములనీ అనిపించుకొన్నారు.

పెదతిరుమలాచార్యును శ్రీమద్వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్య, శ్రీ రామానుజ సిద్ధాంత స్థాపనాచార్య, వేదాంతాచార్య, కవి

తార్కిక కేసరి, శరణాగత వజ్రపంజర అను బిరుదములుగలవు. ఇతనికి వేంకటేశ్వరస్వామి మూడు పురుషాంతరముల వరకు ప్రత్యక్షమును, ఏడు పురుషాంతరముల వరకు మోక్షమును ఇచ్చెదనని వరమిచ్చెనట. పెదతిరుమలాచార్యునకు ఉపదేశగురువైన కందాడ అప్పలాచార్యులే తెనాలి రామకృష్ణకవికిగూడ వైష్ణవమిచ్చిన గురువు.

పెదతిరుమలయ్య జన్మించిననాటికి సాళ్వ నరసింహరాయలు పెనుగొండలో సామంతప్రభువుగనుండి, అన్నమాచార్యులయెడ గురుభావము గల్గియున్నాడు. ఆతరువాత 1487 నాటికి విజయనగర సింహాసనమాక్రమించి, సాళ్వనరసింహరాయలై 1495 వరకు పాలించాడు. అటుపై తుళువ వంశమువాడైన ఈశ్వరనరసనాయకుడు సింహాసనమాక్రమించి కన్నడ రాజ్య రమారమణుడు అగుటయు, నరసనాయకుని వెనుక కొంతకాలము అతని పెద్దకుమారుడు వీరనరసింహరాయలు ఏలుబడి గావించుటయు, పిమ్మట 1509 నాటికి కృష్ణదేవరాయలు గద్దె ఎక్కుటయు అనునవి పెదతిరుమలాచార్యుని ఎఱుకలో వరుసగ జరిగిన చారిత్రక సంఘటనలు. కృష్ణరాయలు సింహాసనమెక్కునాటికి అన్నమాచార్యుడులేడు. పెదతిరుమలాచార్యుడు తిరుమలలో స్వామికి సంకీర్తనల ద్వారాను, అగ్రహార పరిదానములద్వారాను నిత్యకైంకర్యములు చేయించుచు స్వామి సన్నిధిని మంచి పలుకుబడి కలిగి ఉన్నాడు. నిత్యమును స్వామి సాక్షాత్కారమును పొందుచుండుటయే గాక, ఇతని చరిత్రలో గూడ కొన్ని మహిమాన్వితములైన సంఘటనలున్నట్లు ఐతిహ్యాము.

,తాళ్లపాక చిన్నన్న అన్నమాచార్య చరిత్రలో,

“ మన్నెము కోటలో మండలంబెరుగ
మండలాగ్రాహతి మహనీయ పుష్ప
దామమై ధర్మాంగద స్థితిపొలిచె
ఏ మహాముని అహీనగాత్రమున. . .” —అని తన తండ్రియైన పెదతిరుమలయ్య మంటెముకోటకు వెళ్ళినపుడు అక్కడి మండలాధిపతి

నరసనాయకుడనువాడు ఆచార్యునిపైకి కత్తి విసరగ అది పుష్పమాల అయినదట. ఆ నరసనాయకుడు తుళువ వంశపువాడైన కృష్ణరాయని తండ్రి ఈశ్వరనరసనాయకుడే అయివుండాలని, అందువలన తాళ్లపాక వంశమువారికి, రాయల వంశమువారికి మధ్య ఈర్ష్యాస్పర్థలుండెడివని అనేక భాషాకవిపండితులకు అగ్రహారాదికము దానములు చేసిన కృష్ణరాయలు తాళ్లపాకవారికేమియును ఒసంగకుండుటయు, వారి పైతృక గ్రామమైన తాళ్ళపాక తమగురువులైన వ్యాసతీర్థులకు దానము చేయుటయు అందులకు తార్కాణములని వేటూరి ప్రభాకర శాస్త్రిగారు ఊహించిరి. తన మెడపైన కత్తి పూలమాలైన కథను సూచించుచూ పెదతిరుమలయ్య తానే వ్రాసికొనిన సంకీర్తన గూడ గలదు.

**శంకరాభరణము :-**

"నాటికి నాడు క్రొత్త నేటికి నేడు క్రొత్త
నాటకపు దైవమవు నమో నమో......
సిరుల రుక్మాంగదు చేతికత్తి ధారతొల్లి
వరుస రుక్మాంగదుపై వనమాలాయ
హరినీకృపకలిమి నట్లనే యరులచే
కరఖడ్గధార నాకు కలువదండాయ...'

పై కీర్తన ప్రబల సాక్ష్యముగ కత్తి కలువదండైన కథ చారిత్రికమై తీరవలసినదే. కాని, ఆకత్తిని తిరుమలయ్యపై విసరిన నరస నాయకుడు కృష్ణరాయలు తండ్రియైన ఈశ్వరనరసనాయకుడే అనుటకు గాని, అందువలన రాయలవంశమునకు తాళ్ళపాకవారియెడల ఆదరము లేకపోయినదనుటకుగాని, విశ్వాసనీయమైన ఆధారములు లేవనియు, ఆనరసనాయకుడెవడో సామంత ప్రభువే అయివుండునని ఆంధ్రకవి తరంగణికారుడైన శ్రీ చాగంటి శేషయ్యగారు అభిప్రాయపడినారు.

రాయలమంత్రియైన తిమ్మరుసును, అతని తమ్ముడైన గోవింద రాజును పెదతిరుమలాచార్యుడు స్వామికి చేసిన కైంకర్యములకు

నిర్వాహకులుగ ఏర్పాటుచేసినట్లు తిరుమలదేవస్థానపు శాసనములలో కనబడుచున్నది. అంతేగాక, కృష్ణరాయల తమ్ముడైన అచ్యుతరాయలు పూండి, సంగమకోట గ్రామములను శాసనపూర్వకముగ పెదతిరుమలాచార్యునకు దానముచేసినట్లును, పెదతిరుమలయ్య వానిని తిరిగి స్వామికే సమర్పించినట్లును కూడ ఆశాసనములోనున్నది. అందువలన వారికి వీరికి వంశవైరముండినదనువాదము నిలువదు. నరకృతివిముఖులును, వేంకటేశ్వర పాద పద్మారాధకులునైన తాళ్ళపాకవారును, కృష్ణదేవరాయలును పరస్పరము ఉదాసీనులై ఉండవచ్చును.

పెదతిరుమలయ్య అచ్యుతదేవరాయలతో స్నేహము కలిగియుండెను. రాయల జన్మనక్షత్రమురోజున తిరుమలయ్య తన ద్రవ్యముతో స్వామికి కైంకర్యము చేయించినారు. విజయనగరములో విఠలేశ్వరస్వామి కైంకర్యములకై పెదతిరుమలయ్య భూమిని దానము చేశాడు. పెదతిరుమలాచార్యుడు శ్రీ స్వామివారికి అనేక కైంకర్యములనొసగి ధన్యజీవియయ్యెను.

స్వామిపుష్కరిణి జీర్ణోద్ధారము, మెట్లు, మండపము, నీరాడు మండపము, కొండమీద తాళ్ళపాకవారి యింటిముందు మండపము, సంకీర్తనభండారము, అక్కడ దీపారాధనములు, అక్కడ సంకీర్తనము పాడు వైష్ణవులకు జీతములు గుడి అరణపుగ్రామములలో చెరువులు, ఆళ్వారు తీర్థముదగ్గర శ్రీ లక్ష్మీనారాయణ స్వామిప్రతిష్ఠ, ఎగువ దిగువ తిరుపతులలోను, ఇంకను ఇతర స్థలములలో వెలసిన దేవుళ్లకు భక్ష్యభోజ్యాది నైవేద్యము, అనేక ఉత్సవములను నిర్వహించుట, మొదలైన కైంకర్యములను పెదతిరుమలయ్య నిర్వహించెను.

# పెదతిరుమలాచార్యుని సంకీర్తనములు

తాళ్లపాక పెదతిరుమలాచార్యుని ఆధ్యాత్మ, శృంగార సంకీర్తనములలోని కొన్నిటిని మాత్రమే ఇచ్చట ఉదహరించడమైనది.

**లలిత :**

"ఇచ్చితివి తొల్లె నాకు యియ్యంగల వన్నియును
మచ్చిక నీ శరణన్న మాత్రమే చాలు
సామీప్యము నడుగ సారూప్యము నడుగ
కామించి సాయుజ్య సాలోక్యములడుగ
భూమింగాని పాతాళంబునగాని దివింగాని
సమాన నీ దాసులలో సహవాసమియ్యవే"

**పాడి :**

నా గుణాలు తలంచక నీ గుణాలె తలంచుకో
ఏగతిని మానరాదు యింక నైకను
తెచ్చినాడు గురుడు నిన్ను తిరువారాధనసేయ
ఇచ్చినాడు తలంచుకో యింకనై నను
అచ్చుమోపి దాసునిగా అంగవించిరి నీదాసు
లచ్చ నన్నుం జేపట్టు మిందులకునై నను

పై కీర్తనలో తమ గురుడైన అన్నమాచార్యుని మహిమ వలన వేంకటేశ్వరుడు వచ్చి తమయింటిలో వెలసినాడనీ, గురువులు తనకు శంఖచక్రములచ్చువేసి, స్వామికి దాసునిగ చేసినారు. కనుక తనను చేపట్టుమని స్వామిని వేడుకొనెను.

తిరుమలయ్య మిగిలిన కీర్తనలలోని, వచనమాలికా గీతములలోగాని ఇతని ధోరణి, ఇంటిలో వెలసిన రక్షకుడు, ప్రేమాఘువు అయిన తండ్రితో గారాబు కొడుకు గోముగా ఆడుకొను చనువు మాటలతో సాగును.

పెదతిరుమలయ్య రామాయణ, భారత, భాగవతములలోనివి, ఇతర పురాణములలోనివి, విష్ణుని అవతార లీలలను గాథలుగ స్ఫురింప

జేయుకీర్తనలెన్నియో రచించినాడు. వేదములనుండి, ఉపనిషత్తులనుండి కూడ చాల విషయములు తన కీర్తనలలో సంగ్రహించుటచే ఈయన తన తండ్రివలెనే ఆంధ్రవేదాంతకర్తయని, ఆంధ్రాగమ సార్వభౌము డనికూడ అనిపించుకొనెను.

**ధన్యాసి :**

హరి నీ దాస్యమునకు నవియేమి సరిగావు
అరయ శుకుండు నిన్ను నంటి నీయంతాయెను...
వగలందపముసేసి, వసిష్ఠునవ్యోదనంబె
వాగి వసిష్ఠుండు మింట నొక్కచుక్క
ఎగువ యజ్ఞాలు చేసి యింద్రుండ నవ్యోదనంబె
దిగువనాయిందు రిండొక దిక్పాలుడే...
అదిగాన యే యుపాయములు నే నొల్లక
కదిసి నీ శరణనే గతినంటిని
యెదుట శ్రీవేంకటేశ యిట్టె నా దెసజూచి
సదముండన్నై మమ్ము చక్కంగ నేలితివి..."

శ్రీహరి శరణమనే అవస్థాన భేదముతో పుణ్యపాపముల, మంచిచెడ్డల, కొలదిగొప్పల విలువలేలాగుమారునో క్రింది సంకీర్తనలో పెదతిరుమలయ్య వివరించాడు.

**గౌళ :**

"అప్పుడే కృతార్థుండు అప్పుడే లోకపూజ్యుండు
తప్పులేదు ముప్పులేదు దైవమే గురుతు
ఎవ్వడు పుణ్యుండుకాడు ఎవ్వడు పాతకికాడు
ఇవ్వలతొంటి జన్మములెంచి చూచితే
నెవ్వగని జీవునికి నేరుపేది నేరమేది
అవ్వల శ్రీహరి శరణమన్నదే గురుతు
పుట్టని కులములే విభజించని వస్తువేది
ఇట్టి ఈ జీవులనెల్ల యెంచి చూచితే

గుట్టు తెలిసితిమిందు కొంచెమేది వొద్దమేది
అట్టునిట్టు హరిదాసుడైనదే గురుతు ..."

అన్నదమ్ముల, తల్లికొడుకుల మమత లెటువంటివో చెప్పుచు అన్నిటికంటె శాశ్వతమైనది శ్రీవేంకటేశ్వరునియెడ మమతారహితమైన భక్తియే అని క్రింది కీర్తనలో పెదతిరుమలయ్య ప్రకటించెను.

**దేశాక్షి :**

ఇద్దరి దేహ సంబంధ మిదిగోమాయ
గద్దించి యేడనుండునో కడసారితాను...
తోడబుట్టిన మమత తొడగి కొన్నాళ్ళకు
వాడిక పుత్రుల మీదనటె నుండదు
వేడుక వారెవ్వరో వీరెవ్వరోకాని
కూడువెట్టి వీరికి కొట్లాడే వారికే...
తల్లిమీదగల భక్తి తనకే కొన్నాళ్ళకు
ఇల్లాలిమీదవలె యింత వుండదు...

భక్తిలో హాస్యరసమును చొప్పించు సంకీర్తనములు కూడ పెదతిరుమలయ్య రచించినాడు. రామునితో పోరి ఓడిపోయిన రావణసైనికుల తత్తరపాటు వర్ణించాడు.

**పాడి ;** "అనుచు రావణ సేనలటు భ్రమయుచు వీగ
ఇనకుల చంద్ర నేడిదిగో నీ మహిమ ...
దదదద దదదద దశరథ తనయా
కదిశితి కకకక కావవలె
అదెవచ్చె బాణాలు హానాథ హానాథ
పదపద పదపద పారరోపవుంజులు
తెతెతెత్తె తెతెతెత్తె తెరువేది లంకకు
తతతత్త తలమని దాగుదురు
గతియైన శ్రీ వేంకటగిరి రఘునాథ
సతమై మమ్మింక నేలు జయ జయ నీకు..."

సుద్దులు అనబడు దేశీయములైన పాటల ఫణితిలో సాగిన కీర్తనలకు మచ్చునకు రెండు.

**ఆ హి రి :**

"మాయింటికి రావోయి మాధవా
మాయలెల్ల గంటిమిదె మాధవా
మచ్చుచల్లేవు వలపు మాధవా
మచ్చికలెల్ల జేసితి మాధవా
మచ్చెము నీపైనిదె మాధవా యింక
మచ్చరపు చూపులేల మాధవా ..."

లలిత : ఆసలు చెరచకు మా అచ్యుతా
ఆ సుద్దులె యీ సుద్దులు అచ్యుతా
అలవాటు తొల్లనీకు అచ్యుతా
అలుగము ఇంక నీతో అచ్యుతా
అలయకు మింక నీవు అచ్యుతా నిన్ను
అలమి పట్టింగాని అచ్యుతా..."

దేశాళం : "కొల్ల వలపులు చల్లే గోవిందరాజనిన్ను
గొల్లెతలు నవ్వేరు గోవిందరాజ

శ్రీరాగం : "వట్టి వలపు చల్లకు విష్ణు మూరితి నాతో
వెట్టిదీర మాటాడు విష్ణుమూరితి..."

**వేదాంత తత్త్వ బోధకములైన కీర్తనలు :**

శ్రీరాగం : తలమేల కులమేల తపమే కారణము -
ఎలమిహరిదాసులు ఏజాతియైననేమి "

దేవగాంధారి: "ఎంతకాలంబైన తప్పదు ఎవ్వరికి నేమనగవచ్చును -
వొంతికపలవలబోని కొలుదులు తొలుతపుణ్యములు"

అన్నమాచార్యులు పరమ పదించిన ఫాల్గుణబహుళ ద్వాదశి నాడు పెదతిరుమలయ్యగారు ఆబ్దిక శ్రాద్ధమున రచించిన ఆహ్వాన సంకీర్తనము.

శ్రీరాగము : ''దినము ద్వాదశి నేడు తీర్థ దివసము నీకు
జనకుండ అన్నమాచార్య విచ్చేయవే
వైకుంఠాననుండి యాళువారల లోపల నుండి
లోకపు నిత్యముక్తులలోనుండి
శ్రీకాంతతోడనున్న శ్రీవేంకటేశు గూడి
ఈకడ నారగించ నింటికి విచ్చేయవే ''

పై విధముగ తాళ్ళపాక పెదతిరుమలాచార్యుని సంకీర్తనములను కొన్నింటిని వివరించడమైనది.

లభ్యములై, ప్రకటితములైన తాళ్ళపాక పెదతిరుమలాచార్యుని కృతులను గూర్చి క్రింది విధముగా సమీక్షించడమైనది.

# వేంకటేశ్వర వచనములు

స్తుతి ప్రధానములగు దండకములు, స్తోత్రములు, ఉదాహరణములు, సంకీర్తనములు మున్నగు ప్రక్రియలు, ప్రముఖముగ వస్తుప్రధానములగు కావ్యనాటకాదులవలె గాక ఆత్మీకములై కవియొక్క రసానుభూతికి అలంకారమువలె భాసిల్లుచుండును. అందు కవీశ్వరుని చిత్తవృత్తి చాటుమాటులేక బహిర్గతమగుచుండును ఈ కావ్య ప్రక్రియలన్నియు సర్వేశ్వరుని గూర్చిన అలౌకిక సామాన్యమగు అనుభూతి పరిపాకమును భక్త్యావేశమున ప్రకటించునవిగ నుండును. కనుకనే అవి చిరస్థాయిరచనలై సహృదయ హృదయములకు అత్యంత సన్నిహితములు కాగల్గుచున్నవి. ఆశాఖకు చెందినవే వచనములు, విన్నపములు మొదలగునవి.

'వేంకటేశ్వర వచనములు'- తాళ్లపాక పెదతిరుమలాచార్యునిచే రచింపబడినవి. వీనిని కవి వేంకటేశ్వరునకు అంకితము గావించినాడు. 1925 క్రోధన వైశాఖము భారతిలో (శ్రీ) వేటూరి ప్రభాకర శాస్త్రిగారు ఈ వచనములను కొన్నిటిని ప్రకటించిరి. పిదప తిరుమల

తిరుపతి దేవస్థానమువారు 1935లో "వైరాగ్య వచనమాలికాగీతము" లను పేర 47 వచనములను ప్రకటించిరి. ప్రభాకరశాస్త్రిగారు 1945లో దేవస్థానము పక్షముననే మొత్తము 166 వచనములను పరిష్కరించిరి.

పెదతిరుమలాచార్యుని వేంకటేశ్వరవచనములు అతని హృదయ నివేదనములనదగిన విన్నపముల సముచ్చయమనవచ్చును. ఇవన్నియు విడివిడి గద్యములు. ఇందు కథానవస్తువు లేదు. అప్పుడప్పుడు తనకు తోచిన తత్త్వవిషయములను భగవంతుని స్తుతిపరములు గావించుచు, కులదైవము దగ్గర కూర్చుండి భక్తితో హృదయమును స్వామిపాదములకడ అర్పించుకొను విషయము ఈ వచనములలో మనకు గోచరించును.

"నీవు చక్కని మూర్తివి గావున నీ విగ్రహంబు నా యింటి లోపల నిడుకొని నా వేడుకలకు దేవరంగా గొల్చితిని"- అని పెదతిరుమలయ్య చెప్పుకొనినాడు

"నేను దుర్జనుండనని యెవ్వరు మరుగుపడ విన్నపంబు సేయుదురో? యిప్పుడే నానేరములు నేనే చెప్పుకొనియెద"- అని శీలమును శిక్షించి చక్కజేసికొనదలచినవిధము ఇందు గలదు.

దీనియందు కులదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామియందు కవికి గల అపారమైన భక్తి అడుగడుగున కానవచ్చును. "నీవొక్క భక్తి చేతనే సాధ్యుండవు"- అని ఆళ్వారులవలె స్వామిని కీర్తించి ఆమార్గమునే అనుసరించినాడు.

"నీదాసుల సంగతి నియోగము నలవడె. ఇంక నిన్నడిగెడిదేమి? అన్నిట కృతార్థుండనైతిని శ్రీ వేంకటేశ్వరా"- అని అతడొకసారి తృప్తిపడును.

"పద్మనాభా! నీకు మొక్కనెత్తిన కేలి నమస్కారంబు ముంజేతి కంకణంబు. నీలాంఛనంబులైన తిరుమణి పదంబుల జోడు మంగళసూత్రంబు. ఇతరంబుమాని నిన్నేగొల్చుట పాతివ్రత్యధర్మంబు. నీ దాసులసంగతి మెలంగుట కులాచార నియమము. నీ దాస్యమే మానంబు. నీ మూర్తిని సేవించుటే సదానుభవంబు"- అని భక్తితో వేదాంతివలె ఒకసారి విశ్వాసానుభూతిని పొందును.

"పతివ్రతా భావంబున దాస్యంబునకు కంకణము గట్టుకొంటిని. ఇదే నా విన్నపము"- అని స్వామిముందు ప్రమాణము చేయును.

"ప్రత్యక్షంబైన మిమ్ము గొల్చిన పరోక్షంబు మీరే యిచ్చెదరుగాక వేగరింప నేటికి? నీ దాస్యమే నేగోరంగలవాడ" - అని దాస్యమే తనకబ్బిన ముక్తిగా ఉబ్బిపోవును. ఇదియే విశిష్టాద్వైతులు పొందెడి శాశ్వతమైన సత్యానుభూతి.

స్వామికే గాక అతని దాసుల దాసులకు గూడ సేవచేయుటకు పెదతిరుమలయ్య సంసిద్ధుడై "నీకంటె నీదాసులధికులౌట తేటబడె"-నని అనుకొనెను.

"మిమ్ము నాకుంజూపి చెప్పిన యాచార్యుల శ్రీపాదతీర్థ విశేషంబులకుం జేయొగ్గెద. మీదాసుల పాదరక్షలు మోసెద. మీ దాసాను దాసుల సేవకుండ నయ్యెద. మీ దాసీజనంబులకు నీళ్లు మోసెద. నీ లెంకలకు లెంకతనంబునకు జొచ్చి యచ్చువేసి కొనియెద"-నని కవి వాపోయెను.

"నీకు శరణుజొచ్చి, నామంబులు పఠించిన నీవే దయదలచెదవుగాక"-అని స్వామినే నమ్ముకొని భారమంతయు స్వామిమీదనే నైచి, "మీయంత మీరెప్పుడు నన్ను మన్నించి విచ్చేయుదురోయని మీ పాదపద్మంబుల చప్పుడు నాలకింపుదును. మీకై నేనవేళనైననను హృదయంపు వాకిళ్లు గాచుచుండెద"నని స్వామికృప నర్థించును.

తన బాధ్యత పూర్తిగ స్వామికర్పించి, "ఈరీతినే నీ కల్పితంబులైన దేహంబులు మోయుచున్నవారము. మా నేర్పు నేరములు, మా స్వభావములు, మా సంసారకృత్యంబులు నీ కల్పితమైన నీ ప్రభావంబులే. మమ్ము "దప్పు లెంచపనిలేదు"- అని స్వామితో పలుకును.

స్వామికి తనకు, స్వామి భృత్య న్యాయము తప్పదనెను. తానొక మదించిన యేనుగని, దాని మదమణచి దిద్ది చక్కజేసుకొని, "అష్టాక్షరంబనియెడి ఘంట కట్టించి, రామానుజ సిద్ధాంతం బనియెడి మురజ కట్టించి, కృష్ణరాహుత్తుండనెడి మావంతు నెక్కించి భాగవత సజ్జరంబునంగట్టి పాలించుకొమ్మని" కవి వేడుకొనెను.

కృతిని వేంకటేశ్వరునకర్పించి, "ఇంక నాకర్మబంధంబులూడె గదె, నీవిట్లు పాణిగ్రహణంబు సేసికొంటివిక నీ దేవులు నీవును చిరంజీవులై యుండి సంగీతసాహిత్య నానాలంకారాది పుత్ర పౌత్రాభివృద్ధి వెలయించుచు నీ దాసుల రక్షింపవే శ్రీ వేంకటేశ్వరా" - అని నిశ్చింతుడయ్యెను.

శ్రీ ప్రభాకరశాస్త్రిగారు, "ఇందు విశిష్టాద్వైత సిద్ధాంత విషయములు సర్వత్రకరుడుగట్టి యున్నవి"- అని ఈగ్రంధపీఠికలో వ్రాసిరి. అందులకు ఉదాహరణములుగ కొన్నింటిని క్రింద చూపడమైనది.

"ఆదిమూర్తీ! నేను భూలోకంబున నాకర్మంబులనుభవింపం బుట్టితిని. గాని నిన్ను గురుతెరిగి కొలిచెదనని పుట్టినవాడనుగాను. ఇంతలో నిర్హేతుక లీలం గరుణించి, నన్ను బంటుగానేలితివి"(46వ).

"...శేషత్వ పారతంత్ర్యముల మఱుగుననిల్చి మిమ్ము సేవించు మీదాసాన దాసుండనని యెఱుంగునూ శ్రీ వేంకటేశ్వరా"(53వ).

"భక్తసులభుండవని చదువులలో నిన్ను, జెప్పంగా చెవులు చలంగా వినుట యొకటి, కన్నుల పండువుగా నీమూర్తులు దర్శించుట యొకటి, నీరూపులు మనంబున దలపోయుటొకటి, కరంబులనీకు మొ్రక్కుటొకటి, నీ నామంటులు జరిపించుటొకటి - ఇంతియకాని వేరొక్క యుపాయంబు మఱిలేదు" (117 వ).

"...తిలలోని తైలంబు విధంబున, కాష్ఠంబులోని యనలంబు చందంబున, బుష్పంబులోని పరిమళంబు పోలిక, బీజంబులలోని వృక్షంబుల కైవడి, నీరీతి జగంబులలోన నీవును, నీలోన జగంబులును బాహ్యాంతరంబుల నీవు పరిపూర్ణుండవై యున్నావు" (138 వ).

"బాల్య కౌమార యౌవనగతులం బెరుగుచున్నవాడను"-అని, చెప్పుటవలన పెదతిరుమలయ్య ఈకృతిని నడివయసున రచించెనని చెప్పవచ్చును.

పెదతిరుమలయ్య వైరాగ్య వచనమాలికాగీతములు తాళగంధులై వచనగేయములుగ రచింపబడినవి. వీటికి రాగములను, తాళములనుగూడ సూచించారు.

రామక్రియ - రూపకము :-

"క్షీరాబ్ధి శయనా కమలంబు సూర్యుని కెదురుచూచినయట్లు నాహృదయ పద్మంబు రవిమండల వర్తినైన నీకెదురు చూచుచున్నది. కుముదంబులు చంద్రోదయంబ పేక్షించినట్లు నాకన్నుంగవలు, భవద్దివ్య ముఖచంద్ర దర్శనంబ పేక్షించుచున్నవి. మయూరంబులు మేఘాగమ నంబునకుం జెలంగినట్లు నా మనో మయూరంబు, నీలమేఘ వర్ణంబైన నీ తిరుమేను దలంచి యానందించుచున్నది" ఇవన్నియు భక్తిపూర్వక వచనములే.

# శృంగార దండకము

దండకములు ప్రముఖముగ ఏకగణమాత్ర ప్రస్తారకములు. బహుళముగ భక్తి మయములు. క్వాచిత్కముగ శృంగారమయ ములు. దండకములు ఆత్మాశ్రయ కవితారీతికి చెందిన ఉదాహరణ శతకాది సరస కావ్యరచనా వైలక్షణ్యము గలవి. దండకములు ప్రధానముగ స్తుతిమాత్ర సుందరములు.

దండకములు, అంత్యలఘువగు తగణముతోనే అధికముగ ప్రయోగింపబడియున్నవి.

దండకలక్షణములను తెలుగు లాక్షణికులట్లు నిర్వచించిరి. "అనియత పాదంబు-దండకంబు" "కృతినాది నసహంబులొండెం దకారంబులొండెం బ్రకల్పించి యామీద నల్లం దకార ప్రధానంబు గుర్వంతిమై క్రాలనిచ్చాను రూపావధిం బేర్మినింపగా"బడునని కావ్యా లంకార చూడామణి కారుడు (పుట 8 112) వివరించినాడు. అప్ప కవియు నిట్లే నిర్వచించి చండవృష్ట్యాది దండకభేదముల నెన్నిటినో పేర్కొనినాడు. ఈ లక్షణముల కనుగుణముగనే నన్నయాది తెలుగు కవులు తమ కావ్యములందు ఈ దండకములను రచించిరి. పోతన భోగినీ దండకమును వెలయించెను. తాళ్ళపాకవారు ఒక ప్రత్యేక ప్రక్రియగ దండకమును ఆదరించిరి. పెదతిరుమలాచార్యుడు శృంగార దండకమును రచించెను.

పెదతిరుమలాచార్యుని శృంగారదండకము ఆ కావ్య ప్రక్రియా మార్గమున పూచిన పూవులలో కెల్ల మేలుబంతి యనదగినది

'శృంగారదండకము'ను తి. తి. దే. వారు 1935లో ముద్రించిరి. ఇది ఒక స్వతంత్రమగు లఘుకృతి. దివ్యశృంగారమయమగు శ్రీపద్మావతీ శ్రీనివాసుల పరిణయ గాథను రసవంతముగ చిత్రించిన దండకమగుటచేత దీనికి శృంగార-దండకమని పేరుకల్గినది. ఇది శ్రీ వేంకటేశ్వరునకంకితము. శృంగారదండకము 'తగణ'ముతోనున్నది. గుర్వంతమై లాక్షణికమై యున్నది.

అంకిత పద్యము క్రిందివిధముగ నున్నది :-

> "సన్నుతి తాళ్లపాక పురశాసనుడన్నయ తిమ్మనార్యుడ
> త్యున్నతిఁ జెప్పెదండకము దుగ్ధ పయోనిధి కన్యకారతి
> స్ఫిన్నమృగీ మదాంకునకు వేంకటభర్తకు నవ్యభోగసం
> పన్ను నకారవిందు కులపర్వత తారకమై చెలంగగాన్"
>
> (పుట 93).

దండకము అంకితాంక పద్యముతో ముగియు పద్ధతి తాళ్ళపాక కవులకు పూర్వులు పాటించలేదు. లాక్షణికులు నిర్వచించలేదు. తాళ్ళపాక కవులే ఈవిధముగ వెలయించిరి. ఈ పద్ధతిని తరువాతి కవులు అనుకరించిరి. అది అనివార్య లక్షణమై పోయినది.

శృంగారదండకము శ్రీకారముతో ప్రారంభింపబడి, తగణముతోనుండి, గుర్వంతమై వృత్త్యను ప్రాసాదులతో, ముక్తపదగ్రస్తాద్యలంకారములతో హృద్యమైయున్నది.

"శ్రీవేంకటక్ష్మా ధరోత్తుంగ శృంగాగ్ర నిత్యస్థిరాగారుత్మతో దీర్ణ సౌవర్ణ భూషా విశేషోజ్జ్వలాకారుఁగారుణ్య తారుణ్య లావణ్య సారప్రభాసద్మ పద్మాధరాధీర లీలాకరోదార సంసారు సారూప్య..."

ఇతివృత్తము :-

దివ్యమంగళ విగ్రహుడగు శ్రీ వేంకటాచలాధీశుని గుణగణములను నానాంగనాశ్రేణి కీర్తింపగా నొక్కబింబోష్ఠి ఆలించి

మోహంబు గీలించుటయు, మరపించుటకై చెలులామెను జలక్రీడకు గొంపోవుటయు, వారట్లు మండలాకారంబు మైయుండి క్రీడింపగా గాంచి యప్పంకజా వాసముంగాంచి యున్నట్టి కాంతల్ హరిం జేరి యాతనికి దగిన వధూరత్నమా మె యేనని విన్నవించుటయు, నాస్వామి భవ్య సౌధాగ్రంబుపై నెక్కి యాకామిని న్వేమయున్ జూచి కామించుటయు, ఇరువురకు చక్షుః ప్రీతియగుటయు, శ్రీ వేంక టేశుండతండని మనమున నెరిగి యా నాయిక గాలి నాడించు కేలీపటంబందు నందంబుగా విన్నపంబుల్ దగం గస్తురిన్ వ్రాసి సూత్రంబునంగట్టి యాచక్రి సౌధంబు చాయన్ ముదంబార నాడించుటయు, దానినిబట్టి నాతడు నట్లే గాలిపటమున సమాధానమును పంపుటయు, నాయిక విరహావస్థ లనుభవింపగా, శైత్యోపచారములతో కుదుటపడక చేయునదిలేక చెలులే నెడలి శ్రీ వేంకటేశున కావృత్తాంతంబు విన్నవించి విన్కలిం గన్కలిం జిక్కి నేగుచున్న యామెను రక్షింప వేడుటయు, స్వామి యనుగ్రహించి శృంగారపుం దోటకు వచ్చి యానాయికను శృంగార రసాబ్ధి నోలలాడించి ఇందిరామందిరంబైన యాత్మీయ గేహంబునకుం గొంపోవుటయు, ఆదిగాగల విషయము శృంగారదండకమందలి ఇతివృత్తము.

శృంగారదండకమందలి ఇతివృత్తము, తాళ్ళపాక అన్నమయ్య 'శృంగారమంజరి', పెదతిరుమలయ్య 'చక్రవాళమంజరి'ల యందలి ఇతివృత్తమును పోలియున్నది. కాని ఇందు జలకేళి, గాలిపటముల మూలమున రాయబారములు సాగుట - అనునవి క్రొత్తగ కల్పితములు.

శృంగారదండకమందలి కొన్ని పంక్తుల సోయగమును చూడ వచ్చును :-

"కందుకక్రీడ గావింతమా, వింతమార్గంబుగావిందురా, యిందు రాజన్ముఖీ చూతమా, చూతమాలూరా పుంజంబు మోమెత్తి మాటాడవే, యాడవేసాలు బోనేల పోనేలతాలన్వి...".

"నేడు చూడంగ నాకొక్క యేడయ్యెడున్, వాడిపూ జొంప ముల్, వేడి క్రొవ్వెన్నలలో, క్రూరముల్ సేరముల్ ఘోరముల్ భృంగ ఝుంకారముల్, దీపతారోపముల్ కోకిలాలాపముల్...".

దండకమున ఇట్టి అలంకారసౌభాగ్యమును వెలయింపజేయుటలో పెదతిరుమలయ్యకు సాటిరాగలవాడు నందితిమ్మన యన వచ్చును.

# చక్రవాళమంజరి

దీని కర్త పెదతిరుమలాచార్యుడు. ఇందలి ఇతివృత్తము గూడ అన్నమయ్య శృంగారమంజరియందలి ఇతివృత్తమే. ఇది మంజరీ ఛందమున రచింపబడియున్నది. ఇందలి మంజరి సాధారణ మంజరి గాక చక్రవాళమంజరి. ఇందు చక్రవాళమను రచనారీతి జోడింపబడినది.

'చక్రవాళమంజరి' అలంకారికము, రసమయము, చమత్కారజనకము, కవీశ్వర సామర్థ్య ద్యోతకము, హృద్యమునై యున్నది. చక్రవాళ రచనారీతిని ప్రాచీన లాక్షణికులిట్లు నిర్వచించిరి.

"పదమన్త్యం సమాదాయ యమకస్థితి భూషితః
ఆవృత్యా గీయతే యస్తు చక్రవాళస్సు ఉచ్యతే
గద్యేవా పద్య బంధే వా పుణ్యా నామాంత శోభితః
నామాంతే స్వర సంయుక్తోగీయతే చక్రవాళః

లక్ష్యమ్:- "శశాంక శకలంక లంకి కుముదం ముదం న వహతే
హతే హిమకరే కరే తదసమం సమం వివసితం
సితం విజయతే యతే తపయశః".

(చూ॥ అన్నమాచార్య చరిత్ర - పీఠిక - పుట-78. అభిలషితార్థ చింతామణి, సంగీత చూడామణులనుండి యుద్ధృతము).

చక్రవాళమంజరియందు, ముక్తపదగ్రస్తాలంకారము సందునందు పూర్వపదాంతమునందలి అక్షరముతే ఉత్తర పదారంభమున నుండి ఆవృత్తియగు చుండుట ప్రధాన లక్షణము. ఇందలి పదాంత లక్షణ

మును పాదాంత లక్షణముగ జేకొని ఏకపాదమాత్రాకమగు ఈమంజరీ రచనను కవి నిర్వహించినాడు. ఇందు ప్రతి పాదాంతమునందలి అక్షరములు పునరావృత్తి యగుచుండి చమత్కారమును గొలిపి శ్రవణ సుఖముగ నున్నవి.

ఉదా :- "(శ్రీ) లలనాధారు! జన్మయాకారు
కారుణ్యవర్తి వేంకటగిరిమూర్తి
మూర్తిత్రయ శరీరు మునిజనోద్ధారు
ధారుణీసంగు నుత్తమ శోభితాంగు
సంగుప్త భవ సింధు యదులోకబంధు
బంధుర జలశూర భక్తవిచారు
జారు చక్రాబ్జాంకు సమర నిశ్శంకు
శంకు కర్ణాధ్యక్షు జలజ పత్రాక్షు...".

పై విధముగ చక్రవాళరచన కావ్యారంభమున సాగినది.

ఇందలి కథావస్తువు అన్నమయ్య శృంగారమంజరిని పోలియున్నది. వసంతవనవిహార వర్ణనలు, దోహదక్రియలు శృంగారమంజరి యందున్నట్లే చక్రవాళమంజరి యందున్నవి.

దోహదక్రియను తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు రచించిన విధము కడురమ్యము.

"ఆననాంబుజముల హ్వాముల్ వెలయ-
వెలయ యడుగని విరుల్ వెసనోసిఁబెరసి
రసికతతో నొక్క రమణి గోరంట
గోరంట గౌగిట గూరిచె బోగడ
బోగడపై నుమిసెను బుక్కిట మదిర
మదిరాక్షి యొక్క రామా తిలకంబు
తిలకంబు జూచె నొద్దిక నొకకాంత
కాంతాళమున నశోకము దన్నె నొకతె
యొకతె అంగునఁగరఁ బొనర రసాల
సాలంబుపైఁజూచె సకియ లీరీతి..." (పుట-17).

గ్రంథాంతమున :-

"వాసవార్చితుడు శ్రీవామాంకతోడ
దోడ ప్రవేశించె దొల్లింటి నగరు
గరువంపు సంభ్రమగతుల నీసరవి
రవికోటితేజో విరాజితు పేర......
పాకశాసనుడు వైభవముల నొసరు
నరులలో పూజ్యుడన్నయ వర్యతనయ
నయశాలి తిమ్మయ నవ చతురతల
దలచి మంజరిచెప్పి దక్షులింపార—"అని రచనలో నవచతురతల ప్రదర్శించినాడు పెదతిరుమలయ్య. కావ్యాంతము "మంగళ మహాశ్రీ"లతో నుండవలయునను సంప్రదాయమును కూడ పెదతిరుమలయ్య పోషించెను.

# శృంగార వృత్త శతకము

ఇది పెదతిరుమలాచార్యుని కృతము. పేరును బట్టి ఇది శృంగార పరమని తెలియుచున్నది. ఇది శ్రీ వేంకటేశ్వర స్వామివారి కంకితముగ 8 శార్దూలములు, 18 మత్తేభములు, 80 చంపకములు - వెరసి 108 వృత్తములతో గల శృంగారశతకము. చంపకోత్పలములలో 'వేంకటేశ్వరా' అను మకుటము ప్రధానము. 68వ పద్యమునందు "శేషగిరీంద్ర నాయకా"-అని, 66, 86, 100 పద్యములలో "తిరువేంకటేశ్వరా" అని మకుటము గలదు. మత్తేభ శార్దూలములలో "వేంకటాద్రీశ్వర" అను మకుటము గలదు.

పరమపురుషుడగు శ్రీ వేంకటేశ్వరుని శృంగారలీలయే శృంగారవృత్తశతకమునకు వెనుకనున్న కథ. పరమపురుషుని సర్వాంతర్యామిత్వము నెరిగిన అలమేలుమంగ సత్వగుణమున రుక్మిణీదేవివలె ఆతని దక్షిణ నాయకత్వమును గూర్చి వేరుగాదలపదు. కాని సత్యభామవలె ఆతని ఎడబాటు నెరుగని శతకకర్త్రమాత్రము వేదన నను

భవించును. ఈశతకమున నాయిక తిరుమలాచార్యుని జీవుడే. నాయకుడు శ్రీనివాసుడు. ప్రేమాతిరేకమున నాయిక పలువిధముల నాయకుని చేష్టితములకు వెతనొంది వ్యంగ్యవైభవము వెలార్చునట్లు దొసగుల నెమకుటయే ఈ శతకమునందలి విషయము.

"ఆసల బెండ్లిఁగూడి మఱియల్గిన! జెల్లునె యెంత చేసినా
వేసర నన్ను నీవు నిక వేసుగ జూడక మాటలాడు మీ
దోసము గాదు నీగుణము తొల్లి నెఱుంగుదు తోడివారితో
వాసికి నే బెనండెదను వంతలబెట్టకు వేంకటేశ్వరా" (74ప)

అని నాయిక ఆందోళనముతో నాయకునితో చెప్పుకొనుటకై వచ్చును.

"కలరానాకిల రామలెవ్వరయినందారీడుగాజోడుగా
గలరానీవలరారఁజూచుకొను మింకా మానవా కానవా" (6ప)-

అని వేడుకొనును. "కాసుల యాస బాసకొని కౌగిట గూడిన దానగాను (8ప)-అని ప్రమాణము చేయును

నాయకుడెవతెనో కలస వచ్చిన సంగతిని నాయిక గ్రహించి, ఇట్లనును.

"నెమకుచు బొంచు వింటి యటు నేర్పున యూరకయుంటి నీపయిం
జెమటలు మించంగంటి కలసెన్ నినుఁదామరకంటి యొంటిగా
సమకొని మోవిగంటి యిదె సాకిరి యుండగ యిట్టినోరనే
యమరని మాటలేమిటికి నాఁడెద విప్పెడు వేంకటేశ్వరా" (18ప).

తనమనసెల్లవిప్పి క్రిందివిధముగ చెప్పుకొనును.

"తడబాటేమిటికి చోటికిన్ మగని యొద్దంజేరి దైవారితా
నొడబాటై కరగించ జెల్లునిదె నీయొద్దన్ విజృంభించి ని
ల్కడ బాటల్ తగ్గి బాడి యూడె! జెలికిన్ గట్టాయిదెట్టయ్యెనీ
కడబాటింపుచు బాడుదున్ వినుము వేడ్కన్ వేంకటాద్రీశ్వరా"

(32ప). మగలెందున్ నొగిలిం చరింతులను రమ్మా వేంకటాద్రీశ్వరా" (19 ప) అని అర్థించును. కావలసిన తనతో ఇతరులను పోల్చిచూడుమని, ఆపె నాయంతరమెంచి చూడుము. నిరంతరముందగ వేంకటేశ్వరా" (43 ప) అని పల్కును.

"శ్రీగలవాడవేమనినఁజెల్లును నేనిక నడ్డమాడినన్
బాగులుగావు మానమున బంతముదక్కను మీరిపల్కనం
దీగెలు సాగి యీరొకటి దీయగఁ బేనటువచ్చునండ్రు నీ
భోగము నాకు నిచ్చితివి పొందుగదా త్రినె వేంకటేశ్వరా"
(57 ప) అని స్వామిని గూర్చి పల్కను.

కూరిమినిచ్చి, కొదువ సేయుట తగునాయని క్రింది విధముగ మనవి :-

"వెరదుల తోడనవ్వ పదివేవురఁ బెండిలయాడు నిన్నునే
వలదన విట్టి వెల్ల మగవానికి సాజము లాట దానికిం
గలిగిన దొక్క సిగ్గునను కౌగిట గూడుచు నన్య కాంతలం
దలతురె నీకు మ్రొక్కెదవెదంబోరలించకు వేంకటేశ్వరా"(52ప)

ఒకప్పుడు స్వామి తనపై చూపిన మమకారము ఇట్లు గలదు.
"అడవులవేటలాడుచు బ్రియంచిగురొత్తగ నీదు కాంతకున్
నడుమది సింహమంచు జఘనంబిభమస్తకమంచు నంచలే
నడుపులటంచు జక్కవలు నన్యకుచంబు లటంచు నేయకే
విడువుతువు వాని నీ కెపయి వేడుకలెట్టివో వేంకటేశ్వరా"(54ప)

స్వామి ఎదలో తానుగాక వేరొకరు గలరు,
"ఎఱుగకనవ్వినందులకు నేమనినానిక నీకుజెల్లునీ
మఱుగున నాపె దాగినది మానుగ నేనటు జూడనైతి యీ
తెఱగులు తొల్లి లేవు పలుదిక్కుల గ్రొత్తలు నేర్చుకొంటివా..."
(61 ప) అని అనుమానించును.

నాయిక నాయకుని ప్రవర్తనను గూర్చి ఇట్లనును :-
"తడవకు నీవు మమ్ము నినుఁ దప్పులు సారెకు బట్టనేల నీ
నడవడి యెప్పుడుంగలది నాకిక జక్కటు తేల దిద్దనీ
పడతులు నారె నావలని పంగెనయేటికి నిందు మోహమె
య్యెడలను లేదు నీకు నదియేను నెఱుంగుదు వేంకటేశ్వరా"
(77 ప)

నాయకుడు నాయికను అనునయింప చూచెనేమో,

"ఈదెస నన్ను వేడుకొని యింతటివాడవు బుజ్జగింతగా
గాదననేల నిన్నుగడుఁగల్ల మొనర్చినవాడు వచ్చితా
లేదనినంతఁ బోవు మరలించితివిఁ గోపము వాదులేల? నీ
పాదము దెమ్ము మ్రొక్కెదను పాప్పిదె రమ్మిక వేంకటేశ్వరా"
(78 ప)

అని సర్వాత్మ సమర్పణముగ తనను స్వామి కర్పించుకొనును.

"కల్లలు గల్గినన్ విభుని కాదనజెల్లునె కాంతకున్
సదా, యుల్లమునందు సంతసిలి యుండుట యేలిక" (86 ప)

"నీవు వచ్చుచో నిన్నటి కోపమంతయు నెమ్మది బాసెను వేంకటే
శ్వరా" (89 ప) అని మనసిచ్చి స్వామిని ఆహ్వానించినది నాయిక.

స్వామి ఎదపై వేరొకతెను గూడిన చిహ్నము లున్నవి; అందుకని,

"ఇంటికి నన్ను బిల్చి కడ నెమ్మొల బోవుచు నియురంబునన్
జంటగ చన్నులొత్తినది చక్కగ రెంటెముగప్పు మందుపై
నంటిన జూడరాని వవి నాతుల సిగ్గులుదాచు టొప్పగున్
గెంటరి వాకె నీవయిన గోప్యము సేయుము వేంకటేశ్వరా"
(92 ప)

స్వామి తనతోనున్నపుడు వేరొకతె పేరు వినినంతనే సాత్త్విక భావోదయమును పొంది కప్పిపుచ్చుకొనుటకై తంటాలు పడు చుండడగ, చెలి,

"పులకలు మేననిండె నొకబోటిని పేర్కొనినంత నీకు నే
బిలువగ బోదునో మగని బెందిలి సేసిన బుణ్యమాను నా
వలపటు వెట్టు నీ మనసు వచ్చినఁ జాలును నవ్వుగాదు నా
తలపున బాయ వెప్పుడును దప్పదు శ్రీతిరువేంకటేశ్వరా" (100 ప)
అని పలుకును:

తుదకు నాయిక, క్రిందివిధముగ మనవిచేయును :

"అలికులవేణి నొక్కరితె నంటితి వంచును వింటి దానికే
యలిగితి నీవు లేదనుచు నానలు వెట్టెదు సారెసారెకుం

జలములు మానినన్ మనసు సందియ మేటికి మానుఁజాలునీ
నిలువున కల్ల గల్గినను నిన్నె భజింతును వేంకటేశ్వరా'' (102 ప.)

కడకు చెలి, స్వామి సరసుడని యెరిగి, క్షమాభిక్షనిట్లు వేడుకొనినది.

''సరసుడ వన్నిటన్ మిగుల జాణవు నిన్ను నుతించుటొప్పగున్
దరుణికి వ్యంగ్యమాడవలె దప్పక కాంతునిఁ గన్నచోటులన్
విరసముగాద చిత్తభవవిద్యకు మంత్రము దీనికై నినుం
బరుసము లాడితిదెలిసి పట్టకుమెగ్గులు వేంకటేశ్వరా'' (101 ప)

# శృంగారవృత్త శతకమునందలి కొన్ని పద్యరత్నములు

1. 'కామిని చన్నులంచును నగంబులుఁ బ్రాకి కరంబులంచు నా
రామములోన దీగలను రాగపు కౌంగిట జేర్చి నిశ్చయం
బేమిట జేయరాక మదినెంచి కుచంబులఁ దద్భుజంబులం
బ్రేమ నఖంబులం గుఱులు వెట్టితి వప్పుడు వేంకటేశ్వరా'(62 ప)

2. 'కామిని గోరనొత్తినది కస్తురి నీమెయిఁ బూయదయ్యెఁదా
వేమరుమోవి యానినది వీడెము సేయగ నియ్యదయ్యెనీ
మోముచెమర్చ జేసినది ముందరనే యల పార్చదయ్యె నీ
బూమెలుగంటి నాయెదుట బొంకగరాదిక వేంకటేశ్వరా'(56 ప)

3. 'సురతపువేళ నీ మెరుగు సొమ్ములలోఁ దననీడగాంచి యే
తరుణియొ వచ్చెనంచుఁచెలి తత్తరమందుచుఁ జీరగట్టె నీ
తురుమట వీడె నెంద్రుకల తోడనే యందులమీద గప్పగా
విరసము మాని కూడెనని వింటిని నేనిటు వేంకటేశ్వరా' (68 ప)

4. 'వలచిన దానవేను మరివాసులు చూడగనేల యొద్దకుం
బిలిచిన బిల్వకుండినను బెంపునఁ గొల్వులు సేయుచుండినన్
సెలవగు నాదు జన్మనము చెప్పితి నీకిక నన్యకాంతలం
గలయగ వేళయౌనో మరికాదో యెఱుంగను వేంకటేశ్వరా (94ప)

5. వెలదులు గొల్వుసేయునెడ వేడుకయొక్క తిమీద నిల్పి ని
ట్టలముగ రత్న సౌధమున దాగిలి మూతల నాచరింతమా
యలవడనంచు నేగి చెలినక్కడ గూడితి వెంతనేర్తువో
తెలియదు నీమొలంగని సతీమణులెంచిరి వేంకటేశ్వరా
(79 ప)

6. 'సతులన్ సమ్మతులన్ గెరల్చిరతులం జాలంగ నోలార్చినన్
పతులన్ సంగతులన్ గరంచి తతులంబై కొందు కాంతలై
గతులన్ మామితులన్ వరించి మతులం గలగించి కుంగింతురా
నతులన్ నీ నుతులన్ మెలంగగల దానస్ శ్రీవేంకటేశ్వరా"
(15 ప)

శృంగార వృత్తశతకము శబ్దాలంకార శోభితమైయున్నది. ముక్తపదగ్రస్తమునకు ఉదాహరణముగ క్రింది పద్యము :

"శ్రీరమణీ మణీ ప్రమద జీవన జీవనవాస వా
దార విశేషశేష వసుధా ధర నాథ విహార హార కే
యూర విరాజి రాజిత మహోన్నతదేశ భుజంగ జంగమ
స్మేర వికల్ప కల్పకమ మిమ్మునుతించెద వేంకటేశ్వరా" (1 ప)

ఛందోవిషమమునగూడ పెదతిరుమలాచార్యుడు చమత్కారములు గావించి యున్నాడు.

ద్విపాలస : ఉదా:-

"కలరా నాకిల రామ ల్వేరయి నం...
గలరా నీ వలరార జూచుకొను...
వలరా జప్వల రాయడించ...
కొలరా కాకల రావుజేసి నను... (6 ప)

త్రిపాలస : ఉదా :-

"గరుపాదం దమిరెంచి నీ సకియ ...
గరుపారావత మేమి చూపెదవు ...
గ్గరుపారా జసమెంత సేసెదవు
గరుపారంబుగ నెవ్వరుంగలమమింకన్ వేంకటేశ్వరా" (13 ప)

## నీతి సీస శతకము

ఇది పెదతిరుమలయ్య రచన లోకనీతిని చెప్పునదీ శతకము. ఇందు వంద పద్యములున్నవి. "కలితలక్ష్మీశ సర్వజగన్నివేశ ! విమల రవికోటి సంకాశ వేంకటేశ''- అనునది ఈ శతకమున మకుటము. దీనికి వేంకటేశ శతకమనియు నామాంతరము గలదు.

ఈ శతకము నందలి మొదటి పద్యము శ్రీవేంకటేశ్వరుని దివ్యమూర్తిని స్మరించునది. 99వ పద్యము కూడ స్తుత్యాత్మకము 100 వ పద్యము అంకితాంక పద్యము. ఈ శతకముననీతి-రాజనీతి, సంఘనీతి అని రెండు విధములుగ చెప్పబడియున్నది.

నీతిసీస శతకము నందలి రాజనీతిని క్రింది విధముగ సమీక్షించడమైనది.

### రాజనీతి :

రాజనీతికి సంబంధించి, రాజన నెట్టివాడు, ఎట్టివాడు రాజు కావలయును. రాజనీతి ఎట్టిది, మంత్రి పదవి ఎట్టిది, రాజు దినచర్య లెట్టివి అను విషయములందు చెప్పబడి యున్నవి.

రాజు అఖిలమును రక్షించువాడుగ నుండవలెను. రాజు ధార్మికుడుగ నుండును గనుక "రాజు చేసినదె ధర్మంబై ప్రవర్తిల్లు"ను. స్వామియగువాడు భటునకె చనువు లొసగి మనుపవలెను. దాతృత్వము, సహనము, ప్రశాంతత, మేలును ప్రశంసించుట, చాడీలు వినకుండుట, తప్పును క్షమించుట మొదలగునవి రాజునకుండవలెనట. రాజు తన నిత్యజీవితమును క్రమ పద్ధతిని జరుపుకొనవలెనని, ఆతని దినచర్య క్రిందివిధముగ నుండవలయునని పెదతిరుమలయ్య చెప్పెను.

జలకంబు దగుపాటి జపము దేవార్చన బ్రాహ్మణసేవ పురాణగోష్ఠి
దానంబుచోర శాత్రవ వినిగ్రహచింత స్వజనగణాశ్వరక్షణము గణన
యాప్తమంత్రి పురోహితాలోచంబులు రాజ్యాదిధన విచారంబు
భుక్తి సంగీత సాహిత్య సౌఖ్యాను భవములు గూడచారుల కొలువు
గుప్తనిద్ర సలుప వలయును ప్రతి దివసంబునందు

నయ మెఱింగినయట్టి భూనాయకునకు" (10 ప)

రాజునకు అంతర్ బహిర శత్రువులుందురు. వారిని గ్రహించి ఏమరక రాజ్యమేల వలెనని కలి క్రింది పద్యమున చెప్పెను.

"చాడికాడగువాడు సటలెల్లబోధించు నందున కొరులపై నలుగవలదు
పాతకుండగు వాడు పరులను దూషించు వెట్టియై తానవి వినగవలదు
పెడదోంగయగువాడువిత్తంబుతో వచ్చుబ్రమసియాసలనవి పట్టదగదు
మాయావియగువాడు ముందు మంత్రమునేర్పు మఱచి తప్పియు నలి మరుగ వలదు
కర్తయగువాడు కపటుల గతులు దెలిసి
యేమఱక రాజ్యమెప్పుడు వేలవలయు"(46 ప)

రాజు అల్లులను నమ్మరాదని క్రిందిపద్యమున చెప్పెను "తన కాపులగు వారి దండునునగదగు నధికశూరుల దండు లంపనగును మఱి ధనాఢ్యులకును మణివంబు లీదగు హితులవాకిలి గావనిడగగును ఘనకార్యపరుల దుర్గముల బెట్టదగదు నిపుణుల నుడిగల నిలుప దగును సముచితజ్ఞుల వ్రాయసము వాయుడసదగు మాయావుల దలార్ల జేయ దగును మఱచి యల్లులం దానమ్మ మనుపవలదు.

గరిమ ధరయెల్ల నేలెడు ఘనున కెపుడు" (55 ప)

రాజు మత్తుడై యున్న కార్యము కుదురు పడదని, కవి "అధ మునిమొఱమైన యాలకించుట యొప్పు వినకున్న నానాజ్ఞ విఫల మగును మెట్టిచూచుట యొప్పు మితిలేని రాజ్యంబు పోకున్న నలజడి బొందుచుండు దనసొమ్ము పలుమారు దలచికన్గొను టొప్పును గుల కాంతల వరుసతో మానిన బాపంబు తోనె కలుగు మత్తుడై యున్నం గార్యంబు మట్టు వడదు

వలసి యెల్లను సేయంగ వలదు పతికి" (61 ప) అను పద్య మున చెపెను.

రాజు ఏమరక రాజ్యమేలవలెనని, పెదతిరుమయ్య, "అడవి తోపల రాజ్యమది యెల్ల మనరాదు బలువుండుపై కొన్న బాధ సేయు గ్రూరవర్తనునైన గూర్చియేలుటదగు బగఱ గూడినవాడు

భయమెునర్చ గడినున్న వానితో దొడరుచుండుట యొప్పు నూర
కుండిన నతండొత్తజూచు బలుమారు బంటులఁ బౌజుచూచుట మేలు
గర్వింతురిటు వలె గాక మున్న నృపుల కేమరి యుండుట నీతిగాదు.
బహువిధంబుల నెచ్చరి బ్రతుక వలయు" (84 ప)-అను పద్యమున
చెప్పెను.

రాజు మంది బలగమును కూర్చుకొనుటయేగాక అదనెరిగి
శౌర్యమును గూడ ప్రదర్శింప వలయునని క్రింది పద్యమున చెప్పబడి
యున్నది.

"చెఱయుఁ గొల్లయు వాటి సీమలోఁ లేకుండ దండెత్తవలయు
శాత్రవులమీద గడ్డియు దవసంబు గడనీరు చల్లుచోటరసి పొందుగ
విడియంగ వలయు గైకొన్నభూముల గావుగా పాళెంబులోనరించి
మరియవ్వలోత్తవలయు గజము గుర్రమునుబంటుగానిఁ బొందకయుండ
లలిఁబోరి పగరగెల్వంగవలయు బుద్ధిఁబదరక యొప్పుడు భూవిభుండు
మెల్లనే బాహుశౌర్యంబు మెఱయఁగొప్పు" (29ప)

రాజు, రాజనీతినెరింగి ప్రవర్తింప వలయునని పెదతిరుమలయ్య
క్రింది పద్యములలో వివరించిన తీరు ఆతని రాజనీతిజ్ఞతకు దర్పణ
మనవచ్చును

"గరిమనేలికలేని కయ్యమేడకు నెక్కునానాజ్ఞ లేని రాజ్యంబు జడియ
బహుధనంబులులేక బలమే పనికివచ్చు బలములేనిధనంబు ప్రాతిగాదు
ధర్మంబులేని యాస్థానమంతియువృథ సామునేరని పోటుసరవిగాదు
సవరణలేని విశాలదుర్గంబేల గడ్డి దాణములేని గడినశించు
లంకెలొకటి నొకటి కీలాగు చెలియ
నరుస దప్పక ధరయేలువాడె రాజు" (28ప)

"సముడైన శత్రుతో సంధిచేయుట గార్యమెక్కుడైనను గప్ప
మిడగవలయు

దఱినల్పదళమైన దండెత్తగాదగు దొలగి దాగినను బోఁదోలవలయు
సిద్ధమైనను భేదమెసగజేయుట యొప్పుఁగాక గర్గోలుగా గదుమవలయు

జనకున్న శత్రు రేచుట లెస్సయొండెముట్టడిసేసి యుడుపవలయు
రమణనీరీతి దలపోయ రాజనీతి యిట్లునడచిన విభుడిల యెల్లవేలు"
(27 ప)

"చెఱపరాని మనుష్యు జెల్లదు కోపింపవాడుచేజిక్కిన వదలజనదు
విశ్వాసియగువాని విడుచుట యవినీతి ద్రవ్యాపహారిని దగదు
మనుప పాపాత్ముడై నట్టి బంటునేలగరాదు ధర్మాత్ముననలగింప
దగవుకాదు బుద్ధిచెప్పినవాని పోలదు భర్జింప నపరాధురహితుపై
నలుకవలదు వరుసనారసి నధిపులు వారి వారి
గుణములెరుగుచుఁ గార్యంబు గొనగ వలయు" (26ప)

"శత్రులమాటలు సతమని నమ్మక కాంతలకును గుట్టు గాననీక
సమయగాంచ్రడకుమిరి చనువుచెల్లింపక తోడుబోతులనిల్లు ద్రొక్కనీక
ఘనతరద్రోహి గొల్వునకు రానీయక మొదల వంచకునకు
మొగముగాక
పిఱికిపోట్లాటకు బెనపెట్టుకొని తేక దొరయని హీనునితోడనగక
వదల కెచ్చరియుండెడివాడు రాజు
జగతివర్ధిల్లునిట్టి విచారపరుడు" (49ప)

జగన్నాయకుడే కాలపురుషుడై, ఈ ప్రకృతి శరీరమునకు రాజును ప్రాణముగజేసి తాను నియామకుడై పోషించుచున్నాడని కవి క్రింది పద్యమున వివరించెను.

"భూమియే దేహంబు పోలించి చూచినరాజు ప్రాణంబు
శౌర్యంబు శిరము
గడియించిన ధనంబు ఘనతరాయుష్యంబు మతి సత్ప్రధాని
ధర్మంబుజోడు
కరచరణాదులు కరితురగంబులు ఘనవిచారమునీతి కరుణదేవి
బలుపైన దుర్గముల్ పంచేంద్రియంబులు సరవిజై తన్యంబుసర్వబలము
కాలపురుషుండవై నీవు ఘటన మెరసి
చేయుచుండుదు రాజ్యంబు చెలగిచెలగి" (81ప)

పెదతిరుమలయ్య రాజనీతితోబాటు మంత్రినిగూర్చి కూడ

వివరించియున్నాడు. మంత్రియగువాడు ప్రవర్తింపవలసిన విధమును కవిక్రింది పద్యమున వివరించెను.

''ఇచ్చకంబాడిన హితవహాను విభునికి మఱిదిసంతడచిన మనసు విఱుగు
నొదిగివర్తించిన నొడబడి దయపుట్టు పంతంబు మెరసినఁబగరేగుయి
నోర్పుతో గొలిచిన నొసగజూచు ధనంబులడుగగోరిన వేసటగును
మిగుల
తలపులోమెలగినవెలయు సంతోషంబు లెరవెరపైయున్న నెడయుభక్తి
మంత్రియగువాడు కార్యక్రమము నిట్లు
తెలిసినడచిన శుభములు తేటపడును'' (82ప)

మంత్రియగువాడు రాజు హితముగోరి మెలగవలయునని కవి క్రిందిపద్యమున సూచించెను.

''ఉచిత కార్యంబు రాజొకమఱివినకున్న మఱియు జెప్పగదగు
మాన్యునకును
దంగవెంచ కేలిక తన్నుగోపించిన నెగ్గుపట్టగరాదు హితునకెపుడు
తనవిభుండొక కానిపని చేసిన నమరజేయగవలె నా ప్రునకును
మరచిన యధిపతి మనసులో పనులెల్ల నెచ్చరించగవలె నిష్టునకును
సచివునకుబోదు పతికెన్ని చందములను
హితవు గోరక నీతి ననేక గతుల" (95 ప)

## సంఘనీతి :–

లోకానుభవమును అపారముగ సంపాదించిన పెదతిరుమలయ్య నీతి శతకమున సాంఘిక నీతినిగూడ ప్రస్తావించి యున్నాడు.

'ధర్మంబు గలచోట దలకొను జయమెల్ల సత్యంబు గలచోట సమకూరు శుభములు, భక్తి చేసినచోట ఫలమిచ్చు దైవము' (2ప) అనియు, పరమనాస్తికునకు భక్తివాదములేల, షండునకేటకి సతుల పొందు, పాపకర్మునకేల పరపురుషార్థంబు, ధనలోభికేల బాంధవము చింత (3ప) అనియు, 'తపసికి నేటికి తలపోయ రోషంబు, పరమ యోగికి నేల ప్రజలరచ్చ (4ప) అనియు తిరుమలయ్య చెప్పెను.

సద్వివేకులైనవారు స్నేహము నెరపవలసిన విధము పద్యమున సూచితము.

'కులమువారల కియ్యకోలైనదిల్లాలు వరుసతో రక్షించువాడు దండ్రి
ప్రియముతో జన్నిచ్చి పెంచినయది తల్లి తనకు తోడగువాడు
తమ్ముడరయ
నాపద బెడబాపు నాతండు బంధుండు వంచనసేయనివాడె భటుడు
మోక్షమార్గమును సూపుముఖ్యుండె యాచార్యుడాత్మకు
నిష్పమానతడుసఖుడు
ఎఱిగివీరలతో బొందునెఱపవలయు
గుఱు తెఱింగిన సద్వివేకులకునెల్ల' (6ప)

మనుజుడు వరుస తెలిసి బ్రతుకవలెనని,

'ప్రాణంబుతోలంకెపాటుది తనసతి ధనబుణంబులలంకె తనయుడరయ
సుఖదుఃఖములలంకె సారిదితల్లియుఁ దండ్రిపాలికి లంకెలు భ్రాతలెందు
భువిమానరక్షణమునకు లంకెమఱంది మెలతనొసగలంకె మేనమామ
మేలుమీరదటిలంకె మిత్రవర్గంబెల్ల హర్షంబునకులంకె యల్లుడెలుపు
వారి వారికి దగినట్టి వరుస దెలిసి
యరయవలయును యజమానుడైనవాడు' (3లప) అను పద్యమున చెప్పబడినది.

మానవుడు కలలోననైన క్రిందివారితో స్నేహముచేయరాదని పెదతిరుమలయ్య క్రిందివిధముగ సూచించెను.

''గడుసరి దాటోటుఁగష్టు వేడుకకొనిఁ గలహప్రియుని ధూర్తుఁగ
పటచిత్తు
సుంకరిజూదరి జూటుననాచారి మునిముచ్చు జలపాది ముడియవిడుపు
గుచ్చితునపకారిఁ గుటిలాత్ముగ నవివేకిగ్గెలాటకానిఁ దక్కరిఁదుటారి
వేటకాని బినాళి వెట్టినప్పులపోతు మాయదారిని జారు మధ్యపాని
జీరపలదు మఱిపొందు సేయదగదు
మానవునకర్థితోఁగలలోననైన'' (9ప)

పలుమారు శపథములు పలుకువాడు, కూట సాక్షులకు గురియైనవాడు, ఇంటివారితో అలుగువాడు, విభుని రహస్యములు వెలి

పుచ్చువాడు, పరులచే లంచములు పట్టువాడు, ఉపకారమును మరచు వాడు - ఇహము పరములేక అధోగతి పాలగుదురని (13ప) కవి వివరించెను.

నీచస్త్రీలను దగులకెపుడు ధర్మవిదుడై, సన్మార్గవర్తియై మనుజుడు మెలగవలయునని, "ఇలదొమ్మరిది జాతిహీనత యెంచదు, వూటకూళ్ళది పుణ్యమునకు జారదు. జారకామిని తన చావు చింతింపదు, మోటులంజియ మొగమాటపడదు, దూతిక కడుసిగ్గుపడదు, పరగృహవాసిని పరనిందకోడదు" (20ప) అనుపద్యమున సూచింపబడినది.

అనుకూలవతియైన భార్యగల్గిన మనుజుని జీవితము ధన్యమని, కవి ఉత్తమస్త్రీని గురించి క్రిందిపద్యమున వివరించెను.

"పతికి మారాడక పలుమారు నేడ్వక యలుగక మిగుల గయ్యాళిగాక
తను దిట్టికొనక కాంతాళించి కోణగక ముచ్చిలింపక పాపమునకు జారక
పొరిగింటికేగక పరునాత్మదలపక కువితగాక పరానుకూలగాక
యదువదాపక మర్మమవ్వలజెప్పక బొంకక నిద్దురపోతుగాక
కాపురముసేయు కామిని గలిగెనేని
పలుకులేటికి బురుషుని భాగ్యమహిమ" (32ప)

పెదతిరుమలాచార్యుడు, దుర్జనులను పేలతోను, చెదలుపుట్టతోను, ఈగలతోను, దోమలతోను పిల్లులతోను, పులులతోను, మకరములతోను (58,59ప) పోల్చి క్రూరసంతతి నశించునట్లు వీరును నశింతురని చెప్పెను.

"అపవాది, సర్వకంటకుడు, అతిమూర్ఖుడు, కడుఅహంకారి, నిర్దయుడు అనువారలువారు, వారుచేయు నీచకార్యముల వలననే నాశనమగుదురని (77ప) కవి చెప్పెను.

మూర్ఖులను, గాడిదలతోను, కోతితోను, కుక్కతోను పోల్చి (74ప) వారి గుణములు మార్చవీలుకాదని కవిపల్కెను.

"బంగారును పెంకువలె భావించి, కామంబు క్రోధంబు కట్టిపెట్టి, తిట్టిన తిట్లను దీవెనెలుఅవిని, శత్రువులను మిత్రులుగదలచి,

కాషాయవస్త్రములుగట్టి, బ్రహ్మధ్యాన నిపుణుడైనవాడు" (72ప)
నిశ్చింతగ జీవించునని కవి తెల్పెను.

మానవుడు తన జీవితకాలమున దీపముండగనే ఇల్లుచక్కబెట్టు
కొనవలెనని, లేదేని వ్యర్థుడగునని, 'పాయంబుగలనాడె పంతంబు
తాడేరు బలిమిగల్గిననాడె పరగుజయము సంపదగలనాడె జరుగు
సౌఖ్యములెల్ల, దనువుగల్గిననాడె ధర్మమెసగు బిలువుగల్గిననాడె
ప్రియములు సిద్ధించుఁబోదిమిగలనాడె పొసగుమాట మన్ననగలనాడె
మనవిచేకూరును జనవుగల్గిననాడె సరసమమరు మోసపోయిన మతి
తాదు మొదలిచంద మెఱిగి నడచినవాడెపో యెక్కుడెందు" (22ప)
అనుపద్యమున సూచింపబడియున్నది.

మానవుడు భగవంతునిగూర్చి చింతించక ఇతరములను గూర్చి
ప్రాకులాడుట తగదని కవిఇట్లుపల్కెను.

"భుజియించునప్పుడే పోవునాహారముల్ పూసినగందంబు పొల్లురాలు
గట్టినప్పుడెమాయు ఘనవస్త్రచయములు ముడిచినప్పుడెవాడు
ముదిగివిరులు
గలసినప్పుడెపీడుఁ గాంతలతోఁదమి తొడిగినప్పుడెగుల్ల తోచుసొమ్ము
లెక్కనగడునలయించు వాహనములు వసముగానిధనంబువట్టితోడుసు
గలుగనేర్చునె నిత్య సౌఖ్యంబులిందు
నిన్ను గొలిచిన సుఖములు నిలుచుగాక" (54ప)

పెదతిరుమలాచార్యుడు ఈ శతకమున, గురువు, శిష్యుడు,
మతము మున్నగువానిని గురించి గూడ వివరించెను.

గురువు :-

"సత్సంప్రదాయుడై శాస్త్రపారీణుడై యాగమజ్ఞుండై నయతడుగురుడు
పరమ దయాళుడై పాపనిర్ముక్తుడై యాచారవంతుడౌనతడు గురుడు
భూరిసుజ్ఞానియై బోధింపశక్తుడై యతిశాంతచిత్తుడౌ నతడు గురుడు
కడుఁదపోనిష్ఠుడై ఘనమంత్రసిద్ధుడై యధ్యాత్మవేత్తయౌనతడుగురుడు
తెలిసి యిటువంటి గురుఁజేరి వెలయవలయు
సుజనులగువార లీడేథజూచికేని" (92ప)

శిష్యుడు :-

"అర్థంబు దేహంబు నాచార్యసొమ్మని యానాజ్ఞ దప్పక యాస్థగలిగి
తగినశుశ్రూషకుఁ దనువలవడఁజేసి మతిగల్గి యేప్రొద్దు మఱపు విడిచి
యుపదేశమిచ్చినట్లూహదలపోసి యాహారనిద్రల కాసపడక
వేసరకాత్మలో విశ్వాసమెసలక హరిభక్తి గురుభక్తి నధికుడగుచు
నున్నయాతండె శిష్యుడీ యుర్వి మీద
బరగుశుభమూర్తి యతిలోక పావనుండు" (93ప)

మతము :-

"దైవంబు గురుడును ధరగలరని నమ్మి తలపోసి మనుటయుత్తమ మతంబు
కలదువేదము ముక్తిగలదు పుణ్యులకని మతిభక్తిసేయుటే మంచి మతము
యజ్ఞాదికర్మంబు లఖిలప్రపంచంబు సత్యంబులనుట నిశ్చలమతంబు
హరిమాయచే జిక్కదాతండె సర్వజ్ఞుడని భజియించుట యాదిమతము
చదివి తెలిసిన పెద్దల సమ్ముఖమున
నెఱుగువారికి సఫలమౌనీ మతంబు" (94ప)

ముదిమినిగూర్చి కవి వర్ణించనతీరు గమనార్హము :-

"ముదిమి తీగలువారి ముంచినకైవడి కడుమేన నరములు గానుపించు
దనమేను గనుగొని తానెనవ్వెడు క్రియ మీసలుగడ్డంబుమిగులనరయు
బంచేంద్రియములకుఁ బరగనోడిలినని వెన్నుచూపినపోల్కివీపువంగు
నుప్పతిల్లిన మదముబ్బు దీసినరీతి నేర్పడు బుడుపులై రొమ్ములెల్ల
నిట్టిజరచేతజిక్కియు నెడ్డెనరుడు, మనసుదనియకభోగించు మనసుపెట్టి" (90 ప)

సప్తవ్యసనములను, వాని దుష్ఫలితములను కవి సోదాహరణముగ క్రిందిపద్యమున వివరించెను.

"పరకాంతకై సింహబలుడట్లు మృతుడయ్యె రాజ్యలోభమున గౌరవుడు వొలిసె
బహుషోక్తులను శిశుపాలుండు హతుడయ్యె మహిని జూదమున ధర్మజుడు నొగిలె

నలపాండురాజులేటాడి శాపమునొందెమును రావణుడు చలమ్మునను
సమసె
గ్రూరదండంబున గూలెను వేనుండు జడిసెఁ శాపమునరాక్షసగురుండు
ఘనవివేకులు వీరల గతులు దెలిసి
వ్యసనములు మాని నడవంగవలయు నిలను" (17ప)

కాలగతులు విచిత్రముగ నుండునని, దానికై వగవ వలదని, కవిక్రింది విధముగ సూచించెను.

"కొన్నిభూములనెండ కొన్నిభూములఁజలి యొక్కనిమేలు
వేఱొకని కీడు
వెలయుఁజుక్కలురేయి వేగుప్రొద్దునమాయు గొంతకాలముకల్మి
కొంతలేమి
కప్పుమేఘము మింట గడపట బయలౌను జవ్వనంబగుమేను జడిసి
ముదియ
గాయలైయున్నవే కడపటఁబండ్లౌను గడఁకీనులధికులై కానుపింతు
రెంచిచూచిన వెనుకముందిటులనుండు
గలగవలవదు సహజంబు కాలగతులు" (63)

జగన్నాటక సూత్రధారియొక్క నాటకములనుకవి,
"ఏనుగులావెంత యిలమావటిడెంత తిమిరంబులబలిమెంత దీపమెంత
ఘనసముద్రంబెంత కర్ణధారకుడెంత బహుకాననంబెంత పరశువెంత
పాఱెడునీరెంత పర్వతంబదియెంత హరుడెంత మృదులపుష్పాస్త్రమెంత
భీకరఫణియెంతవాకట్టువేరెంత బహురాజ్యమెంత భూపాలుడెంత
యెప్పటికి దొడ్డు కొంచెంబు లెంచరాదు నడచు నిటువంటి నీ నాటక
ములు (56ప) అను పద్యమున వ్యక్తపరచెను.

ఇంకను పెదతిరుమలయ్య తనశతకమున కొన్ని నిత్యసూక్తు
లను చెప్పెను వానిని చూడవచ్చును.

1. "పసుగురాడినమాట పాటియై ధరజెల్లు నొక్కడాడినమాట
యెక్కదెందు
నుఱకయుండినవాని కూరెల్లనోపదు నిజముముందఱగల్గ నిలువదెపుడు
రాజుచేసినది ధర్మంబై ప్రవర్తిల్లుఁ గపటాత్ముతోఁ బొందుకడకుఁ
గీడు" (68ప

2. "గాడిద యెఱుగదు గంధంబువాసన లేదూరబందికి లీలకొంత" 74ప
3. "గోడపైసున్నంబు గోకినఁబనికిరాదొడల్పై వాసనయూర్చరాదు
చేతబట్టినయట్టి జిడ్డు లెక్కకురాదు కోకబెట్టిన గంజి కూర్చరాదు
ముగ్గుపట్టినపిండి మొనసియట్లకురాదు మీసలపై తేనె మ్రింగరాదు"
4. "దుష్టు సూర్యుని దెస దుమ్మెంతచల్లినఁ దనపైన పడుగాక
దానికేమి
కొండతో తగఁబడికొని యెంతదాకిన దలవ్రక్కలగుగాక దానికేమి(66ప)
5. "అపవిత్రమగునట్టి యన్నంబు గొనుకంటె నడవిలో దిను
బలుసాకులెస్స" (80ప)
6. "కోరిదవ్వులజూడఁ గొండలునున్నచేరి దగ్గతినను జెట్లురాళ్లు"
7. "జీలువు పెరిగినమాలెకంబుముగాదు గొడ్డుబెంచినఁ బాడిగోవుగాదు
ధరబంచితంబెంత ద్రచ్చినసేయిగా దెండనూవులును నీళ్ళైవుడుగాన"

పైవిధముగ తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు నీతి సీస శతక మున రాజనీతిని, సాంఘికనీతిని బోధించి యున్నాడు. దీనినిబట్టి కవి లోకానుభవము వ్యక్తము. నీతిసీస శతకమున భగవద్భక్తియే సుఖ శాంతుల కాలవాలమని, ఇహపర సుఖములకు శరణాగతియే మూల మని పెదతిరుమలయ్య సూచించెను.

# వేంకటేశ్వరోదాహరణము

చతుర్విధ కవితలలో 'విభక్త్యధిదేవతో దాహరణములు' మధురకవితాశాఖకు చెందినవని లాక్షణికుల నిర్వచనము. 'ఉదా హరణము'ను ఈకావ్యప్రక్రియ మార్గదేశి విభేదముచేత ద్విధాప్రసిద్ధ మగు కవితాస్వరూపముయొక్క సరస సమ్మేళన రూపమగువినూత్న రచన.

కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు, "జగత్తంతయు గిరీరూ స్వరూపము. సర్వక్రియయు బరమేశ్వరునందు బర్యవసించును. ధాతువు సర్వదా విభక్త్యాశ్రయము. ఏ విభక్తికో

సంబంధములేక క్రియలేదు. అందుచేత నన్నివిభక్తులలో పరమేశ్వరుని జెప్పినపుడు సర్వక్రియాస్థాన భూతుడని వ్యంగ్యము. ఇది ఉదాహరణ కావ్యరహస్యము" అని వ్రాసిరి.

ఉదాహరణములు సప్తవిధ విభక్తులతోగూడి అర్థయుక్తిని సంపాదించుకొని అనిర్వాచ్యమగు సృష్టిరహస్యమును వాచ్యము చేయు భాషాసర్వస్వములు. సప్తసర్వముల క్రమవికాసమున కంపిత స్వరితములతోగూడి రాగభావమును గూర్చుకొని అపూర్వమగు నాద బ్రహ్మమునకాకృతిని కల్పించు సంగీత విధానములు. సప్తాధారముల నాధారము జేసికొని సాధనలో ననుభూతిని గూర్చుకొని అవ్యక్త మును వ్యక్తముసేయు యోగవిధానములు.

**ఉదహరణ లక్షణములు :**

1. ఉదాహరణము సప్తవిధ విభక్తులును, సంబోధన విభక్తిని ఉదాహరించు లఘుకృతి.

2. ఇందు వృత్తములు, కళికలు, ఉత్కళికలు, సార్వవిభక్తిక పద్యము, కవి కృత నామాంకిత పద్యములు ఉండును,

3 వృత్తములలో చంపకోత్పలములును, శార్దూల మత్తేభ ములును, ఉపయుక్తములగును. 'కళిక' యనగ మాత్రాఛందస్సు నకు సంబంధించిన రగడభేదము ఎనిమిది పాదములుగలది. 'ఉత్కళిక' అనగ కళికలో సగము (అర్థకళిక), సార్వవిభక్తికము' అనగ ఒక్క పద్యమునందే అన్నివిభక్తులు ఉదాహరింపబడినది. ఇది సాధారణ ముగ శార్దూల వృత్తములో నుండును.

4. ఉదాహరణములలో విభక్తిప్రత్యయములు వృత్తములలో సర్వత్ర భాసింప నక్కరలేదు ప్రాయికముగ నాల్గవ పాదమున గోచరించిన చాలును

కాని కళికయందు మాత్రము ప్రతిపాదాంతమున భాసించి తీరవలయును ఉత్కళిక యందిట్టి నియమములేదు. కాని దీని యందును తుది రెండు చరణాంతములందు ప్రత్యయములు విధిగ కనపట్టవలయును

5 చతుర్థి విభక్తియందు మాత్రము "ఉత్కళికలో" ప్రతి పాదాంతమునను 'కై' అను ప్రత్యయము, విభక్తి ప్రత్యయము అయినను కాకపోయినను విభక్తివలె తోపింపజేయుచు భాసించి తీర వలయును. ఇట్లు విభక్తివలె తోచియు, విభక్తి కాకుండునీ ప్రత్యయ స్వరూపమునే లాక్షణికులు "విభక్త్యాభాస"మనిరి.

6 వృతముల యనంతరము కళికల ఆరంభము, 'వెండియు' 'మఱియు' అనువానితో సంధింపబడుచుండవలెను.

ఉదాహరణములతో చంపక, ఉత్పల, శార్దూలమత్తేభములు తప్ప తక్కిన పద్యజాతులేవియు ఉపయుక్తములు కారాదు. కళి కోత్కళికల యందు రగడ విభేధములగు ఎనిమిదింటిలో ఏదేని వైవి ధ్యము నపేక్షించి ప్రయుక్తము కావచ్చును.

ఉదాహరణము, శ్రీకారముతో ప్రారంభింపబడి సంబోధనతో గూడి ఎనిమిది విభక్తులకు 24, ఒక సార్వ విభక్తికము, అంకితాంక వృత్తములతో గూడి మొత్తము 26 పద్యములతో నుండును.

ఉదాహరణ వాఙ్మయశాఖలో తెలుగున తెలియవచ్చిన తొలి ఉదాహరణము పాల్కురికి సోమనాథుని (13వ శతా।) 'బసవో దాహరము" బసవోదాహరణమున పై వివరించిన లక్షణములు కానరాకున్నవి. త్రిపురాంతకోదాహరణమున కూడ కొన్ని లక్షణ ములు లేవు.

ఉదాహరణ లక్షణములను వివరించిన వారిలో తెలుగున విన్న కోట పెద్దన్న, సంస్కృతమున గౌరన ప్రథములైనవారు. వీరినిబట్టి విభక్తుల మారుపేరులు, విభక్త్యధి దేవతలను గూర్చి క్రింది విధ ముగ గలదు.

| విభక్తి | నామాంతరము | అధిదేవత |
|---|---|---|
| ప్రథమ | వాణి | వీరావళి |
| ద్వితీయ | ఝుట | కీర్తిమతి |
| తృతీయ | కీర్తి | సుభగ |
| చతుర్థి | దేవలాభిని | భోగమాలిని |

| | | |
|---|---|---|
| పంచమి | పాణి | కళావతి |
| షష్ఠి | దోటి | కాంతిమణి |
| సప్తమి | ఘోటకా | కమల |
| సంబోధన | సరసావళీ | జయవతి |

వెన్నకోట పెద్దన్న, గౌరన చెప్పినట్లు, 1435 ప్రాంతము వాడగు అనంతడు మాత్రము అంకితాంక పద్యమును గూర్చి ప్రస్తావించలేదు.

## శ్రీ వేంకటేశ్వరోదాహరణము :

తాళ్ళపాక పెదతిరుమలచార్యుడు రచించిన శ్రీ వేంకటేశ్వరోదాహరణము లభ్యమగు ఆంధ్రోదాహరణములలో మూడవది ముఖ్యమైనది ఇది శ్రీ వేంకటేశ్వరున కంకితమై పరమార్థ బోధనము గావించు భక్తిమయ రచన.

ఇందు పెదతిరుమలయ్య శ్రీ వేంకటేశ్వరుని అవతారములను, ఆ అవతారముల మహాత్మ్యమును వర్ణించియున్నాడు.

శ్రీ కరుణాకరుండగుచు జీవుల బ్రోచి కొనుచు, లోకములను మనిపి కర్తయై, మునులచేత, దేవతలచేత, సర్వలోకములచేత పొగడబడుచున్న బ్రహ్మాతండ్రియైన శ్రీ వేంకటేశ్వరుడే పరబ్రహ్మమని పెద తిరుమలయ్య వేంకటేశ్వరుని మహిమను స్తుతించెను.

దురిత విరహిత గురుడు, వేదపు శరధియైనటువంటి, సముద్రమును చిలుకగ వచ్చిన అమృతమును సురలకు పంచినటువంటి శ్రీకృష్ణుని మహాత్మ్యము వర్ణితము.

శ్రీ కృష్ణుని బాల్యక్రీడలు, ఆతడు కావించిన ఘనకార్యములు వర్ణితములు నరసింహమూర్తి అవతారముతో హిరణ్యకశిపుని తునిమిన విధము, ద్రౌపది మానము కాపాడిన విధము, అహల్యను బ్రోచిన విధము, త్రిపుర సంహార కాలమున శివునకు విష్ణువు బాణాగ్రముగ నుండిన విధము వేంకటేశ్వరోదాహరణమున వర్ణితము.

భావజుని తండ్రియైన వానిని, జలరాలో వట పత్రశయ్యపై

పరుండిన వానిని, వేంకటమను పర్వతమున విహరించు వానిని, ఉర మున సిరిని గల్గిన వానిని పెదతిరుమలయ్య స్తుతించెను.

కృష్ణుడు శకటాసురుని చంపినవిధము, మద్ది మాలకుల రూప మున నున్న రాక్షసుల కూల్చిన విధము, వృషభాసురుని కూల్చిన విధము, పూతనను చంపిన విధమును పెదతిరుమలయ్య వివరించెను.

'కుంతి తనుజునను బండి నుండు మాధవునకు' "సోమధామ నూత్న రత్నసుకరమకరకుండులునకు", "కుబ్జకు అందమిచ్చి చక్క-చేసిన భాధవునకు, "భోజరాజు పుత్రిమైత్రి బొదలి మెదలు శ్రీ కరు నకు పెదతిరుమలయ్య మ్రొక్కులర్పించుకొనెను

పదారువేల స్త్రీలను పెండ్లియాడియు, అస్ఖలత బ్రహ్మచారిగ పేరుపొందిన వేంకటేశ్వరుని యందు మనసు నిల్పి తరించెను, పెద తిరుమలయ్య.

వేదములకు ఆధారమైన వానిని, విభీషణుని కాపాడిన వానిని, జనక మహారాజునకు అల్లునైన వానిని, మారీచుని తుంచిన వానిని, యమునా నదిని నాగేటి గదియించి చించిన (బలరాముని) వానిని పొగడగ కీలికి, శూలికి, తమ్మిచూలికి తరముగాదని కవి ఈ ఉదా హారణమున వివరించెను.

పెదతిరుమలయ్య, భక్తవరదులైన శ్రీ వేంకటేశ్వరుని సర్వ విధముల సన్నుతించి, తన ఉదాహారణమును 'చక్రనందక గదాంబుజ ధారికి, శ్రీ వధూమనోహారికి, వేంకటాచల విహారికి శౌరికి' అంకిత ముగ రచించెను.

వేంకటేశ్వరోదాహారణము నందలి రచనా ప్రణాళికను క్రింది విధముగ వివరించడమైనది

| విభక్తి | వృత్తము | కళిక | ఉత్కళిక |
|---|---|---|---|
| 1. ప్రథమ | ఉత్పలమాల | వృషభగతిరగడ | హరిణగతిరగడ |
| 2. ద్వితీయ | ,, | ద్విరదగతిరగడ | (ఇందుసగణము) |
| 3. తృతీయ | ,, | హయప్రచారరగడ (తురగవల్గనము) | (ఇందుసగము) |

4. చతుర్థి ,, హరిగతి రగడ మధురగతి రగడ
5. పంచమి - ఉత్పలమాల - ద్విరదగతిరగడ - (ఇందుసగము)
6. షష్ఠి - ,, - హయప్రచారరగడ - (ఇందుసగము)
7. సప్తమీ - ,, - ద్విరదగతిరగడకు సమీపమగు ఛందము - (ఇందుసగము)
8. సంబోధన - ,, - ద్విరదగతిరగడ - (ఇందుసగము)
9. సార్వవిభక్తికము - శార్దూలము
10. అంకితాంకపద్యము - ఉత్పలమాల.

పైలక్షణ నివృత్తినిబట్టి ఇది సర్వ లక్షణ లక్షితమైనదని చెప్ప నగును. ఇందలి వృత్తము ఇట్లు గలవు.

ప్రథమ :

"శ్రీకరుణా కరుండగుచు జీవుల శీవుల బ్రోచి కాచుచుం
గైకొని లోకముల్ మనిపి కర్తయు భర్తయునై మునుల్ సురా
నీకము లోకముం బొగడ నీరజ జాతుని తాతయైన సు
శ్లోకుడు వేంకటేశ్వరుడు చూడగ నొప్పెడు బ్రహ్మమింతకున్"

ద్వితీయ :

"ఏటికి వేల్పులార చదలేటికి బోయెద రిందురండు కో
నేటికి వచ్చు దీర్ఘచయమే బదిలక్షలతోడ గూడుము
క్కోటియునంచు బల్కు మని కోటుల మాటల నేర్చి కీరముల్
చాటు తటాట విన్నటన సల్పెడు వేంకట భర్త గొల్చెదన్"

తృతీయ :

"తీరు నఘంబులెల్ల నిలుం దీర్థము వచ్చినయంత సంపదల్
మీఱు సుఖంబు గూరు మతి మిక్కుటమై శ్రుతి వీధిదూఱువే
నూఱులు జెప్పనేల సుమనో విభుచేదిరు వేంకటేశు చే
జూఱలుగా వరంబులిలం జొప్పడ గొందమురండు మానవుల్"

చతుర్థి :

"భావజు తండ్రియై కుసుమబాణుని మామ మతిందిరైచకో
రావలి మిత్రిగన్న తన యల్లుడునై జలరాశి నాత్మమా

యావట పత్రిశయ్య నఖిలాబ్జ భవాండపు గ్రుడ్లు బెట్టు నం
చై విలసిల్లు వేంకట విహారునకై నుతులే నొనర్చెదన్''

పంచమి :

''కొండల వంటి సంపదలు కొంకని వేగమె చాగమిచ్చుచో
గండర గండడై పసిడి కంబమునం బడగెత్తి యుల్ల స
త్కుండల మండలాధిపతి గోప్రవిచిత్ర నివాస సౌఖ్యమున్
దండిగ గాంచు వేల్పు వలనన్ సుఖమందెద మెల్ల కాలమున్

షష్ఠి :

''మానిసి దిండ్ల మొత్తు నెఱమంటల పిల్లల కత్తి వేల్పు పెన్
బోనపుముద్ద నిద్దముల పోల్పు నొలంగెడు సంకు గల్గు నె
వ్వానికి వానికి న్నత భవానికి వేంకట శైలశృంగ స
న్మానికి భక్త సంపదభిమానికి నే శరణంచు మ్రొక్కెదన్''

సప్తమీ :

''కోరిరి పదాఱువేలయిన కొమ్మల నెమ్మది, బెండ్లియాడియున్
ధారుణి బ్రహ్మచారినని తప్పక పల్కి పరీక్షితున్ మహో
దారత బ్రాణమెత్తుచు బ్రతాపము మీఱగ బ్రోచు మోహనా
కారుని యందు వేంకట శిఖామణియందు మనంబు నిల్పెదన్''

సంబోధన :

''వాలిన నీ ప్రభావములు వర్ణన సేయగరావు కీలికిన్
శూలికిదమ్మిచూలికిని పోలికి నున్న సురాలికిం బ్రభా
మాలికి నాకు నెన్న వసమా యసమాన గుణాఢ్య ధన్యగో
పాలక బాలగా నిగమ భాషణ కీలక వేంకటేశ్వరా''

సార్వ విభక్తికము :

''నీ వీశుండవు నిన్ను గొల్తువరముల్ నీ చేతగై కొందు నే
నై వారంబొనరింతు నీకొఱకు సంకల్పింప నీడేఱె మ
త్సేవల్ నీ వలనన్ మహాయశము నిల్చెన్ నీకు నీయందుల
క్ష్మీవాల్లభ్యము గంటి భక్తవరదా శ్రీవేంకటేశ్వరా''

ఈ ఉదాహరణమున చతుర్థీ విభక్తికి వైశిష్ట్యమున్నది.

చతుర్థీ ఉత్కళికయందు 'కై' అను ప్రత్యయము విభక్తిరూపము నను, తదాభాసరూపముననుు, చరణాంతము లన్నిటను లక్షణాను సారము పాటింపబడియున్నది.

"ధారుణి భార నివారణ కలకై, ఘోరవిహార విచారమవెడికై
తవమున జవమున బివిరి తిరుగుకై। దువ్వుగాని వివిధసవిధదానవకై
కసరుధిర సలిలమొసగ విసరికై।వసముగ సురవిసరము నేలినకై
లాసనివాస సతీవంద్యునకై। హాస సమున్నత బుధసంద్యునకై"

సార్వవిభక్తిక పద్యమున, "కైవారంబొనరింతు నీకొఱకు సంకల్పింప నీడేఅ అను పట్టున 'చతుర్థికి' కొఱకును కవిప్రయోగించెను కాని శ్రీ నిడదవోలువారు, ఉదాహరణ వాఙ్మయమున 'కొఱకు'ను గురించి వివరించుచు "ఇది ఉదాహరణముల యందెంత మాత్రము నుపయుక్తము కాలేదు" అని వ్రాసిరి. కాని పెద తిరుమలయ్య వేంకటేశ్వరోదాహరణమున గలదు.

# సుదర్శన రగడ

ఆశు, మధుర, చిత్ర, విస్తరములను చతుర్విధ కవితలలో 'రగడభేదంబులును, దండక వృత్తంబులును చిత్రకవిత్వంబునకు చెందినవిగ లాక్షణికులు వచించిరి ఈ రగడలే ఉదాహరణ ప్రబంధ ములందు ప్రయుక్తములై మధుర కవితాశాఖకు చెందుచున్నవి. ఇట్లు, చిత్రి, మధుర కవితాశాఖలకు చెందినవిగ పేర్కొనబడిన దేశీయమగు ఈరగడ ఛందము మిక్కిలి ప్రాచీనము ఆంధ్ర, కర్ణాటకములందీ ఛందమునకు విశేషప్రచారమున్నది. సంస్కృతము నందీ రగడకు ప్రచారములేదు.

రాజరాజనరేంద్రుని కోరుమిల్లి శాసనమందీ రగడ ఛంద మున్నట్లుగ శ్రీనిడదవోలువారు వ్రాసియున్నారు. నన్నయ్య, తిక్కన, ఎఱ్ఱనాదులెవరు దీనిని ప్రయోగించినట్లు తెలియరాలేదు. నన్నెచోడుడు మాత్రము తన కుమారసంభవమున రగడరచనకు రూపాంతరమగు క్రౌంచపదమను వృత్తమును వాడియున్నాడు.

తెలుగునకు తొలిలక్షణ గ్రంథమగు కవిజనాశ్రయమున గూడ రగడకు లక్షణములేదు. రగడను ఒక కావ్య ప్రక్రియగ పరిగ్రహించి తరువాతి కవులకు దారిచూపిన ఖ్యాతి వీరశైవులకే దక్కినది. దానిని పరిపోషించినకీర్తి వైష్ణవులకే దక్కినది.

తెలుగున రగడలు ప్రత్యేకముగ పంచలకొలది చరణములతో నుండును. పాల్కురికి సోమన రగడలు, వైష్ణవుడైన చక్రపాణిరంగన శైవుడిగమారి చెప్పిన 'నయనరగడ' 'నమశ్శివాయరగడలు' ఇట్టివే. తరువాత వచనసంకీర్తన కర్తమైన కృష్ణమాచార్యుని 'రామనామములు, నృసింహనామములు' అనురెండు రగడకృతులు గలవు. తర్వాత తెలుగున రగడకు ప్రచారము హెచ్చినది.

క్రీ. శ. 1402 ప్రాంతమున విన్నకోట పెద్దన రగడను గూర్చి సంగ్రహముగ పేర్కొనినను, 1435 ప్రాంతములందు అనంతుడు మాత్రము తన ఛందోగ్రంథమున అష్టవిధములగు రగడభేదముల లక్షణములను విపులముగ చర్చించెను. విన్నకోట పెద్దన-కావ్యాలంకారా చూడామణి - రగడలక్షణము :-

"సరియగా పదిరేకులచే
బరువడి నుత్సాహవృత్త పదయుగళముచే
నిరవుగ వడి ప్రాసంబుల
నరుదుగ రచియింప రగడయగుఁ దగువృత్తిన్" (4-40)

అనంతుని రగడ లక్షణము :-

"ఆద్యంత ప్రాసంబులు
హృద్యంబుగ రెంట రెంట నిడిపాదములు
ద్వ్యద్యతుల గూర్పదగు నన
పద్యంబుగ రగడలందు వారిజనాభా"

అనంతుడు పేర్కొనిన రగడ భేదములిట్లుగలవు :-

1. హయప్రచార రగడ (తురగవల్గన) 2. విజయమంగళ రగడ, 3. ద్విరదగతి రగడ 4 జయభద్రరగడ 5. మధురగతి రగడ, 6. హరిగతి రగడ 7. హరిణగతిరగడ 8. వృషభగతి రగడ.

అప్పకవి రగడలక్షణములచెప్పి, నవవిధరగడలను పేర్కొనెను.

1. హయప్రచారము - 'ఋతువిరామమినులు నల్వురతుక నొక్క యంఘ్రి చెల్వు'
2. తురగవల్గనము - 'హయప్రచారమినుమడించి'
3. విజయమంగళము- 'తురగవల్గనంబు రెండితోడ విజయమంగళంబు'
4. ద్విరదగతి - 'కర మొప్పుపంచలఘుగణ చతుష్టయముచే'
5. విజయభద్రము - 'ద్విరదగతి రెట్టింప విజయభద్రముచెల్లును'
6. మధురగతి - 'నాలుగుమాత్రలు నాటినగణములు, నాలుగురెంటికి నలివిరమణములు.
7. హరిగతి - 'నలసగగగములలోపల నేవైనను నెనిమిది నాల్గింటిపై విరమము'
8. హరిణగతి - 'నరహరిపదియు నాలుగులములు'
9. వృషభగతి - 'ఇరువదియెనిమిది లఘువులు, పదియేనిట విశ్రాంతియు గూర్చిన' (మూ. అప్పకవీ. 4-447-489)

కస్తూరిరంగ కవి తన తనరంగ రాట్ఛందస్సులో గాన యోగ్యములగు నీరగడలకు రాగతాళముల నిర్దేశముతో సంగీత లక్షణముగూడ విపులీకరించెను క్రీ. శ. 15వ శతాబ్ది ప్రారంభము నుండి శ్రీనాథాది తెలుగుకవులు పలువురు తమతమ కావ్యములలో గేయరచనా విన్యాసమునకు అనువుగూర్చు సన్నివేశములందీ తీరు రగడలను లెక్కకు మిక్కిలి రచించినారు. వారు కీర్తనమునకు రగడను వాడిరి తరువాతి ప్రబంధకవులు అందలి గానాంశమును పురస్కరించుకొని విలాసవతులు వేడుకలతో విహరించుపుష్పాపచయ సందర్భములందు రగడలనుపయోగించిరి

పదునారవశతాబ్దిలో తాళ్ళపాక కవులుగూడ కృష్ణమాచార్యాదులవలెనే దివ్యవిషయములను కీర్తించు పట్టున రగడలనే ప్రయోగించిరి.

సుదర్శన రగడ :

ఇది పెదతిరుమలాచార్యునిచే రచింపబడినది. ఈ సుదర్శన

రగడ అనంతుడు పేర్కొనిన రగడ విభేదములలో మధురగతి రగడకు చెందినది.

సుదర్శన రగడయందు 59 రగడలు, అనగ 108 పంక్తులున్నవి. ఈకృతి ఓంకారముతో ఆరంభమై 'శ్రీవేంకటపతిచేతిది చక్రము' అని అంతమగుచున్నది. ప్రతిచరణాంతిమున చక్రము అను పదమే అంత్యప్రాసముగ పునఃపునరావృత్తమై సుదర్శన చక్రమాహాత్మ్యమును ఈ సుదర్శనరగడ ఉగ్గడించుచున్నది

"ఓంకారాక్షరయుక్తము చక్రము
సాంకమధ్య వలయాంతర చక్రము
సర్వఫలప్రద సహజము చక్రము
పూర్వకోణ సంపూర్ణము చక్రము
కఠిన పవినికర కల్పిత చక్రము
శఠమత ఖండన చతురము చక్రము
చండమారుత వి సారిత చక్రము
కుండలీకముఖ ఘోషిత చక్రము
విస్ఫులింగ చయ విభ్రమ చక్రము
సాస్ఫాలిత భుజ హారము చక్రము
రోదసినిబిడ సురోచిశ్చక్రము
వేదరాశిచణ వేల్లిత చక్రము
మధ్వావాద తిమిరహర చక్రము
తధ్యామృత సంతర్పిత చక్రము
అంబర నరసింహాక్షర చక్రము
సాంబుజాక్ష పాశాంకుశ చక్రము
భావించు సుజన పాలన చక్రము
శ్రీవేంకటపతి చేతిది చక్రము"

శ్రీమహావిష్ణువుయొక్క పంచాయుధములలో ప్రశస్తమగు ఈ సుదర్శన చక్రము యొక్క మహిమ హరివంశ, భాగవత పురాణములందు వర్ణింపబడినట్లే సుదర్శనరగడ యందు వర్ణింపబడియున్నది.

నాచనసోమన ఉత్తరహరివంశమున, (3-149),

"సతతంబున్నతియింతు జంతుమయ సంసార క్రియారక్షణా
క్షత శౌర్యక్షు పితారి పక్షమగుటన్ సంగ్రామ భీమ భ్రమా
గతగేహాంతిక దీర్ఘ కాతటలుకత్కంఠచ్చిదాచ్ఛాదన
క్షతజక్షాళిత కేలితామరస రక్షశ్చక్రమున్ జక్రమున్" అనిగలదు

పోతన భాగవతమున (8 109) ఇట్లు స్తుతించెను.

"కరుణాసింధుడు శౌరి వారిచరమున్ ఖండింపగా బంపె స
త్వరితా కంపిత భూమి చక్రము మహోద్యద్విస్ఫులింగచ్ఛటా
పరిభూతాంబర శుక్రమున్ బహువిధ బ్రహ్మాండచ్ఛటాం
తర నిర్వక్రము బాలితాఖిల సుధాంధశ్చక్రముం జక్రమున్"

"ఏనమస్కరింతు నింద్రశాత్ర వధూమ
కేతువునకు ధర్మసేతువునకు
విమల రూపమునకును విశ్వదీపమునకు
జక్రమునకు గుప్తశక్రమునకు (9-135)

శ్రీకృష్ణదేవరాయులు ఆముక్తమాల్యదయందు (1-9)

"అడరుగళాగ్రపధారలు మహాముఖవాంత సుధాంబు ధారలు
న్పొడవగు వహ్నికీలములు పొంగునుగాఁ బెఱదైత్యకోటికి
న్వెడిదవుఁగిన్కతో నెసరువెట్టిన పెద్దపనంటివోలె నె
క్కుడు వెసరాహుమస్తకముగొన్న సుదర్శనదేవుఁగొల్చెదన్"

అని స్తుతించి యుండుట గలదు.

ఇక తాళ్ళపాక అన్నమాచార్యుడు తన సంకీర్తనములందు పలుతావుల సుదర్శన చక్రమును స్తుతించియుండుట గలదు."

చక్రమా హరిచక్రమా వక్రమైన దనుజుల వక్కలించవో"(5-125)

"వెడలెవెడలెనదె వీధుల వీధుల-తోడికి దైత్యులనుదుంచగను 7-281

"మొక్కెదమిదిగో మూడుమూర్తులను-వొక్కరూపమై వొనరె
చక్రము" (7-282)

అన్నమయ్య సంకీర్తనము నందున్నవిధముననే సుదర్శనరగడ యందును వర్ణితము.

"నమోనమో దానవవినాశ చక్రమా సమర విజయమైన సర్వేశు
చక్రమా
అట్టె పదారు భుజాల నమరిన చక్రమా-పట్టిన ఆయుధముల బలు
చక్రమా
నెట్టిన మూడు గన్నుల నిలిచిన చక్రిమా-అట్టుగా మన్నించవే
మెఱయుచు చక్రమా
అరయనారు గోణాల నమరిన చక్రమా-ధారలు వేయుట తోడితగు
చక్రమా
ఆరకమీదికి వెళ్ళె అగ్నిశిఖల చక్రమా-గారవాననీ దాసులగావవే
చక్రమా
రవిచంద్ర కోటి తేజోరాశియైన చక్రిమా-దివిజ సేవితమైన దివ్య
చక్రమా
తవిలి శ్రీ వేంకటేశు దక్షిణకర చక్రమా - ఇలనీదాసులము
యేలుకోవె చక్రమా
(అన్నమా-8-282)

పై విధముగనే పెదతిరుమలయ్య తన సుదర్శన రగడ యందు
'షోడశభుజ సంశోభిత చక్రిము
బాహుబసహస్ర బంధుర చక్రిము (పుట 66)
'మొగి మూడు వలయములు గల చక్రిము" (68 పు)
'షట్కోణాంత విశాలపు చక్రిము' (64 పు)
'వేయంచులు గల విశ్వపు చక్రిము' (68 పు)
'శ్రీ వేంకటేశపతిచే తిది చక్రము" (68 పు)

సుదర్శనస్వామి (చక్రత్తాళ్వారు) మూలమూర్తి తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయమున పెరియగోపురము (గాలి గోపురము) సమీపమున గల ఒక మంటపము నందలి రెండవఅంతస్థున ప్రతిష్ఠాపితమై యుండినట్లు తిరుపతి శాసనములనుబట్టి తెలియుచున్నది (చూ॥ సంఖ్యలు-22, 154, 192-G.T. మరియు 249-T.T.)

చక్రత్తాళ్వారుల ఉత్సవమూర్తి బ్రహ్మోత్సవ సమయము లందు తొమ్మిదవ రోజున అవభృథ స్నానార్థమై ఆళ్వార్ తీర్థము

(తిరుపతిలో కొంచ దిగువ నున్న ఆళ్వారు తీర్థము) నకు తీసికొని పోబడుచుండెడిది. సుదర్శనస్వామి జన్మ నక్షత్రము కృత్తికయని కూడ తిరుపతి శాసనములను బట్టి తెలియచున్నది ఆ నక్షత్రమున చక్రత్తా ళ్వారునకు పూజలు గూడ జరుగుచుండెను. ఉత్సవములందు చక్రత్తా ళ్వారుల తిరుమంజనమునకు, తిరుమంజన వేళలందు తూప్పిల్ పిళ్ళ రచించిన కయ్యార్ చక్రం శ్లోకముల పఠనమునకు తాళ్ళపాకవారు చాల ఏర్పాట్లు గావించిరి (నా॥ సం. 153-తి. తి. దే. శాసన సం. 5. క్రీ. శ. 1554 - సం. 159_తి. తి. దే. శా. సం. 5 క్రీ. శ. 1558) తూప్పిల్ పిళ్ళ రచించిన శ్లోకములను తిరుమంజన వేళలందు పఠించు టకై 6 సువర్ణరేఖల జీతముతో పొత్తపి వెంగళయ్య అనువారిని తాళ్ళపాక చిన తిరుమలయ్యగారి కుమారుడు తిరువెంగళనాథయ్య క్రీ. శ. 1554లో ఏర్పాటు చేసినట్లు పై శాసనములనుబట్టి తెలియ చున్నది.

పై పరిశీలనమును బట్టి తాళ్ళపాకవారు సుదర్శన చక్రోపాస కులనియు. సుదర్శన స్వామికి ఆలయములను నిర్మించినారనియు, సుదర్శనస్తుతికి తిరుమంజన వేళలందు ఏర్పాట్లు గావించినారనియు తెలియుచున్నది.

# శ్రీ వేంకటేశ్వర ప్రభాతస్తవము

శ్రీ వేంకటేశ్వర ప్రభాత స్తవమును పెద తిరుమలయ్య రచించెను. ఇందు మొత్తము 63 ద్విపదలున్నవి.

'శ్రీ గురుమూర్తితో శేషాద్రియందు
యోగనిద్రాల కేళినున్న యత్తరిని
వనజాసనాది దేవతలేగుదెంచి"

వినుతించిన విధమున వర్ణితమై, శ్రీ వేంకటేశ్వర స్వామివారికి సుప్రభాతపు మేలు కొలుపుగ ఈ రచన సాగినది. ఇందు ప్రతి ద్విపదాంతమున 'మేల్కనుము' అను ప్రబోధవాక్యము చర్వణమగుచుండును

"వసుదేవ దేవకీ వరగర్భజాత
కిసలయాధర రామకృష్ణ మేల్కనుము
తపము పెంపున యశోదానందములకును
కృపతోడ శిశువైన కృష్ణ మేల్కనుము"

అను విధముగ శ్రీకృష్ణుని జీవిత విశేషములు వర్ణితములైనవి. ఈ అంశములను చిన్నన్న తన అష్టమహిషీ కళ్యాణమున గూడ వర్ణించెను.

మేల్కొలుపు అయిన పిమ్మట, '(శ్రీ)వేంకటాచల శిఖరమధ్యమున సౌవర్ణ మణిమయ సౌధంబులోన.. జనులకెల్ల మహాప్రసాదంబులొనర, గోరిన వారికి గోర్కు తాడేరజగములు నేలుచుండు" స్వామి మేల్కని, "కలిదమ్మి కన్నుగొనల నమృతంబు గురియ కరుణాకటాక్ష వీక్షణము" గావించుటయు, లోకమానంద భరితమగుటయు వర్ణితము.

సుప్రభాతసవ రూపమునగల రచనలు ఇట్టివి, ద్రావిడ, సంస్కృత భాషలందు పెదతిరుమలయ్యకు పూర్వమే కొన్ని గలవు. తొండరడిప్పొడి ఆళ్వారు (విప్రనారాయణ) విన్నవించిన "తిరుప్పళ్ళి యళుచ్చి" గూడ యిట్టి రచనయే. "తిరుప్పళ్ళియళుచ్చి" పది పాశురములుగలది చిన్నన్న తన పరమయోగి విలాసమునందు విప్రనారాయణుని చరితమున పేర్కొనిన ప్రాబోధకీస్తుతి ఇదియే.

ఇట్టిదియే ప్రతివాద భయంకర అణ్ణన్ అనువారు రచించినదిగ ప్రసిద్ధిగాంచిన "(శ్రీ)వేంకటేశ సుప్రభాతమును' సంస్కృత రచన. ఈ రెండింటిని ఆధారము జేసికొనియే పెదతిరుమలయ్య ఈ ద్విపదను రచించెను.

ద్రావిడ వేదపారాయణమును "సాత్తుమొఱై' అందురు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయమున ఈ 'శాత్తుమొఱై'ని గూర్చిన శాసన ప్రస్తావన తొలుత 1476లోనే కానవగుచున్నది. అంతకు పూర్వమీ సంప్రదాయమచట లేదని తలపవచ్చును అప్పుడుగూడ ఈ పారాయణము "ఉడయవరుల సన్నిధినే గాని గర్భగుడిలో మాత్రము లేదు. (చూ॥ History of Tirupathi page 326, by T. K. T. Veera Raghavachari - 1953)

"ప్రాబోధకీ స్తవము ననుసరించి సంస్కృతమున వ్రాయబడిన సుప్రభాతరచన 15వ శతాబ్ది ప్రారంభమునుండి తిరుమల దేవాలయమున గానముచేయబడు చున్నదేమో"నని డా॥ వేటూరి ఆనంద మూర్తిగారు తమ సిద్ధాంతగ్రంథమైన తాళ్ళపాక కవులకృతులు వివిధ సాహితీ ప్రక్రియలు" అనిదాని యందు చెప్పిరి (171ప) ఈ సంస్కృత సుప్రభాతమును తాళ్ళపాకవారు అభిమానించి యుందురు. కనుకనే తాళ్ళపాకఅన్నమయ్య, పెదతిరుమలయ్య సుప్రభాతసంకీర్తనములను అనేకములను రచించి తాము స్వామి ఆలయమున పాడి, పాడించినారు (చూ॥ తాళ్ళపాకవారి సంకీర్తనములు 2-224, 2-400 2-403, 5 81, 7-202, 9-254- మొదలగునవి)

"మేలుకోశృంగారరాయ మేటి మదనగోపాల మేలుకో నాపాల
ముంచిన నిధానమా
సందడిచే గోపికల జవ్వనములోన కందువందిరిగేమదగజవు
యిందుముఖి సత్యభామ హృదయ పద్మములోని గంధము మరిగనట్టి
గండుతుమ్మెదా
గతిగూడి రుక్మిణి కౌగిట పంజరములోరతిముద్దు గురిసేటి రాచిలుకా
సతులు పదారువేలజంట కన్నుల కలువలకితవై పొడమిననాయిందు
బింబమా

(అన్నమాచార్యుని సంకీర్తనము 2-224)

పై అన్నమాచార్యరచనను పోలినదే శ్రీవేంకటేశ్వరప్రభాత స్తవమునగూడ పరికింపవచ్చును (పుట-83)

"సదమలానంద నిశ్చయములకంద
విదురుని వింద గోవింద మేల్కనుము
భోబకన్యాముఖాంభోజ ద్విరేఫ
రాజీవ నయనాభిరామ మేల్కనుము
నారరూపవతి జాంబవతి తోడిరతుల
నిరతిమైనోలాడు నిపుణ మేల్కనుము
మంజుల సత్యభామా మనస్సంగ
రంజితగాత్ర సంరంభ మేల్కనుము"

పెదతిరుమలాచార్యుని శ్రీవేంకటేశ్వర ప్రభాత స్తవము, శ్రీవేంకటేశ్వర వచనములు (తి తి.దే. ముద్రణ 1945 (పుట81-86) నందు ప్రకటింపబడినది.

"శ్రీవేంకటేశ్వర వచనములు ముద్రణము సాగుచుండగా రాజకీయ ప్రాచ్య లిఖిత పుస్తకశాలలో నీప్రభాత స్తవమును గుర్తించి ఏకకవి కృతియని యిందు దీనినిగూడ ప్రకటించితిని" అని శ్రీవేటూరి ప్రభాకర శాస్త్రిగారు చెప్పిరి.

ఈకృతి తాళ్ళపాక పెదతిరుమలాచార్యునకు శ్రీవేంకటేశ్వరుని పైగల భక్తిప్రపత్తులను వెల్లడిచేయు చున్నదన వచ్చును.

# రేఫ అకార నిర్ణయము

'రేఫ అకారనిర్ణయము'నకు "కృష్ణశతకమ"ని పేరు. ఇది పెద తిరుమలయ్య రచన 'కృష్ణా' అను మకుటముతో 108 పద్యములతో నున్నది. ఇందు 107 కంద పద్యములు, చివరి పద్యము తేటగీతి.

తెలుగు భాషలో నున్న సాధురేఫ, శకటరేఫములను గూర్చిన వివరణము, పూర్వకవుల ప్రయోగముల ననుసరించి పదముల పట్టికతో సహా అక్షరవర్ణక్రమమున నీయబడినది ఇది శ్రీ వేంకటేశ్వరున కంకితము. తెలుగు లాక్షణికులలో యిట్టి నిర్ణయము చేసినవారిలో పెదతిరుమలయ్యయే మొదటి వాడనవచ్చును.

ఈతని విడప అప్పకవి, కూచిమంచి తిమ్మకవి, బద్దెపూడి భద్రన (రేఫఱకార శబ్దముల పద్యములు), గణపవరపు వేంకటకవి (రేఫ నిర్ణయతారావళి), ఓగిరాల రంగనాధకవి (ద్విరేఫ వర్ణదర్పణము), భరతము లక్ష్మిపతి (శకటరేఫ నిర్ణయము), అడిదము సూరకవి (కవిసంశయ విచ్ఛేదము, రెండవ భాగము) మొదలగువారు లక్షణ గ్రంథములను రచించిరి.

అప్పకవి తన అప్పకవీయమున, రేఫఱకార సీసమాలికలలో పెద తిరుమలయ్యను ప్రత్యేకముగ పేర్కొనెను (2_198)

పెదతిరుమలయ్య తన గ్రంథాంతమున,

"క్షీరనీర విభేదంబు చేసినట్లు
ధరణి రేఫ అకారముల్ తఱ్ఱపాళ
తిరుమలార్యుండు పేర్చెర దేటపరచె
నుచితమిదిగాదె పరమహంసోత్తమునకు"

అని చెప్పుకొనెను తన రచనయే పరిపూర్ణమని చెప్పక, "మతి కలిగెనేని దెలియుడు, తఱచెందును లేవుకృతుల దలపగ కృష్ణా" అని వినయమును ప్రకటించెను.

రేఫ అకార ప్రయోగములు విడివిడిగా అచ్చులు హల్లులు వరుసన (2ప), కూర్చబడి యుండుటవలన, ఈ రచనయే మొదటి దగుచేతను ఈ గ్రంథము ప్రామాణికముగ నున్నది.

"పెదతిరుమలయ్య" ఇల ఘోషాక్షరములపై......తలపగ సంస్కృత పదముల.. (4ప) అను పద్యము, శ్రీవజ్ఝలవారు 'వైయాకరణ పారిజాతము' నందు (పుటలు 399-400) సంస్కారము నపేక్షించుచున్నదని చెప్పిరి. వారి ప్రకారము, 'ఇలభాషాక్షరములపై ...తలపగ సంస్కృత భవముల 'అని ఉండదగుననియు, పెదతిరుమలాచార్యుడు," క్రియాపదాంతంబుల ప్రసక్తిని దెచ్చి వివరించిన తీరును బట్టి యాతడు "క్రియాంతేచాన్య పర్ణేచలఘురేఫా: ప్రకీర్తితాః ! ద్వివిధాదిదుతశ్చస్యురయ వాచక గీతథా" ఇత్యాదిగ నున్న అధర్వణ కారికల ననుసరించి యుండునను" శ్రీ వజ్ఝలవారు వ్రాసి యున్నారని దివి॥ వేటూరి ఆనందమూర్తిగారు తన సిద్ధాంత వ్యాసమున తెల్పిరి.

## లఘురేఫలుగల పదముల పట్టిక :

అరి, అరిగె, అరదము, అరయు, అరగన్ను, అరిది, అరవాయి, అరగలి, అరసి, అరు, ఆరెండు, ఆరంగాగినపాలు, ఆరంగూరె, ఆరెకులు, ఆరాటము, ఆరయు.

ఇర, ఇరువుకు, ఇరువది, ఇరవు, ఇరవారంగా, ఇరుగెలకులు,
ఈరికలు, ఈరసము, ఈరెలుగు, ఈరె, ఈరు, ఈరేడు,

24448
అన్నమయ్య అ...
99 అన్నమయ్యవీధి. గుంటూరు-

ఉసులు, ఉసులఁద్రోయు, ఉరవరి ఉరవణించు, ఉరియగ, ఉరియాడుట, ఉసుళింప,

ఊరక, ఊరార్చుట, ఊసు, ఊరట,

ఎరగతి, ఎరియు, ఎరగా, ఎరువు, ఏరికి, ఒరులు, ఒరయు, ఒరసిన, ఒల్లంబోయిరి, ఒండొరులు, ఒక్కరుడు,

ఓరసేయు, ఓరలేక, ఓరీ, ఔరా,

కరము, కరణి, కరువు, కరగు, కరిసనము, కోరు, కూరు, కోరిక, కూరిమి, కూతురు, కోర, అమ్మలకూరంగా, కురిసినురానలు కారించుట, కారాకులు, కారుకొన మొగులు, శత్రులు, కారు, కరువలి, కారుల, కరమొప్పగ, తొల్కరివానలు, కెరలి, కరకరకాలెన్, కరవాదియమ్మలు, కొరప్రాణము, కూరలు, కారాటము, కరి, కోరిరి, కూరుకు, కూరుట,

గారవము, గరువము, గారాము, గరుసెడి బంగారము, గురుగులు, గరితలు, గోరది, గురువులు, గరుదాల్చి, గరువు, గరువతనము, గురుగులు, వేగిరిపడి, జేగురు, గోరు, గిరగిర, గరుసులు, గరుసింగారము,

చేరువ, చెచ్చెర, చేరిరి, అచ్చెరువు, చొరవ, చెరువుట. చీరలు, చీరికిగొనక, అచ్చెరియము, చూరే, చిరుగని చీరలు, వచ్చిరి అచ్చరలు,

జరిగి, జరలు, నిల్చిరి, చేసపుట, చొరువు,

తరితాడు, తరువ, తరిమిడి, తిరుగుట, తిరియుట, తిరము, తెరలు, తెరువు, తరలు, తరతరము, మారుత్రు, నెత్తురు, తోరము, తెరయు, తొరుగుట, తేర, తెరతేర, ఏతేరగ, నేర్తులు, తారును, తేరెక్కు, తరమెంచక, చనుదెంతురు, తొరలిన, తెరువులు, తూరుపుదెస, వత్తురు, తీరనికోపము, తరగలు, తెరలంగ్రాగిన, కస్తురి, చిత్తురువలయగ, ఉద్యోగింతురు, దరికొని, కుదురుగ, జూదరి, దొర, దొరకోల్, దురుము, ఎదురు, దురపిల్లు, దొర (సరి), దరిదొక్కుట, దొరకొను, దొరకొల్పు, దురదుర, దొరసిన,

నేరమి, నరములు, నరలు, నారలు, నోరు, నీరు. నారసము, కన్నారము, నెరయగ, నేరక, నురుప్ర, నేరేటు, నెరసులు, నేరుపు. నారి (వింటితాడు), ఉన్నారు, నీరెరి, పరగ, పరికింప, పరువడి, పురుడు, (పురుడుసూతకము), పరిమార్చు, దెప్పరము, పరుసు, పొరయక, పొరిబొరి, పరుసన, పొరిగొని, పురపుర, పెరుగు, పొంపిరి కోవు, పెరుగుట, పొరుగు, పరిగొని, పరిచనుదెంచు, పరువము పెన పరి, నేరుపరి, పురిగొలుపు, పొరపొచ్చెము, చప్పరము, పొరలితి, పరుపు, పరుసము, పెరడు, పరిపరి, పరగించు, పొరిగడుగు, పరిసరము, పోరితము, పోరు, పిరగొను, పేరు, తేనెపెర, పేరురము, పేరడి, పరపుట, పోరచి, పేరిననేయి, పారాటము, పోరా, పోరు, పోరామి.

బూరటిలు, బారిసమరు, బోరగిలు, బరవసము, బోరని బ్రమోము, బారిబస, బెరసి, పరిమెయి, బీరము, నిబ్బరము, బురజలు, బిరుదులు, బిరబిర, బరులుబ్బు

మురిసెను, మరలుట, మరిగించుకొను, మెరమెర, సుమ్మర, మొరపరాళ్ళు, మొరసెను, మేరలుదప్పు, మారిమసంగు, మొరడు, మరియాద, మీరలు, ఈమరి, నూరేళ్ళు, మురియలు, మిరియము, మరుపగవలె, తామర, మురిపెము, క్రమ్మర, మారట, వేమారు, మురమురా, మరులు,

రూపించు, రేగు, రచ్చ. రూపు, రమ్మా, రిచ్చ, రోయు, రూపు, రాలుట, రంకులు, రాయంచ, రిత్త, రక్కసి, రాయుచు, రాచుట, రాదు, రాచూలి, రేమెంత, రేకు, రూఢి, రాయిడి, రుచి, రారు, రమణ, రోజుచు, రారా, రాగిల్లు, రమ్ము, రాసి, నేనేరా,

వినరా, వారించుట, ఎవ్వరికి, వారికి, వారకము, విరులు, వారక, వాహువము, పల్వురకు, వీరు, వరటము, వరువుళ్ళు, ఏవుక, విరియుట, వరుస, వెరవు, విరవిర, నల్వురు, నవ్వారె, పురిగొన, వెర విడి, వారకుల, ఆర్వురు, వేరము, తలవరి, వెరసు, విరియుంజల్లు, వారని, ఓవరి, దేవర, వారాశి, సరబడి, ఏసిరి, సైరణ, సురిగితి, సురి, సూరెలు, సిరి, చేసిరి, సురియలు, సోరణగండులు, సాదిన్

వేసరులు, సొకటూసారెల్, సరకుచేయు, సరులు, మోహారము, ఓహారి, ఆహిరి, బేహారి, ఫట్టిరి, తిట్టిరి, కూలిరి, భూపాలుసు, నెయ్యూరు, పోటరి.

## శకటరేఫలుగల పదముల పట్టిక :—

అఱపఱలు, అఱుకట, ఉక్కఱు, అఱిముఱి, అఱచు, అఱువుడు జోళ్ళు, ఏపఱ, అఱుమెడలక, పొల్పఱి, అఱువదికోట్లు, అఱపొఱడు, రూపఱ, అఱపులు, బిట్టఱ, అఱచేయి, అఱుగుడు, సిగ్గఱి, అఱుముట, అఱలేనివానికి, అఱుగును, అఱకాలందన్ని, అఱుకమ్మ్రట, అఱగొఱలేక, వెంపఱ, ఆఱడి. అడలాఱు, ఆఱువులు, ఆఱుచవులు, ఆఱనితేజంబు, ఆఱమ్మ్రల, పాపముఱోటూటె, ఇఱికికొని ఇఱులుకొను, ఇఱికిటి, మిఱుచన్నుగవ, ఇఱమి, క్రిక్కిఱియగ, ఇఱిసిన, ఱాగళులు, ఉఱవుగ, ఉఱుకుట, పదమూఱి, ఉఱుముచు, ఉఱక, చిచ్చుఱికించు, ఉఱడు (గ్రైకొనడు), ఉఱునట్టి, ఊఱడిలంగా, ఉఱిది (నిలకడ), ఊఱిన, ఉఱుగడ, ఎఱచి, ఏఱులు, ఎఱగుట, ఎఱమంట, ఎఱుక, తలనెఱవ, ఎఱకలు, ఎఱిగిన, ఏఱుల్, ఒఱవశరీరము, మన్మథునొఱపులు, బఱిగాలనుండి, ఒఱగెను, ఒఱపుగలకత్తి, ఒఱ, ఒఱలుచు, కఱచెను, అక్కఱపడి, క్రిక్కిఱిసి, కాఱులు, ఉక్కఱవడి, కుఱుకులు, కఱతలకలికి, కఱపించు, కఱచుబండ్లను, కఱవులు, కుఱకొని, కుఱగలికొను, కొఱమాలి, కొఱతపడు, కఱవు, కొఱగాదు, కొఱవి, కాఱియఁబెట్టు. కఱటెందెలుపగ, కఱకంఠా, కుఱగలి (చేర్పబడు). కొఱలుట (పూర్ణమగుట), కోఱలు, కఱకులు, అక్కఱ, కుఱచ, కాఱెడు, కొఱపము, కాఱడవి, కొఱడు, కుఱుమాపు, కొఱగలవాడు, కుఱుకుఱి, కఱవేని, చేకుఱు, కరుకెక్కఱ, పింజగఱచి, కొఱకుటల్, కఱకు, కఱకఱి, గిఱుపుట, గుఱుకొని, గొఱియలు, గిఱిగొను, పగఱ, గీఱిన, గుఱుతుల్, గుఱియుగ, గుఱుములు (గింజలు), గఱిగుఱుకలు, గిఱుచెప్పుట, గుఱిచి, గురుగుఱ్ఱను, గుఱుసెట్టు. గఱులు, చెఱుచు, క్రచ్చఱ, చెఱకు. చఱి, చిఱుముట, చిచ్చుఱపిడుగై, చుఱచుఱ, చిచ్చఱకంట, చెఱపెట్టుట,

చెఱువమయుట, చుఱుపుచ్చుట, చెఱకువిల్లు, చూఱవిడుచు, చిఱు నగవు, చిఱుతదనము. చెఱచుట, చఱిగొను, ముచ్చిఱుట, చెఱగు, చేఱుట, వాచఱచి, ఇలచఱచి, పోఱుట, చెఱుసగము, ... ... ...

... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ... .

పెక్కు మాఱులు, మఱునాడు, మాఱుపడు, మైమఱపులు, మెఱు జూపులు. మాఱేగ, మఱదలు, వఱలు, వెఱవెఱ, పెఱచఱవ, విఱుగు విఱిచి, విఱుగుట, వెఱమృగములు, వఱదులు కూసెను, వేఱొక, మఱతురు, వఱతింద్రోవంగ, విఱుగాలి, పీఱిడి, నివ్వెఱవాటు, అఱ్ఱు ఱవిక, ఱంకు, ఱాయి, ఱెక్కించు, ఱేపు, ఱేవు, ఱేను, ఱేసి, ఱెక్క, ఱేడు, ఱెప్ప, ఱివ్వన, ఱాచుడు, సుఱసుఱ, సాఱసాచ్చు

"మఱి కలిగనేని దెలియదు, తఱచెందును లేవు కృతుల దలపగ కష్టా" (10 ప)

"తరితాడు" అను పదము, త్రిపురాంతకోదాహమున త్రఱితాడు'గ వాడబడియున్నది. "కొఱప్రాణములు" అను పదము "రంగనాథ రామాయణము"న "కొఱప్రాణములతోడ"అని ప్రయోగింపబడియున్నది. 'ఉఱుము'ను అప్పకవి 'చెట్టురుముట'అని సాధురేఫమును చెప్పెను.

# శ్రీ భగవద్గీత తెలుగు వచనము

## అనువాదము

## ఆంధ్ర వేదాంతము

ఇది తాళ్ళపాక పెదతిరుమలయ్య కృతము. దీనికి 'ఆంధ్ర వేదాంతము'నియు, 'భగవద్గీతాటీక' యనియు నామాంతరములుగలవు ఇది సంస్కృత మహాభారతము నందలి భీష్మపర్వాంతర్గతమగు భగవద్గీత పదునెనిమిది అధ్యాయములకు సంగ్రహ తాత్పర్య రూపమున రచియింపబడిన తెలుగు వచనము.

గ్రంథాంతమున, 'ఇది శ్రీ మత్తాళ్ళపాక అన్నమాచార్య పుత్రుండైన తిరుమలయ్యగారు భగవద్గీతార్థము తెలుగుజేసి అర్థం ప్రాప్తించినది పద్దెనిమిది అధ్యాయాలు సంపూర్ణము.

కం॥ ధర తాళపాక అన్నయ
వరసుతుడగు తిరుమలయ్య వాచాప్రౌఢిన్
వెరవున భగవద్గీతల
పరమార్థము లంధ్రభాష పరగ రచించెన్'-అనిగలదు.

శ్రీ భగవద్గీత తెలుగువచనము'ను శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధనాలయం, తిరుపతి వారు 1978లో పరిష్కరించి ముద్రించిరి. పరిష్కర్త ఆచార్య జి. యస్. రెడ్డిగారు.

శ్రీ కృష్ణప్రోక్తమగు గీతోపనిషత్తును ఆంధ్రీకరించుటకు పూనుకొనుట తాళ్ళపాకవారి శ్రీకృష్ణభక్తి విదితమగుచున్నది.

టీకారంభమునకు పూర్వము విశిష్టాద్వైత సాంప్రదాయము ననుసరించి గీతాపఠనమునకు ముందు చేర్చబడు ధ్యానశ్లోకన్యాసాదుల నన్నిటిని కూర్చుకొనియే రచన నారంభించెను. గ్రంధమున వరుసగా పదునెనిమిది అధ్యాయములలోని శ్లోకములను ఉదహరించుచు తేట తెలుగు వ్యవహారిక రూపమున పెదతిరుమలయ్య లఘువివరణతో గొందుపరచెను.

భాగవద్గీత యందలి కొన్ని భాగములను మచ్చునకు క్రింద పొందు పరచడమైనది.

ఇందు, 1. మొదటి అధ్యాయము - అర్జున విషాదయోగం.

రెండవ అధ్యాయం - సాంఖ్యయోగం,
మూడో అధ్యాయం - కర్మయోగం,
నాలుగో అధ్యాయం - జ్ఞానయోగం,
అయిదో అధ్యాయం - కర్మసన్యాసయోగం,
ఆరో అధ్యాయం - అభ్యాసయోగం,
ఏడో అధ్యాయం - పరమహంస విజ్ఞానయోగం,
ఎనిమిదో అధ్యాయం - అక్షరపరబ్రహ్మ యోగం,

తొమ్మిదో అధ్యాయం - రాజవిద్యారాజగుహ్యయోగం,
పదో అధ్యాయం - విభూతియోగం,
పదకొండో అధ్యాయం - విశ్వరూప సందర్శనయోగం,
పన్రెండో అధ్యాయం - భక్తియోగం,
పదమూడో అధ్యాయం - క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగం,
పధ్నాలుగో అధ్యాయం - గుణత్రయ విభాగయోగం,
పదిహేనో అధ్యాయం - పురుషోత్తమయోగం
పదహారో అధ్యాయం - దైవాసుర సంపద్విభాగయోగం
పదిహేడో అధ్యాయం - శ్రద్ధాత్రయ విభాగయోగం,
పద్దెనిమిదో అధ్యాయం - మోక్షసన్యాసయోగం,

అని విభజింపబడి రచింబబడి యున్నవి.

భగవద్గీత తెలుగు వచనమునందు, గురుస్తోత్ర శ్లోకములు, వ్యాసస్తోత్రశ్లోకములు, మహాభారతస్తుతి శ్లోకములు, కృష్ణస్తోత్ర శ్లోకములు, భగవద్గీతాస్తోత్ర శ్లోకములు, వ్యాసస్తోత్ర శ్లోకములు గలవు.

**అవతారిక :**

ధర్మరాజువారున్నూ, దుర్యోధనుని వారున్నూ యుద్ధానకు ఆయత్తపడి వుభయ దళాలున్నూ మోహరించి వున్నందుకు ధృతరాష్ట్రిడు తవ కొలువు చావడిలోను చింతిస్తూవుంశగాను అక్కడికి వేదవ్యాసులు వచ్చి, ధృతరాష్ట్రిడా! నీ వేల వగచేవు? కృష్ణస్వామి భూభారం అణచనవతరించినాడు. ఆపోట్లాడే రాజులకెల్లాను కాలం చేరువై వున్నది. యెవరు మాన్పినాను మానదు. నానాటి యుద్ధము నీకు తెలియచెప్పేటట్టుగాను నాయనుగ్రహం వల్లను త్రికాలవేదియైన సంజయుడు నీకు చెప్పుచున్నూ వచ్చేనీ. అని సంజయుని ధృతరాష్ట్రిని వద్ద బెట్టి వేదవ్యాసులు తన ఆశ్రమానకు పోయెను. అటు తరువాత ధృతరాష్ట్రిడు సంజయున్ని పోట్లాడే వివరం అడుగుచున్నందును. ధృతరాష్ట్రిడు సంజయునితో వొఖమాట పలికినవాడాయను.

## ధృతరాష్ట్రుని వాక్యం :

'వోయి సంజయుడా ! ధర్మక్షేత్రమైన కురు క్షేత్రమందు యుద్ధముకొరకు నిశ్చయించి కూడి నటువంటి కౌరవులున్నూ, పాండవులున్నూ యేమేమి చేశిరి ? అని అడిగితేను.

సంజయ ఉవాచ.

అప్పుడు రాజైన దుర్యోధనుడు వ్యూహాకారముగాను మూక గూడి యుండిన పాండవసేన జూచి ఆచార్యుని దగ్గరి.

'గాండీవం స్రంసతే హస్తాత్"-అనుశ్లోకము (1-30) నకు, చేతినుండినీ గాండీవమనే విల్లున్నూ, జారుచున్నది. శరీరమందలి చర్మమున్నూ మండుచున్నది. నా మనస్సు భ్రమసినట్టువలెనే ఉన్నది నిలువశక్తుండనుడాకను వున్నాడను' అనిచెప్పబడినది.

సాంఖ్యయోగంలో, 'కుతస్త్వాకశ్మలమిదంవిషమే—' (2-2) అను శ్లోకమునకు, 'వోయి అర్జునుడా ! అల్పులకు ప్రాప్తమైనదిన్నై, స్వర్గవిరోధమై, అపకీర్తికరమై, కశ్మలమైన యీ శోకము విడువుము. యీ విషయమైన యుద్ధమందు నిన్నెటు పొందెను' అని గలదు.

కర్మయోగంలో' లోకేస్మిన్ ద్వివిధానిష్ఠాపురాప్రోక్తామయానఘ...'అనుశ్లోకమునకు,' యీ లోకమందు జ్ఞానులకు జ్ఞానయోగం చాతనైన నిష్ఠాను, కర్మయోగులకు కర్మయోగంచాతనైన నిష్ఠాను అనెడి యీ రెండు విధాలున్నూ పూర్వమందు నాచాత జెప్పబడెను. అది నీవు మనస్సున బెట్టక మరిస్తిలి"- అని పెదతిరుమలయ్య తెలుగు వచనము చేసియున్నాడు.

ఏడో అధ్యాయమైన 'పరమహంస విజ్ఞాన యోగం"లో గల శ్లోకములకు గలటీక క్రిందివిధముగ నున్నది.

భూమిరాపానలో వాయుఃఖం మనోబుద్ధిరేవచ

అహంకార ఇతీయం మేభిన్నాప్రకృతిరష్టధా' (7-4) అను శ్లోకమునకు "భూమిన్నీ వుదకమున్ను, అగ్నిన్నీ వాయువున్నూ, ఆకాశమున్నూ, మనస్సున్ను, బుద్ధిన్నీ, అహంకారమున్ను అనెడి

అష్టభేదాలు గలిగిన సమస్తానకున్నూ కారణమైన ప్రకృతిని నావశమైన దానిగా నెరుగుము" అని చెప్పబడియున్నది.

'అపరేయమితస్త్వన్యాం ప్రకృతింవిద్ధి మేపరామ్

జీవ భూతాం మహాబాహో యమేదం ధార్యతే జగత్"(7-5) అనుదానికి, 'యిది అపరప్రకృతి, యింతకంటేను అన్యమైనయేప్రకృతి చాతను యీ సర్వజగత్తులున్నూ ధరింపబడును. అదినా సంబంధమైన పరప్రకృతిగా నెరుగుము" అనిగలదు.

'రసోహ మప్సు కౌంతేయ ప్రభాస్మి శశిసూర్యయోః

ప్రణవః సర్వవేదేషు శబ్దః ఖేపౌరుషం నృషు" (7-8) అను శ్లోకమునకు, సర్వప్రపంచమున్నూ నాకు శేషమై శరీర భావం బొందినది గనుక వుదకాలందు చలివి గలుగ జేశేవాడనేనే. సూర్యచంద్రుల యందు ప్రభయై యున్నవాడానేనే. సర్వవేదాలందున్ను ప్రణవమైననేనే. ఆకాశమందు శబ్దమున్ను నేనే"-అనిగలదు.

'రాజవిద్యారాజ గుహ్యయోగం' అను తొమ్మిదో అధ్యాయమునగల, 'అనన్యాశ్చింతయంలో మాం యే జనాః పర్యుపాసతే తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యం' (9-22) అను శ్లోకమునకు, యే జనులునైనానేమి యితర దేవతల గొలువక, కోరికలు గోరక, నన్నే గతియని గొల్తురు, నిత్యమున్నూ నా తోడి యోగమే అపేక్షించేవారి యోగ క్షేమం వహించుకొని మోక్షము యిత్తును"-అని టీక గలదు.

"భక్తియోగం"అను పంద్రెండో అధ్యాయంలోని, 'శ్రేయోహి జ్ఞాన మభ్యాసా జ్జ్ఞానాద్ధ్యానం విశిష్యతే ధ్యానాత్కర్మఫలత్యాగస్త్యాగా చ్ఛాంతి రనంతరమ్" (12-12) అనుదానికి,

'సంతతమున్నూ నా మీదను భక్తి అభ్యసించుట దొరకదు దానికి ఆత్మజ్ఞానము యించుక సులభము ఆయాత్మ జ్ఞానం దొరకని వానికి ఫలంగోరక కర్మానుష్ఠానము చేస్తేను శాంతం కలుగును. యిటనగాను యేమనుట అంటేను, శాంతుడైతేను ధ్యానంగలుగును.

ధ్యానం గలిగితేను ఆత్మగనవచ్చును. ఆత్మనుగను కంటేను భక్తి నిష్ఠ మహాఘనమనుట'-అని చెప్పబడియున్నది.

క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగం' అను పదమూడో అధ్యాయం లోగల, క్షేత్రజ్ఞం చాపిమాం విద్ధి సర్వక్షేత్రేషు భారత క్షేత్రక్షేత్రజ్ఞయోర్జ్ఞానం యత్తద్ జ్ఞానం మతంమయ' అను శ్లోకమునకు,' క్షేత్రజ్ఞుడయినటువంటి ఆత్మను జ్ఞానానకు శరీరమైన వాడుగా నెరుగుము. జ్ఞానానకు ఆత్మ శరీరమయినట్టే యీ యాత్మనునాకు శరీరంగా నెరుగ లేను. యీ క్షేత్రం యొక్కటను, క్షేత్రజ్ఞుని యొక్కటను స్వరూపమును యెరుగుటనాకు సమ్మతము' అని గలదు.

'గుణత్రయవిభాయోగం'అను పధ్నాలుగో అధ్యాయంలోగల

"సత్త్వాత్సంజాయతే జ్ఞానం రజసోలోభఏవ చ

ప్రమాద మోహౌ తమసో భవతోఉజ్ఞానమేనచ॥"

అనుదానికి మరిన్ని, సాత్త్విక గుణము వల్ల జ్ఞానమే పుట్టును. రాజస గుణంవల్ల మరుపున్ను, అజ్ఞానమును పుట్టును అని చెప్పబడియున్నది.

'దైవాసుర సంపద్విభాగయోగం' అను పదహారో అధ్యాయంలో గల "త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః

కామఃక్రోధ స్తథాలోభ స్తస్మాదేతత్త్రయంత్యజేత్ "

అను శ్లోకమునకు యీ అసుర భావము తానేలవచ్చునంటేను, కామమున్ను, క్రోధమున్ను, లోభమున్ను అనెడి యీ మూడున్ను అసురస్వభావమనే నరకానకు వాకిలి అది ఆత్మనూన్ను చెరిచేడిది. అటుగనక యీ కామక్రోధలోభాలను విడువుము"అని గలదు

పెదతిరుమలయ్య శ్రీభగవద్గీత తెనుగు వచనములో, శేషశేషి దేహదేహీ భావములను, మతాంతర, దేవాంతర, దేవాంతర విషయములను వ్యక్తము చేయుటలోను విశిష్టాద్వైతమత దృక్పదమే గోచరమగును.

పెదతిరుమలయ్య తన భగవద్గీతవచనమున ప్రతి అధ్యాయాంతమున, శ్రీభగవద్రామానుజ విరచితమైన శ్రీగీతాభాష్యక్రమాన

శ్రీమత్తాళ్ళపాక అన్నమాచార్యుల పుత్రుడు తిరుమలయ్యంగారు భగవద్గీతార్థము తెలుగు చేసి వ్రాయించె"నని చెప్పుకొని యున్నాడు.

## ఆధార గ్రంథములు


1. ఆంధ్రవాగ్గేయకార చరిత్రము - బాలాంత్ర పురజనీకాంతరావు
2. తాళ్ళపాక కవుల కృతులు - వివిధసాహితీప్రక్రియలు - డా॥ వే. ఆనందమూర్తి
3. వేంకటేశ్వర వచనములు
4. శృంగార దండకము
5. చక్రవాళమంజరి
6. శృంగార వృత్తశతకము
7. నీతిశతకము
8. రేఫ అకార నిర్ణయము
9. వేంకటేశ్వరోదాహరణము
10. సుదర్శన రగడ
11. (శ్రీ) వేంకటేశ ప్రభాతస్తవము
12. భగవద్గీత తెనుగు వచనము
13. The miror works of Annamacharya and his sons


24448

అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం
అన్నమయ్యవీధి, గుంటూరు-6